www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
ఆదివారం
14-07-2024
సంపుటి : 01 | సంచిక : 71 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


డా॥ కాచం సత్యనారాయణ
CMD

## రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాలకు ఏసీ బస్సులు

- కొత్తగా 2500 బస్సులు కొనుగోలు చేస్తున్నాం
- ఆర్టీసీకి రూ.280 కోట్ల బకాయిల్లో రూ.80 కోట్లు చెల్లించాం
- నల్లగొండలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



2

## వృద్ధురాలి పెన్షన్ రికవరీపై స్పందించిన సీతక్క

- మల్లమ్మకు డబుల్ పెన్షన్ వస్తోంది
- ఒకే వ్యక్తికి రెండు పెన్షన్లు నిబంధనలకు విరుద్ధం
- మొత్తం 1,862 మందికి డబుల్ పెన్షన్ వస్తుంది
- వారందరికీ ట్రెజరీ శాఖ నోటీసులు ఇచ్చిందన్న సీతక్క



2

## శుభ్ ఆశీర్వాద్ వేడుకకు ప్రధాని మోడీ

- సాదర స్వాగతం పలికిన ముకేశ్ అంబానీ
- అనంత్ - రాధికకు ఆశీర్వాదం
- బ్రిటన్ మాజీ పీఎం టోనీ బ్లెయిర్‌తో మోడీ మాటముచ్చట



2



## పెన్షన్ డబ్బులు లాక్కుంటారా?

### తిరిగి ఇవ్వమనడం దుర్మార్గం

- ఒంటరి వృద్ధ మహిళను డబ్బులు అడుగుతారా?
- ప్రజలు తిరగబడే రోజు వచ్చింది
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

**విశ్వంభర, హైదరాబాద్:** ఆసరా పెన్షన్ డబ్బులు తిరిగి చెల్లించాలంటూ కొత్తగూడెం జిల్లాకు చెందిన దాసరి మల్లమ్మ అనే వృద్ధురాలికి అధికారులు నోటీసులివ్వడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలిక ఊడినట్టుందని ఎద్దేవా చేశారు. కొత్తగా అనేక పథకాలు ఇస్తామని, **మిగతా2లో...**

# దానంకు రేవంత్ బిగ్ టాస్క్

### బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తెచ్చే బాధ్యత అప్పగింత

- గ్రేటర్ ఎమ్మెల్యేలపై స్పెషల్ ఫోకస్
- చర్చలు జరుపుతున్న దానం నాగేందర్
- 48 గంటల్లో ముగ్గురు ఎమ్మెల్యేల చేరిక
- టాస్క్ పూర్తి చేస్తే దానంకు సీఎం భారీ ఆఫర్?
- అనర్హత పడకుండా వ్యూహాత్మకంగా కాంగ్రెస్ ప్లాన్
- ఎమ్మెల్యేలను కాపాడుకోలేక విలవిలలాడుతున్న బీఆర్ఎస్



**ముఖ్యమంత్రి రేవంత్ ఆపరేషన్ బీఆర్ఎస్ కొనసాగిస్తున్నారు. వరుసగా గులాబీ ఎమ్మెల్యేలను తమ వైపు తిప్పకుంటున్నారు. బీఆర్ఎస్‌ను ఖాళీ చేయటమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతం 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీ ఎమ్మెల్యేల సంఖ్య 28కి చేరింది. ఇదే సమయంలో గ్రేటర్‌లో పట్టు కోసం దానంకు రేవంత్ బిగ్ టాస్క్ అప్పగించారు. అందులో సక్సెస్ అయితే కీలక పదవి ఆఫర్ చేసినట్లు తెలుస్తోంది.**

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి 39 మంది ఎమ్మెల్యేలు గెలవగా.. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో ఆ సీటును కాంగ్రెస్ గెలవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 38కి చేరింది. ప్రస్తుతం 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీ ఎమ్మెల్యేల సంఖ్య 28కి చేరింది. ఓ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే మరో పార్టీలో చేరితే పదవికి రాజీనామా చేయాల్సి వస్తోంది. అదే ఒక పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేల్లో 2/3వంతు వేరే పార్టీలో చేరితే పార్టీ శాసనసభా పక్షం విలీనమైనట్లు పరిగణిస్తారు. దీంతో ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వర్తించదు.

**గ్రేటర్ పై గురి**

ఈ ప్లాన్‌లో భాగంగా మొత్తం 26 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకునేందుకు హస్తం పార్టీ ప్లాన్ రెడీ చేసింది. ఇప్పటికే 10 మందిని చేర్చుకోగా.. మిగిలిన 16 మందిని మరో 15 రోజుల్లో చేర్చు కునేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంది. ఈ విషయాన్ని బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే **మిగతా2లో...**

## హస్తం గూటికి అరికపూడి

- కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే గాంధీ
- కండువకప్పి ఆహ్వానించిన సీఎం రేవంత్
- తొమ్మిదికి చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరిక
- సాయంత్రం గూడెం మహిపాల్ రెడ్డి సీఎంతో భేటీ
- చేరికపై అధికారిక ప్రకటనే తరువాయి..



2

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బెదిరిస్తున్న కాంగ్రెస్

- భయపెట్టి హస్తం కండువా కప్పుతున్నారు
- అతి తక్కువ కాలంలో అప్రతిష్ట మూటకట్టుకున్న కాంగ్రెస్
- బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి సంచలన ఆరోపణలు



2

## ఆశపడ్డ నిరుద్యోగులకు నిరాశే మిగిలింది



- ఉద్యోగాల పరీక్షకు గ్యాప్ అడిగితే గొడ్లను కొట్టినట్టు కొడుతుర్రు
- అహంకారంతో వ్యవహరిస్తే కేసీఆర్‌కు పట్టిన గతి పడుతుంది
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఫైర్

2

### ఒకటో తేదీన ఉద్యోగులకు వేతనాలు వట్టి మాటే..

2

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 108 | ₹ 131 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹ 190 | ₹ 216 |




## యూపీఎస్సీ తరహాలో జాబ్ క్యాలెండర్

- ప్రతి ఏటా ఉద్యోగాలు భర్తీ చేస్తాం
- డిసెంబర్ 9 నాటికి ఖాళీల భర్తీ చేస్తాం
- పుస్తకాల్లో చదువులకు మార్కెట్లో సమాజానికి ఏ మాత్రం పొంతన లేదు
- ప్రపంచ దేశాల విద్యార్థులతో పోటీపడేలా టెక్నికల్ కోర్సుల సిలబస్ మారాలి
- గ్రూప్ 1 ఫైనల్స్‌కు 1:50కి బదులుగా 1:100 పద్ధతి సరికాదు
- జేఎన్టీయూలో క్వాలిటీ విద్యపై నిర్వహించిన సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో జాబ్ క్యాలెండర్ పై సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. యూపీఎస్సీ తరహాలో ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారు. జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన క్వాలిటీ విద్యపై సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి, ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఇంజనీరింగ్ విద్యపై విద్యాసంస్థల యాజమాన్యాలతో ఇంటరాక్షన్ జరిపారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు కీలక సూచనలు చేశారు. గ్రూప్ 1 ఫైనల్స్‌కు 1:50కి బదులుగా 1:100 పద్ధతిని అనుసరించాలని **మిగతా2లో...**

## మళ్లీ పార్టీలోకి రానివ్వం

- వెళ్లిపోతున్న వారు ఆలోచించుకోండి
- పార్టీలో కొత్తతరం నేతలు తయారవుతారు
- మాజీ ఎంపీ వినోద్ కుమార్



**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్‌లో గెలిచి వేరే పార్టీలో చేరుతున్న వాళ్లను చూసి బాధపడాల్సిన పనిలేదని మాజీ ఎంపీ బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ అన్నారు. వాళ్లు అప్పుడు అభివృద్ధి కోసమే బీఆర్ఎస్‌లో చేరుతున్నామని చెప్పారని.. ఇప్పుడు కూడా అదే చెప్పి పార్టీ మారుతున్నారని విమర్శించారు. **మిగతా2లో...**

### బక్క జడ్సన్ హెల్త్ కండిషన్

## సీరియస్!

- నిరుద్యోగ సమస్యలపై 10 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష
- ఉలుకు పలుకు లేకుండా బెడ్‌పై జడ్సన్
- ఆస్పత్రికి తరలించిన రజిని సాయిచంద్
- పట్టించుకోని పాలకులు, పార్టీలు



2

# హస్తం గూటికి అరికపూడి

**విశ్వంభర, హైదరాబాద్ :** బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ ఆ పార్టీని వీడారు. శనివారం ఆయన జూబిలీహిల్స్ లోని సీఎం నివాసంలో రేవంత్ రెడ్డి సమక్షంలో హస్తం తీర్థం పుచ్చుకున్నారు. రేవంత్ రెడ్డి ఆయనకి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అరికపూడి గాంధీతో పాటు ఆయన అనుచరులు కూడా రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యారు. శనివారం కాంగ్రెస్ లో జాయిన్ అయిన అరికపూడి గాంధీతో కలిపి మొత్తం తొమ్మిది మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ ని వీడారు. వీరంతా గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ లోకి జంప్ అయ్యారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. శుక్రవారం రాత్రి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ చేరగా శనివారం అరికపూడి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

**సీఎంతో మహిపాల్ రెడ్డి భేటీ**

పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం అయింది. శనివారం రాత్రి జూబ్లీహిల్స్ లోని సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్లి కలిశారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డీ తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని చర్చలు జరిపారు. ఇవాళో, రేపు తన అనుచరులతో మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు.

# శుభ్ ఆశీర్వాద్ వేడుకకు ప్రధాని మోడీ

**విశ్వంభర,ముంబై:** పలు డెవలప్మెంట్ కార్యక్రమాలను ప్రారంభించేందుకు ముంబైకి వచ్చిన పీఎం నరేంద్ర మోడీ శనివారం రాత్రి 8.30 గంటలకు జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్లో జరుగుతున్న అనంత్ అంబానీరాధికా మర్చంట్ 'శుభ్ ఆశీర్వాద్' వేడుకకు హాజరయ్యారు. అక్కడ ఆయనకు రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత , ప్రపంచ కుబేరుడు ముకేశ్ అంబానీ సాదర స్వాగతం పలికారు. అనంతరం తన వెంట ప్రధాని మోడీని 'శుభ్ ఆశీర్వాద్' కార్యక్రమ ప్రధాన వేదిక దాకా ముకేశ్ అంబానీ తీసుకెళ్లారు. ఈ వేదికపైకి చేరుకున్న ప్రధాని నరేంద్ర మోడీ.. వివాహ బంధంతో ఒక్కటైన అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారికి ఆయన వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా తమ కోడలు రాధికా మర్చంట్ తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులను పీఎం మోడీకి ముకేశ్ అంబానీ, నీతా అంబానీ దంపతులు పరిచయం చేశారు. బ్రిటన్ మాజీ పీఎం టోనీ బ్లెయిర్ సహా పలువురు విదేశీ ప్రముఖులు అక్కడ మోడీని కలిసి ముచ్చటించారు. తర్వాత ప్రధాని మోడీ అక్కడే డిన్నర్ చేసి బయలుదేరారు.

# ఆశపడ్డ నిరుద్యోగులకు నిరాశే మిగిలింది

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఔట్సోర్సింగ్ ఉద్యోగులు తమ డిమాండ్లపై ఏర్పాటు చేసిన రౌండ్ టెంపుల్ సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. సోమాజిగూడలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగాల భర్తీ జరుగుతుందని ఆశపడ్డ నిరుద్యోగులకు నిరాశే మిగిలిందని ఈటల ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ దేవుడు ఎరుగు.. ఇప్పుడు జరుగుతున్న ఉద్యోగాల పరీక్షకు గ్యాప్ ఇవ్వమని అడిగితే గొడ్లను కొట్టినట్టు కొడుతున్నారని పేర్కొన్నారు. కోచింగ్ సెంటర్లు డబ్బులు ఇస్తే నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నారని సీఎం అభాండాలు వేస్తుంటే కంచె చేను మేసినట్టు ఉందని ఆరోపించారు. అహంకారంతో వ్యవహరిస్తే కేసీఆర్కి ఏ గతి పట్టిందో మీకు కూడా అదే పడుతుంది అనే సోయితో పనిచేయండని సూచించారు. భేశాజాలకు పోకుండా వారు అడుగుతున్న డిమాండ్స్ పట్ల సానుకూలంగా స్పందించాలని కోరుతున్నానని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో అనేక సంవత్సరాలుగా ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు.. వీరంతా ఉన్నత చదువులు చదివిన వారని తెలిపారు. వీరికి ఏజెన్సీల ద్వారా జీతాలు అందిస్తున్నారు.. ESI, PF, GST పోయిన తర్వాత రూ. 9 వేలు కూడా రావడం లేదని తెలిపారు. వీరు అడుగుతున్న డిమాండ్లు పెద్దవి కావు.. డిపార్ట్మెంట్ నేరుగా జీతాలు ఇవ్వాలనీ కోరుతున్నారన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సేఫ్ గార్డ్స్ ఇవ్వాలని కోరారు. నెల వారీగా జీతాలు ఇవ్వాలి.. ఉద్యోగం తీసివేయకుండా భద్రత కల్పించాలని ఎంపీ పేర్కొన్నారు. ESI, PF. హెల్త్ కార్డులు కల్పించాలని డిమాండ్ చేశారు.

# రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాలకు ఏసీ బస్సులు

**విశ్వంభర, నల్లగొండ:** తెలంగాణలో రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచనున్నామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. నల్గొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి నల్గొండ - హైదరాబాద్ మధ్య నాన్‌స్టాప్ ఏసీ, మూడు డీలక్స్ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ పలు విషయాలు వెల్లడించారు. కొత్తగా 1000 బస్సులు కొన్నామని.. అలాగే మరో 1500 బస్సులకు కూడా ఆర్డర్ ఇచ్చామని తెలిపారు. దసరా పండుగ లోపు నల్గొండ జిల్లాకు 30 ఎక్స్‌ప్రెస్, 30 లగ్జరీ బస్సులు అందిస్తామన్నారు. అలాగే ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సైతం పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం డీఏ ఇచ్చినట్లు గుర్తుచేశారు. రూ.280 కోట్ల బకాయిల్లో రూ.80 కోట్లు చెల్లించినట్లు పేర్కొన్నారు. మిగిలిన రూ.200 కోట్లను కూడా ఈ నెల చివరిలోగా చెల్లిస్తామని చెప్పారు. ఆర్టీసీ సంస్థలో 3,035 ఉద్యోగ నియామకాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రం నుంచి లగ్జరీ బస్సులు నడుపుతామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కేంద్రాల నుంచి ఏసీ బస్సులు ప్రారంభిస్తామని చెప్పారు.

# దానంకు రేవంత్ బిగ్ టాస్క్

(మొదటి పేజీ తరువాయి)

దానం నాగేందర్ తెలిపారు. బీఆర్ఎస్ మొత్తం ఖాళీ అవుతుందని.. ఇద్దరు నుంచి ముగ్గురే ఆ పార్టీలో మిగులుతారంటూ దానం సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ అండతో అక్రమాలకు పాల్పడిన వాళ్లను వదిలిపెట్టబోమని.. అందరి పేర్లు బయటకు తీస్తామని హెచ్చరించారు.

**దానంకు బాధ్యతలు**

కొంతమంది పేర్లను సైతం దానం నాగేందర్ బయటపెట్టారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికలతో పాటు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో తన బలాన్ని పెంచుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి పక్కా వ్యూహం రచించినట్లు తెలుస్తోంది. గ్రేటర్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ లోకి తీసుకొస్తే మంత్రి పదవి ఇస్తామంటూ దానం నాగేందర్‌కు ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో గ్రేటర్ పరిధిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి తీసుకొచ్చే పూర్తి బాధ్యతల్ని దానం నాగేందర్ తన భుజస్కందాలపై వేసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో..మరి రేవంత్ ప్లాన్ ఏ మేర సక్సెస్ అవుతుంది..కేసీఆర్ ఏం చేయబోతున్నారనేది ఆసక్తి కరంగా మారుతోంది.

# యూపీఎస్సీ తరహాలో జాబ్ క్యాలెండర్

(మొదటి పేజీ తరువాయి)

కొందరు కోరుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నోటిఫికేషన్‌లో చెప్పిన దానికి భిన్నంగా వ్యవహరిస్తే.. కోర్టులు వెంటనే ఆ ప్రక్రియను నిలిపేస్తాయంటూ పేర్కొన్నారు. దీంతో మళ్లీ గ్రూప్ 1 పరీక్షలు వాయిదా పడతాయని సీఎం రేవంత్ వివరించారు. త్వరలోనే అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని సీఎం రేవంత్ అన్నారు. మార్చి చివర్లో ఖాళీ వివరాలు తెప్పిస్తామని.. జూన్ 2న నోటిఫికేషన్ ఇచ్చి.. డిసెంబర్ 9 నాటికి ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పారు. ఈ విధానానికి చట్టబద్ధత కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. TSPSC సభ్యుల ఎంపిక విషయంలో గతంలో అవలంభించిన విధానాలను సీఎం రేవంత్ తప్పుబట్టారు. గతంలో TSPSC సభ్యుల ఎంపిక సరిగ్గా జరగలేదని.. అర్హత లేని వారికి TSPSCలో చోటు కల్పించారని ఆరోపించారు.

**రాజకీయ నిరుద్యోగులు, కోచింగ్ సెంటర్ యజమానులే..**

అలాగే తెలంగాణలో నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనల పైనా ఆయన స్పందించారు. తెలంగాణలో పదేళ్లపాటు ఉద్యోగాల కోసం యువత కొట్లాడింది. కానీ ఇప్పుడు పరీక్షలు వాయిదా వేయాలని కొన్ని రాజకీయ శక్తులు కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు ఆమరణ దీక్షలు



చేస్తున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. ముగ్గురు దీక్ష చేస్తే దాంట్లో ఒక్కరు కూడా ఏ పరీక్ష రాయట్లేదని చెప్పారు. త్వరలోనే జాబ్ క్యాలెండర్ తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి భేషజాలు లేవు, నిరుద్యోగులకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. నోటిఫికేషన్లు ప్రకారమే ప్రభుత్వం పరీక్షల నిర్వహణ ఉంటుందని, విద్యాసంస్థలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారకూడదు అనేదే మా ప్రభుత్వ విధానమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

**స్వలాభం కోసమే ముగ్గురి దీక్ష...**

కోచింగ్ సెంటర్ యజమాని పరీక్ష వాయిదా వేయమని ఆమరణ నిరహార దీక్ష చేస్తున్నాడు. నేను ఆయన ఏ పరీక్ష రాస్తున్నాడని అడిగితే.. ఆయనకి కోచింగ్ సెంటర్ ఉంది రెండు నెలలు డీఎస్సీ పోస్ట్ పోన్ చేస్తే 100 కోట్లు లాభం వస్తుంది అని చెప్తున్నారని సీఎం రేవంత్ తెలిపారు. ఇంకో ఆయన మన పార్టీలోనే ఉండే కదా ఆయన ఏం పరీక్ష రాస్తున్నాడు? దీక్ష ఎందుకు చేస్తున్నాడని అడిగితే.. నువ్వు పార్టీలో ఏం ఉద్యోగం ఇవ్వలేదని, నిన్ను గిల్లటానికి దీక్షకు కూర్చున్నాడు అని చెప్పారన్నారు. నాకు తెలిసిన ఇంకో పిల్లగాడు గాంధీ ఆసుపత్రిలో చేరి దీక్షకి కూర్చున్నాడు, ఏం పరీక్ష రాస్తున్నాడు అవసరమైతే స్పెషల్ కోచింగ్ ఇప్పిదామని అడిగితే.. ఆయన ఏం పరీక్ష రాయట్లేదు. ఒక లీడర్ చెప్పిండు అంట చేస్తే పేరు వస్తదని అందుకు చేశాడంట అని చెప్పారని సీఎం రేవంత్ వెల్లడించారు.

**అద్భుతాలు సృష్టించేది ఇంజనీర్లే...**

ప్రపంచంలో అద్భుతాలు సృష్టించేది ఇంజనీర్లు మాత్రమేనన్నారు సీఎం. అయితే కాలేజీలు సివిల్ మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులను నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. పుస్తకాల్లో చదువులకు బయట మార్కెట్లో సమాజానికి ఏ మాత్రం పొంతన లేకుండా ప్రస్తుతం అకాడమిక్ సిలబస్‌లు ఉన్నాయన్నారు. ప్రపంచ దేశాల విద్యార్థులతో పోటీపడే విధంగా టెక్నికల్ కోర్సుల సిలబస్ మారాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఇంజనీరింగ్ కాలేజీలు అంటే నిరుద్యోగులను ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీలుగా ఉండకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ ఏఐ సమ్మిట్ హైదరాబాద్ 2024 లోగోను సీఎం విడుదల చేశారు.

# ఒకటో తేదీన ఉద్యోగులకు వేతనాలు వట్టి మాటే..

- మోడల్ స్కూల్ టీచర్లకు రెండు వారాలు గడిచినా వేతనాలు రాలే..
- గెస్ట్ లెక్చరర్స్‌కు ఇచ్చిన హామీని అమలు చేయలేదు
- ఇది గెస్ట్ లెక్చరర్ల వ్యవస్థను ఎత్తేసే కుట్రే..
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు



**విశ్వంభర, హైదరాబాద్ :** ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నట్లుగా గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఒకటే తేదీన వేతనాలు చెల్లిస్తున్నామనేది కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితమైందని విమర్శించారు. మోడల్ స్కూల్ టీచర్లకు గత ఏడు నెలలుగా ఒకటో తేదీన వేతనాలు చెల్లించడం లేదన్నారు. ఇది కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిదర్శనమన్నారు. ఈ నెలలో ఇప్పటికే రెండు వారాలు గడిచినప్పటికీ మోడల్ స్కూల్ రెగ్యులర్ టీచర్స్‌కు వేతనాలు అందలేదని, దీంతో వారు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 8న సగం మంది ఉద్యోగులకు మాత్రమే ప్రభుత్వం వేతనాలు చెల్లించిందన్నారు. చాలా ప్రాంతాల్లో వేతనాలు అందలేదన్నారు. మోడల్ స్కూల్స్‌లో పని చేసే ఔట్ సోర్సింగ్, అవర్లీ బేస్ట్ టీచర్స్ దాదాపు 2 వేల మందికి ప్రభుత్వం వేతనాలు చెల్లించలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి వారికి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జూనియర్ కాలేజీలలో పని చేసే గెస్ట్ లెక్చరర్స్‌కు ఇచ్చిన మాటను ప్రభుత్వం తప్పిందన్నారు. అధికారంలోకి రాగానే రూ.42 వేల వేతనం చెల్లిస్తామని చెప్పి... ఆ తర్వాత మాట తప్పిందన్నారు. పైగా వారిని మార్చి 31 నుంచి జులై 31 వరకే కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు. విద్యాసంవత్సరం మధ్యలో ఉద్యోగాలు నిలిపివేస్తే... వారు, వారి కుటుంబాలు ఏం కావాలని మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి విద్యాసంవత్సరానికి పొడిగింపు ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గెస్ట్ లెక్చరర్ల వ్యవస్థను ఎత్తేసేందుకు కుట్ర చేస్తున్నట్లుగా వారు ఆందోళన చెందుతున్నారని... ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉందన్నారు. అభయహస్తం మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా గెస్ట్ లెక్చరర్లకు భరోసా ఇవ్వడంతో పాటు, నెలకు రూ. 42 వేల వేతనం చెల్లించి, విద్యాసంవత్సరం చివరి వరకు ఉద్యోగ కాలాన్ని పొడగించాలని డిమాండ్ చేశారు.

# మళ్లీ పార్టీలోకి రానివ్వం

(మొదటి పేజీ తరువాయి)

పార్టీలు మారే ఎమ్మెల్యేలపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. వాళ్లు తిరిగి వస్తామంటే ప్రజలు రానివ్వరని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. త్వరలోనే పార్టీ సమావేశాలు పెట్టుకుందామని.. కొత్తతరం నేతలను కేసీఆర్ ప్రోత్సహిస్తారని చెప్పారు.బీజేపీకి కేంద్రంలో సొంతంగా మెజారిటీ రాలేదని బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బోయిన్‌పల్లి వినోద్ అన్నారు. టీడీపీ, జేడీయూ తదితర పార్టీల మద్దతుతోనే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిందని తెలిపారు. ఏపీ విభజన చట్టంలో ఉన్న అంశాలపై ఇటీవల చంద్రబాబు ఢిల్లీ వెళ్లినప్పుడు ప్రధాని మోదీతో మాట్లాడారని చెప్పారు. ఆ తర్వాత విభజన చట్టం షెడ్యూల్ 13లో ఉన్న పెట్రో, కెమికల్, ఆయిల్ రిఫైనరీ హబ్ ఏపీకి ఇస్తున్నట్లుగా ప్రముఖ పత్రికలో వార్తలు వచ్చాయని అన్నారు. ఇదే షెడ్యూల్ 13లో తెలంగాణకు కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఉందని తెలిపారు. పదేళ్లుగా అడుగుతున్నా తెలంగాణకు ఏమీ ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేశారు.



ఏపీలో పెట్రో కెమికల్స్ రిఫైనరీ ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని.. మాకు రావాల్సినవి కేంద్రం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నామని బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ తెలిపారు. చంద్రబాబుపై కేంద్రం ఆధారపడింది కాబట్టే ఏపీకి పెట్రో, కెమికల్ హబ్ ఇస్తున్నారని.. ఇక్కడ తెలంగాణపై ఆధారపడలేదు కాబట్టే ఏమీ ఇవ్వడం లేదా అని ప్రశ్నించారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం 30 ఏళ్లుగా పోరాటం జరుగుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. అదే మోదీకి ఏపీలో సొంతంగా సీట్లు వచ్చి ఉంటే అక్కడ కూడా ఏమీ ఇచ్చేవాళ్లు కాదని విమర్శించారు. ఏపీలో ప్రాంతీయ పార్టీ గెలిచింది కాబట్టే చంద్రబాబు అడిగినవన్నీ ఇస్తున్నారని అన్నారు. 8 మంది ఎంపీలను గెలిపించినా బీజేపీ తెలంగాణ ప్రజలకు మొండి చేయి చూపిస్తోందని విమర్శించారు. తెలంగాణకు కేంద్రం ఐటీఐఆర్ ఇవ్వలేదని.. కేసీఆర్ కొత్తగా జిల్లాలు ఏర్పాటుచేస్తే ఒక్క నవోదయ విద్యాలయం కూడా ఇవ్వలేదని బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. ఎన్నికల తర్వాత బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాజకీయాల గురించి తప్ప రాష్ట్ర అభివృద్ధిపై ఒక్క చర్చ లేదని అన్నారు. ఏపీకి ఆయిల్ రిఫైనరీ ఇచ్చినట్లుగానే.. తెలంగాణకు విభజన చట్టంలో పేర్కొన్న కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని బోయిన్‌పల్లి వినోద్ కుమార్ తెలిపారు. కొన్నిసార్లు కొన్ని కారణాలతో ఓడిపోతుండవచ్చని ఆయన అన్నారు. వచ్చే ఐదేళ్ల తర్వాత బీఆర్ఎస్ బ్రహ్మాండమైన మెజార్టీతో మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# 13 ఉపఎన్నికల్లో 10 చోట్ల ఇండియా కూటమి, రెండుచోట్ల ఎన్డీయే గెలుపు

- బీహార్‌లోని రూపాలిలో స్వతంత్ర అభ్యర్థి విజయం
- తమిళనాడులో డీఎంకే, బెంగాల్‌లో తృణమూల్ అభ్యర్థుల గెలుపు
- మధ్యప్రదేశ్‌లో బీజేపీ విజయం

**విశ్వంభర, ఢిల్లీ:** దేశవ్యాప్తంగా జరిగిన 13 ఉప ఎన్నికల్లో 10 చోట్ల ఇండియా కూటమి, రెండుచోట్ల బీజేపీ, ఒకచోట స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. దేశవ్యాప్తంగా 7 రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు జరిగాయి. ఉపఎన్నికలు జరిగిన నాలుగు రాష్ట్రాల్లో ఇండియా కూటమి, మూడు రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమి అధికారంలో ఉంది. పశ్చిమ బెంగాల్‌లో 4, హిమాచల్ ప్రదేశ్‌లో 3, ఉత్తరాఖండ్‌లో 2, పంజాబ్, బీహార్, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో ఒక్కో స్థానంలో ఉప ఎన్నికలు జరిగాయి. హిమాచల్ ప్రదేశ్‌లో డెహ్రా, నలాగఢ్ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకోగా, హమీర్‌పూర్ స్థానంలో బీజేపీ విజయం సాధించింది. మధ్యప్రదేశ్‌లోని అమరవారా నుంచి బీజేపీ అభ్యర్థి కమలేశ్ ప్రతాప్ షా విజయం సాధించారు. పంజాబ్‌లోని జలంధర్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ, తమిళనాడులోని విక్రవాండిలో డీఎంకే, ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్, మంగ్లౌర్‌లలో కాంగ్రెస్ గెలుపొందింది. పశ్చిమ బెంగాల్‌లోని రాయ్‌గంజ్, రణఘాట్ సౌత్, బాగ్దా, మానిక్తలాలో తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించింది. బీహార్‌లోని రూపౌలిలో స్వతంత్ర అభ్యర్థి గెలిచారు.

# బక్క జడ్సన్ హెల్త్ కండిషన్ సీరియస్!

**విశ్వంభర, హైదరాబాద్ :** కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్ హెల్త్ కండిషన్ సీరియస్ గా మారింది. తెలంగాణలో నిరుద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్.... అమరణ నిరాహార దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. తన నివాసంలో బక్క జడ్సన్ గత పది రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తుండగా ఆయన ఆరోగ్యం ఆందోళనకరంగా మారింది. ఆయనను ఎవరు పట్టించుకోకపోవడం శోచనీయం. అయితే నిరుద్యోగులకు మద్దతుగా నిలవటమే కాకుండా ఆందోళనల్లో పాలుపంచుకుంటూ తన గలాన్ని వినిపిస్తున్న బీఆర్ఎస్ నేత రజిని సాయిచంద్ బక్క జడ్సన్ ను పరామర్శించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో బక్క జడ్సన్ పరిస్థితిని చూసి రజిని సాయిచంద్ చలించిపోయారు. తన ఇంట్లోనే దీక్షకు దిగిన జడ్సన్ ఉలుకు పలుకు లేకుండా బెడ్ పై పడిపోయి ఉండటానికి గమనించి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేసి హుటాహుటినా ఆసుపత్రికి తరలించారు. ఇప్పుడు బక్క జడ్సన్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బెదిరిస్తున్న కాంగ్రెస్

**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బెదిరించి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చాలామంది బీజేపీతో టచ్‌లో ఉన్నారని.. అయితే రాజీనామా చేసి రావాలని షరతు ఉండటంతో వెనుకడుగు వేస్తున్నారేమోనని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఎప్పుడైనా ఏమైనా జరగొచ్చంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇంకా అమలు చేయలేదని మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. మేనిఫెస్టోల ఇచ్చిన 419 హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో అతి తక్కువ కాలంలో అప్రతిష్ట మూటకట్టుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ అని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అమృత్ పథకం నిధుల టెండర్లలో జరిగిన అవినీతిని నిరూపించేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. గ్లోబల్ టెండర్లలో 40 శాతం లెస్‌కు పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే తాను రాజీనామాకు సిద్ధమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లుగా ఉందని మహేశ్వర్ రెడ్డి ఎద్దేవా చేశారు. ప్రజల సమస్యలు ప్రభుత్వానికి పట్టడం లేదని మండిపడ్డారు. జవాబుదారీతనం లేదని.. పారదర్శకత లేదని విమర్శించారు. పేరుకే ప్రజా పాలన.. ప్రజాదర్బార్ కనరాకుండా పోయిందని తెలిపారు.ప్రజాపాలన పేరు మీద రాక్షస పాలన సాగుతోందని చెప్పారు. రేవంత్ బాబా.. డజను దొంగలుగా పాలన నడుస్తోందని ఎద్దేవా చేశారు. రేవంత్ అవినీతి పాలనపై బీజేపీ పోరాటం చేస్తుందని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ప్రజాక్షేత్రంలో అవినీతిని బయటపెడతామని చెప్పారు.

# వృద్ధురాలి పెన్షన్ రికవరీపై స్పందించిన సీతక్క

**విశ్వంభర, హైదరాబాద్ :** ఆసరా పెన్షన్‌ను తిరిగి చెల్లించాలంటూ కొత్తగూడెం జిల్లాకు చెందిన దాసరి మల్లమ్మ అనే వృద్ధురాలికి అధికారులు నోటీసులు ఇవ్వడంపై మంత్రి సీతక్క స్పందించారు. పెన్షన్ డబ్బులపై వృద్ధురాలికి రికవరీ నోటీసులు రావడంపై విమర్శలు వచ్చాయి. ఈ అంశంపై సీతక్క స్పందిస్తూ... ఇప్పటికే మల్లమ్మ నెలకు రూ.24,073 కుటుంబ పెన్షన్ పొందుతున్నట్లు చెప్పారు. మరోపక్క, మల్లమ్మ కూతురు ఏఎన్ఎంగా పని చేస్తూ మృతి చెందడంతో కుటుంబ పెన్షన్ మరొకటి కూడా వస్తోందన్నారు. మరోవైపు, మల్లమ్మ కొడుకు ఒకరు ప్రభుత్వ ఉద్యోగి అని, మరొకరు ప్రైవేటు ఉద్యోగి అని తెలిపారు. అయితే ఇక్కడ ఒకే వ్యక్తి రెండు పెన్షన్లు పొందడం అన్నది నిబంధనలకు విరుద్ధమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,862 మందికి డబుల్ పెన్షన్లు వస్తున్నాయని, వీరికి ట్రెజరీ శాఖ నోటీసులు ఇచ్చిందన్నారు. వీరు ప్రభుత్వ కుటుంబ పెన్షన్, వృద్ధాప్య పెన్షన్ పొందుతున్నారన్నారు.

# పెన్షన్ డబ్బులు లాక్కుంటారా..?

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న సంక్షేమ పథకాలకు వచ్చే డబ్బును పెంచుతామని దొంగ హామీలు ఇచ్చి గద్దెనెక్కిన రేవంత్ సర్కార్.. ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న లబ్ధిదారుల నుంచి సొమ్మును వెనక్కు రాబట్టే వింత చేష్టలు మొదలుపెట్టిందని విమర్శించారు. ఏవో సాంకేతిక కారణాలు చూపిస్తూ వేలాది మంది ఆసరా పెన్షన్ లబ్ధిదారుల నుంచి డబ్బును ప్రభుత్వానికి వెనక్కు పంపమని నోటీసులు ఇస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దాసరి మల్లమ్మ అనే 80 ఏండ్ల ముసలమ్మకు ఆసరా పెన్షన్ కింద వచ్చిన రూ.లక్షా 72 వేలు వెనక్కు కట్టాలని నోటీసు ఇచ్చారు. ఒంటరి మహిళగా పక్షవాతంతో బాధపడుతూ ఉన్న దాసరి మల్లమ్మ వంటి వృద్ధుల నుంచి కేసీఆర్ సర్కారు ఇచ్చిన ఆసరా పెన్షన్ సొమ్మును తిరిగి లాక్కోవడానికి ప్రయత్నించడం రేవంత్ సర్కార్ అమానవీయ వైఖరికి నిదర్శనమని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా విమర్శించారు. వెంటనే పేదల మీద ఇటువంటి దుర్మార్గపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలే కాంగ్రెస్ సర్కార్ మీద తిరగబడతారని హెచ్చరించారు.కొత్తగూడెం జిల్లాలో ఆసరా పెన్షన్లపై ఇటీవల సర్వే నిర్వహించగా దాసరి మల్లమ్మ ఆసరా పెన్షన్‌కి అనర్హురాలు అని.. ఇప్పటివరకు ఆమె తీసుకున్న రూ. 1,72,928 తిరిగి ప్రభుత్వానికి 7 రోజుల లోగా చెల్లించాలని అధికారులు ఆమెకు నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే.

# ఒకే చోట రెండు ఎగ్జామ్స్ రాయొచ్చు

- వేర్వేరు జిల్లాల్లో ఉంటే ఒకే జిల్లాలో పరీక్ష
- డీఎస్సీ అభ్యర్థులకు గుడ్ న్యూస్



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ డీఎస్సీ 2024 పరీక్షలు మరో 4 రోజుల్లో ప్రారంభంకానున్నాయి. ఓ వైపు నిరుద్యోగులు డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలంటూ పోరుబాట పడుతుంటే.. ప్రభుత్వం మాత్రం పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేసుకుంటూ పోతుంది. ఇప్పటికే హాల్ టికెట్లు కూడా విడుదల చేసింది. పరీక్షలకు సంబంధించి సర్కార్ తాజాగా మరో కీలక ప్రకటన చేసింది. ఒకే రోజు రెండు సబ్జెక్టులకు సంబంధించిన డీఎస్సీ పరీక్షలు ఉంటే వారంతా ఉదయం పరీక్ష రాసిన చోటే మధ్యాహ్నం రెండో పరీక్షకు హాజరుకావచ్చని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ఈ మేరకు ఎగ్జాం సెంటర్ల విషయంలో ఆందోళన అవసరం లేదని తెలియజేస్తూ అభ్యర్థులకు సూచనలు చేశారు. కొందరు అభ్యర్థులకు ఉదయం ఒక జిల్లాలో పరీక్ష ఉంటే, మధ్యాహ్నం మరో జిల్లాలో పరీక్షలు ఉన్నాయి. నాన్‌లోకల్ పోస్టులకు దరఖాస్తు చేయడంతో ఇతర జిల్లాల్లో పరీక్షా కేంద్రాలు కేటాయించారు. దీనిపై అభ్యర్థులు ఆందోళన చెందడంతో.. స్పందించిన విద్యాశాఖ అధికారులు అలాంటి వారు ఒకే రోజు ఒకే పరీక్షా కేంద్రంలో రెండు పరీక్షలు రాసే అవకాశం ఇస్తామని తెలిపారు. ఒకే రోజు వేరు వేరు జిల్లాల్లో పరీక్ష కేంద్రాలు పడిన వారికి హాల్‌టికెట్లు మార్చి.. మళ్లీ జారీ చేస్తామని తెలిపారు. ఒక సబ్జెక్టు తెలుగు, అదే సబ్జెక్టు హిందీ మాధ్యమానికి దరఖాస్తు చేసి ఉంటే.. ప్రధాన మాధ్యమంలో వచ్చిన మార్కులను రెండో దానికి కూడా పరిగణనలోకి తీసుకుంటామని విద్యాశాఖ స్పష్టం చేసింది. కాగా జులై 18 నుంచి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్ విధానంలో డీఎస్సీ పరీక్షలు జరగనున్న సంగతి తెలిసిందే. దాదాపు 2,79,966 మంది అభ్యర్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. ఓయూలో బ్యాక్‌లాగ్స్ ఉన్న వారికి 'వన్ టైం ఛాన్స్' ఇస్తూ ప్రకటన జారీ ఉస్మానియా యూనివర్సిటీ, దాని అనుబంధ కాలేజీల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ) బ్యాక్‌లాగ్స్ క్లియర్ చేసుకోవడానికి ప్రకటన వెలువడింది. బ్యాక్‌లాగ్స్ ఉన్నవారికి 'వన్ టైం ఛాన్స్'కు అవకాశం కల్పించింది. 2000–2001 నుంచి 2018–19 మధ్య ఆయా విద్యా సంవత్సరాల్లో ఓయూతో పాటు దాని అనుబంధ కాలేజీల్లో చదివి.. 4 సెమిస్టర్లు క్లియర్ చేయని విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుంది. బ్యాక్‌లాగ్స్ క్లియర్ చేయగోరే విద్యార్థులు.. గతంలోని జారీ చేసిన హాల్ టికెట్, మార్కుల మెమో కాపీలను జత చేసి ఆగస్టు 16వ తేదీలోపు ఫీజు చెల్లించాలని సూచించింది. రూ.500 ఆలస్య రుసుంతో ఆగస్టు 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఓయూ పరీక్షల విభాగం లేదంటే ఓయూ అధికారిక వెబ్‌సైట్‌లో తనిఖీ చేసుకోవచ్చని యూనివర్సిటీ అధికారులు తెలిపారు.



## అరుణాచలం గిరి ప్రదర్శనకు వెళ్లే భక్తులకు షాద్‌నగర్ డిపో
# ఆర్‌టీసీ శుభవార్త

**విశ్వంభర, షాద్‌నగర్ :** గురుపౌర్ణమి సందర్భంగా షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉషా మాట్లాడుతూ.. అరుణాచలం గిరి ప్రదక్షినకు వెళ్లే భక్తులకు షాద్‌నగర్ బస్టాండ్ నుంచి బస్సు సౌకర్యం కల్పించడం జరిగింది. షాద్‌నగర్ నుండి సూపర్ లగ్జరీ బస్సులు 19వ తేదీన షాద్‌నగర్ నుండి బయలుదేరి కానిపాకం చేరుకుంటాయి. అక్కడినుండి గోల్డెన్ టెంపుల్ మరియు చివరగా 21న అరుణాచలంకు చేరుకొని బస్సులు అరుణాచలంలో ఉంటాయని తెలియజేసింది. దీని కోసమై పెద్దలకు 3,600 చిన్నపిల్లలకు 2,400 చార్జీలు ఉన్నాయి. దీని యొక్క బుకింగ్‌ల కోసం షాద్‌నగర్ డిపో మేనేజర్‌ను లేదా అసిస్టెంట్ మేనేజర్‌నుఫోన్ నెంబర్ : 9959226287, 9182645281, 9490021433 సంప్రదించాలని తెలిపారు.



## ఓయూలో కొనసాగుతున్న
# అరెస్టుల పర్వం

**విశ్వంభర, ఓయూ :** ఉస్మానియా యూనివర్సిటీలో అరెస్టుల పర్వం కొనసాగుతోంది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నిరుద్యోగులను పోలీసులు బలవంతంగా పోలీసు వ్యాన్లనో ఎక్కించి ఓయూ నుంచి తరలిస్తున్నారు. కనీసం మీడియాతో కూడా మాట్లాడనివ్వకుండా నిరుద్యోగు లను పోలీసులు అడ్డుకుంటున్నారు. పోలీసుల చర్యలపై నిరుద్యోగులు తీవ్రంగా మండి పడుతున్నారు. డీఎస్సీని మూడు నెలల పాటు వాయిదా వేసి 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలని నిరుద్యోగులు గత వారం పది రోజుల నుంచి నిరసనలు వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఓయూ లైబ్రరీ, ల్యాండ్ స్కేప్ గార్డెన్‌తో పాటు పలు హాస్టళ్ల వద్ద పోలీసులు భారీగా మోహరించారు. కనిపించిన విద్యార్థులను కనిపించినట్టే అరెస్టు చేస్తున్నారు. ఇక ఓయూ ఆర్ట్స్ కాలేజీ వద్ద శాంతియుత నిరసన తెలిపేందుక వచ్చిన డీఎస్సీ అభ్యర్థులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. డీఎస్సీ ఎగ్జామ్స్‌ను జులై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించనున్నారు. డీఎస్సీకి సంబంధించిన హాల్ టికెట్లను కూడా అధికారులు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. పలువురు అభ్యర్థులు డీఎస్సీ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని, నిరసనగా నిప్పంటించారు. డీఎస్సీని వాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్నారు.



## క్షత్రియ రాజ్ పుత్ సభ అధ్యక్ష ఎన్నికలు

**విశ్వంభర, హైదరబాద్ :** రాజ్ పుత్ క్షత్రియ సమాజాన్ని అభివృద్ధి చేసి ప్రతి ఒక్కరికి సహాయ సహకారాలు అందిస్తానని రాజ్ పుత్ క్షత్రియ సభ్యుడు విజయసింగ్ అన్నారు. హైదరాబాద్ కాచిగూడలో ఏర్పాటు చేసిన రాజ్‌పుత్ క్షత్రియ సమాజ్ సమావేశంలో ముఖ్య అతిథి పాల్గొని మాట్లాడుతూ స్థానిక బస్తే వాసులు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఎన్నికలలో తనను అధ్యక్షునిగా నిలబెట్టినందుకు బస్తీ వాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంతేకాకుండా 21వ తేదీన తన మేనిఫెస్టోను ప్రకటించ నున్నట్టు తెలిపారు. సంఘంలో ఇప్పుడు ఇస్తున్న స్కాలర్ శిప్పులు సరిపోక పోవడంతో తనను అధ్యక్షుడిగా ఎన్నుకుంటే అధిక స్కాలర్ శిప్పులను పెంచి అందించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరు తన విశ్వాసించి ఎన్నికలలో గెలిపిస్తే క్షత్రియ సమా అభివృద్ధికి తోడ్పడుతానని హామీని ఇచ్చారు. అధ్యక్షుడిగా తనను ఎన్నుకుంటే క్షత్రియ సమాజాన్ని అభివృద్ధి చేయడం కాకుండా ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో విజయ్ సింగ్ బయాస్, మహేందర్ సింగ్, పవన్ కుమార్ సింగ్, భరత్ సింగ్, నర్సింగ్ ఠాకూర్, మనోజ్ సింగ్, మురళి మోహన్ సింగ్, అజయ్ సింగ్, మాధవి టాకూర్, ఠాకూర్ ప్రభు సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## త్రిశక్తి దేవాలయ తృతీయ వార్షికోత్సవం



**విశ్వంభర, మెట్పల్లి :** మెట్పల్లి త్రిశక్తి దేవాలయ అభివృద్ధి కమిటీ వారు తృతీయ వార్షికోత్సవం అత్యంత కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం పుణ్యావహచనం, అమ్మవార్లకు అభిషేక పూజలు, హెూమం నిర్వహించారు. ఆలయ అర్చకులు విధుమౌళి శర్మ ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో త్రిశక్తి దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



## సమ్మక్క సారలమ్మ తల్లులను దర్శించుకున్న
# ఎలిమినేటి జంగారెడ్డి

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటాకొండూరు మండల ఉప సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షులు ఎలిమినేటి జంగారెడ్డి మేడారంలో కొలువైన వన దేవతలు, కోరిన కోర్కెలు తీర్చే భక్తుల కొంగు బంగారం అయిన సమ్మక్క తల్లి, సారలమ్మ తల్లుల గద్దెలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలిమినేటి జంగారెడ్డి మాట్లాడుతూ ఎంతో పరమ పవిత్రమైన ఈ ప్రాంతంలో వెలిసిన సమ్మక్క తల్లిని, సారలమ్మ తల్లిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జంపన్న వాగులో స్నానాలు చేసి అమ్మ వార్ల గద్దెలను భక్తి శ్రద్ధలతో పూజిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని స్వచ్ఛంగల్ల తల్లులు సమ్మక్క, సారలమ్మ అని అన్నారు. నమ్మి కొలిస్తే వెంట నడిచే తల్లులను నిత్యం స్మరించుకోవాలని అన్నారు. ములుగు జిల్లాకి సమ్మక్క సారలమ్మ జిల్లాగా నామకరణం చేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

## కడ్తాల్ కస్తూర్బా పాఠశాల ప్రారంభించాలంటూ
# ఇరు పార్టీల మధ్య ఉద్రిక్తత

**విశ్వంభర, ఆమనగల్లు :** కడ్తాల్ మండల కేంద్రంలో శనివారం కేజీబీవీ ఆశ్రమ పాఠశాలను ప్రారంభించాలని మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కడ్తాల్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు కస్తూర్బా పాఠశాల ప్రారంభానికి నిర్లక్ష్యం వహిస్తున్నరని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసే విధంగా నిరాహార దీక్ష చేపట్టడానికి అన్ని సిద్ధం చేసుకున్నారు. కాగా 17వ తేదీన మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో పాఠశాలను ప్రారంభిస్తున్నామని మండల కాంగ్రెస్ పార్టీ విలేకరుల సమావేశంలో తెలిపారు. అయినా కూడా బీఆర్ఎస్ దీక్షకు పూనుకోవడంతో పోలీసులు నిరాహార దీక్షను భగ్నం చేస్తున్నారని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. మరోపక్క కాంగ్రెస్ నాయకులు 17న ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రులతో ప్రారంభం చేస్తున్నామని తెలిపారు. అయినా బీఆర్ఎస్ నాయకులు పలుమార్లు వినతి పత్రం అందజేసిన పట్టించుకోని నాయకులు ప్రారంభం చేస్తామని చెప్తే ఎలా నమ్మాలని దీక్ష ఖచ్చితంగా చేస్తామని పట్టుబడడంతో పట్టణంలో ఉద్రిక్త



పరిస్థితులు నెలకొన్నాయి. ఏది ఏమైనా పాఠశాలను ప్రారంభం చేసి విద్యార్థుల సమస్యలను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.






# మా ఇల్లు

## ఆ ఇల్లు మా ఇల్లు కాదు.

కూర్చుండి తీరికగా కబుర్లు చెప్పుకునే వలపోసుకునే, తలపోసుకునే
ఆ ఇల్లు మధ్యతరగతిగా ఎదిగిన వారి ఇల్లు.
మా ఇల్లు మూడింట రెండు వంతులు పేదలున్న ఇల్లు.
నగరం నీడలో మురికి కాలువల పక్కన, పెద్ద పైపుల సొరంగం లాంటి డేరా!
రోడ్డు పక్కన పిరమిడ్ వంటి టెంటు వేసుకొని పాత రేకులు తెచ్చి సుత్తెలతో కొత్త వస్తువులు తయారు చేసే ఇల్లు.
రాత్రులు ఎవడో తాగి రోడ్డు పక్కన గదా అనుకొని ఉచ్చ పోస్తే వాన చినుకుల్లా మీద పడుతుంటేఊరు గాని ఊరు గదా అని నిశ్శబ్దంగా భరించే ఇల్లు.
చెట్టు పక్కన గుడిసె మా ఇల్లు.
అడవిలో పొరకలతో కప్పుకున్న తేకుటాకుల ఇల్లు.
నూతనంగా కడుతున్న బహుళ అంతస్తుల భవనాల్లో స్లాబ్ పడ్డాక నీలి రంగు పోలితిన్ కవర్లతో గదిగా మార్చుకున్న ది మా ఇల్లు.
ఈ దేశంలో మా వారికి పడక గదులు ప్రత్యేకంగా వుండవు.
తెల్లారి లేచి గూన కప్పిన పెంకుటింట్లో మంచం ఎత్తేసి బయట పెట్టి
గదిలో రోజువారీ పనులు, కులవృత్తి పనులు చేసుకుంటారు.
మా ఇల్లు అందమైన చీరెలు నేసే ఉత్పత్తి స్థానం.
మా ఇల్లు వెండి బంగారంతో అందమైన నగలు చేసే ఒక కార్ఖానా.
మా ఇల్లు మేకలు, కోళ్లు పెంచుకునే ఉత్పత్తి కేంద్రం.
మా ఇల్లు పంటను, పంట గింజల గాదెలు విత్తనాలను దాచుకునే గోదాము.
మా ఇల్లు పక్కనే వున్న బర్రె ఇచ్చిన పాలను దాచి, కాచి పెరుగు వెన్న నెయ్యి రూపొందే యంత్రశాల.
మా ఇల్లు పొలం పనులకు వాడే పరికరాల ఆయువుపట్టు.
ఇల్లు ఒక ఉత్పత్తి కేంద్రం.
మా ఇంటి ముందే కమ్మరి కొలిమి
మా ఇంటిముందే తోలు చెప్పులు వార్లు తయారు
మా ఇల్లు పొయ్యి కాడనే ఉడికిన గడుక, రొట్టె ఎల్లిపాయ కారంతో, తొక్కుతోనో ఊపుకుంటూ తినే హోటల్.
మా ఇల్లు నల్లులుకు బల్లులకు చీమలకు, ఎలుకలకు, పిల్లు కు కుక్కలకు కిరాయి లేకుండా ఆశ్రయమిచ్చే లాడ్జి.
మా గూన పెంకుటింట్లో ఇంటి చూరు కింద తడవకుండా పిట్టలకోసం చెక్కలతో చక్కని గూళ్లు
మా ఇల్లు వాకిట్లో అత్తా కోడళ్లు తల చిక్కులు తీసుకుంటూ పేన్లు కుక్కుకుంటూ ముచ్చట పెట్టే వేదిక.
అన్నం తలె చేత పట్టుకొని ఇంటిముందు కూర్చుని ఇరుగు పొరుగు ఎదురింటి తల్లలతో పిల్లలతో ముచ్చట్లు పెడుతూ గోరు ముద్దలు తినిపిస్తూ చందమామ రావే జాబిల్లి రావే అంటూ ఒక్కొక్క ముద్దు తినిపించే అమ్మ నానమ్మ.
చుట్టం రాగానే కాళ్లకు నీళ్లిచ్చిచేతికి తువ్వాలు ఇచ్చి కూర్చున్నాక మంచినీళ్లిచ్చే మర్యాదస్తురాలు మా ఇల్లు!
మా ఇల్లు ఒక కార్యాలయం.
మా ఇల్లు కుటుంబానికి ఒక నిట్టాడు.
మా ఇల్లంటే ఒక కార్యాచరణ.
మా ఇల్లు ఒక ఉత్పత్తి కేంద్రం.
మా ఇల్లు వారసత్వానికి
సంస్కృతికి పునరుత్పత్తి కేంద్రం





- బి. ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, తెలంగాణ
ఫోన్ : 8331966987

# బీసీ వర్గాలపై పాలకుల చిత్తశుద్ధి ఎంత!

ప్రభుత్వం వెనుకబడిన వర్గాల వారికి విద్య, ఉపాధిలో వారి జనాభా దామాషా ప్రకారం సరైన ప్రాతినిధ్యం కల్పించి ఆర్థికంగా వీరిని ప్రోత్సహిస్తూ.. సంపద కొందరి చేతుల్లో పోగు పడకుండా అందరికీ అందేలా చూడాలని రాజ్యాంగంలోని 38, 39 అధికరణలు చెబుతున్నాయి. కాని దేశ స్వాతంత్రం పొంది 77 సంవత్సరాలు అవుతున్నా.. వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం నిర్మాణాత్మకమైన చర్యలు చేపట్టటంలో పాలకులు వైఫల్యం చెందారనే చెప్పక తప్పదు. అధిక సంఖ్యాకులైన బడుగు బలహీన వర్గాలు బాగుపడిన నాడే దేశం బాగుపడుతుంది.

స్వాతంత్రానికి పూర్వమే 1946లో ఎస్సీ, ఎస్టి జనాభాకు ప్రాతిపదికగా 12.5 శాతానికి ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించారు. స్వాతంత్రానంతరం వారికి 1952 లో రాజ్యాంగ బద్ధత కూడా కల్పించారు. కాలక్రమములో రిజర్వేషన్లు గడువు పెంచుతూ వస్తున్నారు. అయితే బిఆర్ అంబేద్కర్ మాత్రం 1952 లోనే వెనుకబడిన వర్గాలకు కూడా రిజర్వేషన్లు వర్తించాలని వారి తరపున గట్టిగా వాదించారు. అయితే వారి జనాభా వివరాలు లేకపోవడం కారణమైంది.

**ఎనుకబడిన వర్గాలు ఎవరు!**

భారత రాజ్యాంగంలో వెనుకబడిన వర్గాలను నిర్వచించకపోవడం వెనుకబడిన వర్గాలు అనే పదానికి నిర్దిష్టమైన నిర్వచనం లభించడం లేదు. కేంద్ర ప్రభుత్వం 1953లో జనవరి 30 న ఆర్టికల్ 340 అనుసరించి వెనుకబడిన వర్గాల సామాజిక,ఆర్థిక స్థితిగతులను పరిశీలించేందుకు 'కాకా కాలేర్కర్ ఆధ్వర్యంలో కమిషన్' వేసింది. వెనుకబడిన వర్గాలు అంటే ముఖ్యంగా బీసీల స్థితిగతులపై పరిశీలన చేసి వెనుకబాటుతనాన్ని నిర్మూలించేందుకు ప్రమాణాలు నిర్ణయిస్తూ నివేదిక 1955 మర్చి 30 న సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం హిందూ మతంలోనిసాంప్రదాయక నిచ్చెన మెట్ల కులాల అమరికలో సాంఘికంగా అట్టడుగు స్థాయిలో ఉండటం. ఒక కుల సముదాయంలో అంతర్భాగంగా లేదా ఆ కులంలో అభివృద్ధికి ఆమడదూరంగా ఉండటం, ప్రభుత్వ సేవల్లో ప్రాతిథ్యం లేకపోవడం, ఈ కొలమాన అంశాల పరంగా కాక కాలేల్కర కమిషన్ 2399 సముదాయాల సమూహాలను విద్యాపరంగా, సాంఘికంగా వెనుకబడినవిగా ప్రకటించింది. వీటిలో 913 సముదాయాల జనాభా 11.5 కోట్లుగా పేర్కొంది. అప్పటి దేశ జనాభా సుమారు 39,85,77,992. మిగిలిన 1486 సముదాయాల జనాభా పరిగణలోకి తీసుకోబడలేదు. అంటే వారి జనాభా ఇంకా ఎంత ఉంటుందో ఊహించుకోవచ్చు. నాటి నుండి నేటి వరకు బీసీల జనాభా 50 శాతానికి పైగా మాటే. కానీ కులాల వారి జనాభా లెక్కలు నేటి వరకు లెక్కించకపోవడం బీసీల దౌర్భాగ్యం, బీసీలపై పాలకులు ఉన్న కుటిల నీతికి నిదర్శనం.

**సెన్సెస్‌లో బీసీల కులగణన చేర్చాలి:**

సాధారణంగా జనాభా లెక్కలు నిర్వహణను సెన్సెస్ చట్టం 1948 ప్రకారం కేంద్ర ప్రభుత్వం జరుపుతుంది. ఆ సెన్సెస్ లో ఎస్సీలు, ఎస్టీలకు సంబంధించి ఆర్టికల్ 330,332,335 ప్రకారం కులగణన జరుగుతుంది.అలాగే కేంద్ర ప్రభుత్వం అనుకుంటే రాబోయే సెన్సెస్ లో ఓబిసి కులగణ చేయవచ్చు. సెన్సెస్ ఫార్మాట్ మార్చి కార్యనిర్వహణ ఆదేశాలిస్తూ అవసరమైతే చట్టం చేసి కులగణ చేయవచ్చు. ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి చేపట్టే జనగణన 202021లో కోవిడ్ కారణంగా వాయిదా వేసినారు. 2025 లోనైనా జరిగే సెన్సెస్ లో బి సి కులగణన చేర్చాలి.



**రాష్ట్రంలో బీసీల కుల గణన చేపట్టాలి**

స్థానిక సంస్థలకు ఎన్నికలు వస్తున్నవేళ రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచాలని.. బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో అధికారంలోకి వచ్చాక ఆరు నెలల్లోనే బీసీ కులగణ చేసి బీసీ కమిషన్ నివేదిక ప్రకారం రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించింది. అలాగే స్థానిక సంస్థలలో ప్రస్తుతం ఉన్న23 శాతం రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని ప్రకటించింది. సెన్సెస్ చట్టం ప్రకారము కేంద్ర ప్రభుత్వమే సెన్సెస్ చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం 'కలెక్షన్ ఆఫ్ స్టాటిస్టిక్స్ యాక్ట్ 2008 'క్రింద కుల సర్వే చేయవచ్చు. ఇప్పటికే బీహార్, ఒరిస్సా, కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాలు కుల సర్వే చేశాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కులగణన పై అసెంబ్లీ తీర్మానం చేయడమే కాక కులగణనకు రూ.150 కోట్లు కేటాయిస్తూ, 15 మార్చి 2024, న జీవో.నెం.26 జారీ చేసింది. వెంటనే చేపట్టి రెండు నెలలో పూర్తి చేసి బిసి లకు ఇచ్చిన వాగ్దానాన్ని అమలుచేయాలి.

**స్థానిక సంస్థలు రిజర్వేషన్లు**

1994 పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం రాష్ట్రంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఉండేవి. కానీ కొత్తగా వచ్చిన పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం 1). గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లలో 23.59 శాతం, సర్పంచులకు 22.75%, ఎంపీటీసీలకు 17.87%, జెడ్ పి టి సి లకు 16.9%, మాత్రమే ఉన్నది. దీనివలన బీసీలు తీవ్రంగా నష్టపోయారు. స్థానికసంస్థలలో బీసీల రిజర్వేషన్ ఆ రాష్ట్ర పరిధికి వదిలిపెట్టారు. కానీ సుప్రీంకోర్టు 50% సీలింగ్ విధించింది.

**కులాలు:**

కేంద్ర ఓబిసి కోటాలో నేడు గుర్తించిన కులాలు 2,633 వరకు ఉన్నాయి. మన తెలంగాణ రాష్ట్రంలో జీవో నెం.3(9.9.2020) ప్రకారం 186 కులాలు ఉన్నాయి. ఇవన్నీ చాలావరకు కడు పేదరికంలో ఉన్నాయి.సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్నాయి. మారుతున్న సామాజిక నేపథ్యంలో కులవృత్తులు దూరమవుతున్నారు. బీసీలు పొట్టకూటి కోసం దేశ విదేశాలు ప్రధానంగా గల్ఫ్ దేశాలకు వలసలు వెళ్తూ వివిధ వృత్తులు చేపడుతున్నారు. వారికి సామాజిక, రాజకీయ చైతన్యం, స్పృహ తక్కువ, జీవనోపాదుల వెతుకులాటల్లోనే జీవితాలు మునిగిపోతున్నాయి. విద్యావంతులలో ఓబీసీ స్పృహ కొంత ఉన్న మనకెందుకులే అనే ధోరణి ఎక్కువ.అందుకే ఓబీసీలలు చైతన్యం రగిలించాలి.

ఇప్పటికైనా రాజకీయ వివాదాలు పక్కనపెట్టి బీసీలు ఒక ఐక్యశక్తిగా అవతరించినప్పుడే రాజ్యాధికారం వారికి అందుతుంది. చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలన్న.. బీసీల జనాభా తేల్చాల్సిందే.. జనాభాకు తగినట్లుగానే స్థానిక సంస్థలతోపాటు.. చట్టసములో కూడా రిజర్వేషన్ కల్పించాల్సిన అవసరం ఉంది. అప్పుడే అన్ని వర్గాలకు సామాజిక న్యాయం కల్పించిన వారమవుతాం.



-ఉజ్జిని రత్నాకర్ రావు
సెల్,:9490952646

# కవిత్వంతో ఉద్యమ చైతన్యాన్ని నింపిన గరిమెళ్ల

## నేడు గరిమెళ్ళ సత్యనారాయణ జయంతి

ఆయన ఒక గొప్ప స్వాతంత్ర్య సమర యోధుడు. తన కవితలతో ఎందరినో స్వాతంత్ర్య పోరాటం పట్ల కార్యోన్ముఖులను చేసిన మార్గ దర్శకుడు. ఎందరికో మార్గదర్శకుడైన పోరాట యోధుడు. పరాయి పీడనకు, పాలనకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడి స్వేచ్ఛ, విముక్తి కోసం కలం పట్టి, గళమెత్తిన వీరసైనికుడు. ఇంకెందరిలోనో చైతన్య దీపాలను వెలిగించి, సత్యాగ్రహ బాట పట్టించిన స్ఫూర్తి ప్రదాత. నీతికీ నిజాయితీకి నిలువుటద్దం. దేశభక్తి గీతాలు రాసిన నేరానికి పలు మార్లు జైలు కెళ్ళినా, రాయడం మానని ధీరుడు. స్వాతంత్ర్యోద్యమంలో "వందే మాతరం" ఎలా నినాదంగా, ఉత్ప్రేరకంగా పని చేసిందో

అలాగే ఆయన రాసిన "మా కొద్దీ తెల్ల దొరతనం" పాట ప్రతి తెలుగువారి నోటా మార్మోగింది. ఒక విప్లవ గీతమైంది. అలాంటి ప్రజాకవి గరిమెళ్ళ సత్యనారాయణ. తెలుగునాట జాతీయ కవిత్వానికి ఒరవడి పెట్టిన కవి ప్రముఖుడు గరిమెళ్ళ. సబర్మతీ ఆశ్రమంలో, గాంధీజీ ఈ పాటకు అనువాదము చేయించమని కోరినప్పుడు, ఇంగ్లీష్ లోకి అనువదించి టంగుటూరి ప్రకాశం పంతులు "స్వరాజ్యం" పత్రికలో ప్రచురించాడు. స్వాతంత్ర్యోద్యమ కవుల్లో గరిమెళ్ళ సత్యనారాయణది విశిష్ట, అగ్ర స్థానం. దేశభక్తి కవితలు వ్రాసి జైలుశిక్ష అనుభవించిన వారిలో ప్రథముడు గరిమెళ్ళ. అయన

గేయాలు జాతీయ వీరరసంతో తొణికిసలాడుతూ పాఠక జనాన్ని ఉర్రూత లూగించాయి. 29 ఏళ్ళకే గేయాలు, రచనలు చేశాడు. స్వాతంత్ర్య పోరాటకాలంలో గరిమెళ్ళ గేయాలు బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ప్రజా హృదయంలోకి శరవేగంగా చొచ్చుకు పోయాయి. స్వరాజ్య గీతాలు, గేయాలు, వ్యాసాలు పదునైన ఛలోక్తులకు ఆయనకు ఆయనే సాటి.

గంజాం కలెక్టర్ కార్యాలయంలో గుమస్తా నుండి, విజయనగరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా, ప్రియాగ్రహారంలో గ్రంథాలయ కార్యదర్శిగా, ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా, ఆచార్య రంగా, వాహిని పత్రికలో సహాయ సంపాదకునిగా, ఆనంద వాణికి సంపాదకునిగా ఏ విధులు నిర్వర్తించినా, నిజాయితీకి నిర్భీతికి నీతికి ప్రతీకగా నిలిచాడు.

అయన రాసిన "మా కొద్దీ తెల్ల దొరతనం" .... " అలాగే "దండాలు దండాలు భారత మాత" అనే గీతం కూడా ప్రజలను ఎంతగానో జాగృతం చేసి స్వాతంత్ర్య ఉద్యమంలోకి ఉరికే తెగువను కలగ జేసింది. నిజాయితీకి, నిర్భీతికి గరిమెళ్ళ మారుపేరుగా నిలిచాడు. మాకొద్దీ తెల్ల దొరతనం పాట ఆనాడు ప్రతి తెలుగు వాడి నోటా మారు మోగేది. ఆయనంత ప్రసిద్ధినొందిన జాతీయకవి ఆ రోజుల్లో మరొకరులేరు.

గరిమెళ్ళ సత్యనారాయణ శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తాలుక గోనెపాడు గ్రామంలో 1893 జూలై 14న జన్మించాడు. తల్లి సూరమ్మ, తండ్రి వేంకట నరసింహం. గరిమెళ్ళ ప్రాథమిక విద్య స్వగ్రామమైన ప్రియాగ్రహారంలో సాగింది. విజయ నగరం, మచిలీ పట్నం, రాజమహేంద్ర వరం మొదలైనచోట్ల ఉన్నత చదువులు చదివాడు. బి.ఏ. చేశాక గంజాం కలెక్టర్ కార్యాలయంలో గుమస్తాగా కొంతకాలం పని చేశాడు. ఆ తరువాత విజయ నగరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా కొంతకాలం పనిచేశాడు. అయన స్వేచ్ఛాప్రియత్వం వల్ల ఎక్కువకాలం ఏ ఉద్యోగమూ చెయ్యలేక పోయాడు.

1920 డిసెంబర్‌లో కలకత్తాలో జరిగిన కాంగ్రెసు మహాసభలో సహాయ నిరాకరణ తీర్మానం



అమోదించ బడింది. ఆ వీరావేశంతో ఉద్యమంలోకి దూకిన గరిమెళ్ళ ''మా కొద్దీ తెల్లదొరతనం" పాటను రాశాడు. పాట సత్యాగ్రహులకు గొప్ప తెగువను, ఉత్తేజాన్ని కలిగించింది. ఆనాటి రోజుల్లో రాజమండ్రిలో ఈ పాట నకలు కాపీలు ఒక్కొక్కటి బేడా ( 12 పైసలు) చొప్పున అమ్ముడు పోయేవట. ఆనోటా ఈనోటా ఈ పాట గురించి ఆనాటి బ్రిటీషు కలెక్టరు బ్రేకన్ చెవినపడి ఆయన గరిమెళ్ళను పిలిపించి పాటను పూర్తిగా పాడమన్నాడట. గరిమెళ్ళ కేవలం రచయితే కాదు, గొప్ప గాయకుడు కూడా అయినందున తన కంచు కంఠంతో ఖంగున పాటలు కూడా పాడగా, గరెమెళ్ళ పాట విన్న బ్రిటీషు కలెక్టరు తెలుగుభాష తనకు రాకపోయి నప్పటికీ, ఈ పాటలో ఎంతటి మహత్తర శక్తి ఉందో, సామాన్య ప్రజల్ని సైతం ఎలా చైతన్య పరచ గలదో నేను ఊగించగలనన్నాడట. ఆ పాటను వ్రాసినందుకు గరిమెళ్ళకు ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధించారు. ఆ రోజుల్లో కాంగ్రెసు స్వచ్ఛంద సేవకులు ఖద్దరు దుస్తులు ధరించి, గాంధీటోపి పెట్టుకుని, బారులు తీరి మువ్వన్నెల జెండా ఎగర వేసుకుంటూ...మాకొద్దీ తెల్లదొరతనం దేవ

జైలు నుంచి విడుదల కాగానే ప్రజలు ఆయనకు ఎన్నోచోట్ల సన్మానాలు చేశారు. ఆయన జీవితంలో మధుర ఘట్టం ఇదొక్కటే. అప్పులు పెరగడంతో ఉన్న ఆస్తి అమ్మేసి అప్పులు తీర్చాడు. ఉద్యోగం వదిలేశాక కొంతకాలం ప్రియాగ్రహారంలో గ్రంథాలయ కార్యదర్శిగా పనిచేశాడు. శ్రీ శారదా గ్రంథమాల స్థాపించి పద్దెనిమిది పుస్తకాలు అచ్చువేశాడు. అవి అమ్ముడు పోలేదు. ఆయన ఎక్కువగా రాజమండ్రి, విజయవాడ, మద్రాసులకు తిరుగుతూ వుండడంతో, పట్టించు కోక పోవడం వల్ల వాటిని చెదలు తినేశాయి. వాటి వల్ల కూడా కొంత నష్టం వచ్చింది.

1921లో గరిమెళ్ళ ' స్వరాజ్య గీతములు ' పుస్తకం వెలువడింది. 1923లో హరిజనుల పాటలు, 1926లో ఖండకావ్యములు, భక్తిగీతాలు, బాలగీతాలు మొదలైన రచనలు వెలువడ్డాయి. గరిమెళ్ళ చాలా సార్లు జైలు శిక్ష అనుభవించాడు. జైలులో వుండగా తమిళ, కన్నడ భాషలు నేర్చుకున్నాడు. తమిళ, కన్నడ గ్రంథాలను తెలుగులోకి అనువ దించాడు. ఆంగ్లంలో కూడా గరిమెళ్ళ కొన్ని రచనలు చేశాడు. ఆంగ్లం నుంచి కొన్ని గ్రంథాలను తెలుగులోకి అనువదించాడు. భోగరాజు పట్టాభిసీతారామయ్య ఆంగ్లంలో వ్రాసిన 'ది ఎకనామిక్ కాంక్వెస్ట్ ఆఫ్ ఇండియా' అనే గ్రంథాన్ని తెలుగులోకి అనువ దించాడు. 1937లో చీనాజపాన్ అనే పుస్తకాన్ని రచించారు. గరిమెళ్ళ జీ


**మాకొద్దీ తెల్లదొరతనం అంటూ**

**ఆకాశం దద్దరిల్లేలా పాడుతూ వీధుల్లో కవాతు చేసేవారట. శిక్షపూర్తి చేసుకుని జైలు నుంచి విడుదల అయిన గరిమెళ్ళ మళ్ళీ ప్రజల మధ్య గొంతెత్తి పాడసాగాడు. ప్రజల్ని ఎంతగానో ఆకట్టుకో సాగాడు. ఇది చూసి ప్రభుత్వాధికారులు భయపడ్డారు. గరిమెళ్ళ బయట వుండటం ప్రభుత్వాధికారులు భయపడ్డారు. గరిమెళ్ళ బయట వుండటం ప్రభుత్వానికి మంచిది కాదని భావించి ఆయనను అరెస్టు చేశారు. కాకినాడ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచారు. మేజిస్ట్రేట్ రెండు సంవత్సరములు కఠిన కారాగార శిక్ష విధించాడు. గరిమెళ్ళ జైలులో వుండగా 1923 జనవరిలో ఆయన తండ్రి చనిపోయాడు. క్షమాపణ చెబితే విడుదల చేస్తామని చెప్పారట. కాని గరిమెళ్ళ క్షమాపణ చెప్పకుండా జైలులోనే ఉన్నాడు. అంతటి దేశభక్తుడు ఆయన.**

దొరతనం ' అనే గేయం రాయమని అడిగారట. దేశ భక్తుడు, స్వాతంత్ర్య పిపాసి అయిన గరిమెళ్ళ అందుకు అంగీకరించలేదట.

గరిమెళ్ళ పేదరికం అనుభవిస్తున్న రోజుల్లో దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు కొంత సహాయ పడ్డాడు. వావిళ్ళ వేంకటేశ్వర శాస్త్రులు ప్రతినెలా ఆయనకు ఆర్థిక సహాయం చేసేవాడు. వివిధ పత్రికలకు, ఆలిండియా రేడియోకి రచనలు చేసి కొంత గడిస్తున్నా ఆయన అవసరాలకు ఆ డబ్బు చాలలేదు. ఒకవైపు పేదరికం, మరోవైపు అనారోగ్యం ఆయనను బాగా దెబ్బతీశాయి. చివరిదశలో ఒక కన్ను పోయింది. పక్షవాతం వచ్చింది. దిక్కులేని పరిస్థితుల్లో కొంతకాలం యాచన మీద బ్రతికాడు. జీవిత చరమాంక దశలో దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించిన గరిమెళ్ళ 1952 డిసెంబర్ 18వ తేదీన స్వగ్రామంలో మరణించాడు. పాలకుల తీరుపై పోరు సాగించిన యోధుడుగా గరిమెళ్ళ చరిత్రలో మిగిలి పోయాడు.

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



## దేవాలయాల సంరక్షణకు పాటుపడాలి

**విశ్వంభర, ఆమనగల్లు :** వెల్దండ మండలం గుండాల గ్రామ పంచాయతీలో గల అంబా రామలింగేశ్వర స్వామి ఆలయం పాలకవర్గం నూతనంగా ఏర్పాటు అయ్యింది. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో పాలకవర్గం ప్రమాణ స్వీకరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి, ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్ రెడ్డి , పిబిసి మెంబర్ బాలాజి సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రమాణస్వీకారం చేసిన పాలకవర్గానికి వారు శుభాకాంక్షలు తెలిపి, జిల్లాలోని పెద్దదైన దేవస్థానాలలో గుండాల అంబా రామలింగేశ్వర స్వామి దేవాలయం ఒకటని పాలకవర్గం దేవాలయాన్ని అభివృద్ధి పరిచి ఆలయ సంరక్షణకు పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, పోతపల్లి సంజీవ యాదవ్, మట్ట వెంకటయ్య గౌడ్, వెల్దండ, కల్వకుర్తి మండలాల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ పీపుల్స్ జేఏసీ ఆవిర్భావ సదస్సు

**విశ్వంభర, బషీర్‌బాగ్ :** నూతన తెలంగాణ పీపుల్స్ జేఏసీ ఆవిర్భావ సదస్సును శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ బీ సీతయ్య అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ముఖ్య అతిథులుగా పౌర హక్కుల నేత ప్రొ.హరగోపాల్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ చీమ శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ చరవాణిలో తన సందేశాన్ని వినిపించారు. సంపద అందరికీ చెందాలని అన్నారు. భూస్వామ్య, బ్రాహ్మణ భావజాలాలు సమాజానికి ప్రమాదకరమని అన్నారు. దురదృష్టవశాత్తు రాజ్య వ్యవస్థ, కార్పోరేట్, మార్కెట్ వ్యవస్థలకు లింకు ఏర్పడి సమాజాన్ని దోచుకుంటున్నారని ఆవేదన చెందారు. సమాజం బలమైన శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఏ దేశంలోనైనా సమాజం చైతన్యవంతంగా ఉంటేనే హక్కులు రక్షించబడతాయని వెల్లడించారు. తెలంగాణలో మరో జేఏసీ ఏర్పడడం పౌర సమాజానికి శ్రేయస్కరమని అభినందించారు. అనంతరం చీమ శ్రీను మాట్లాడుతూ సాధించుకున్న తెలంగాణలో జరుగుతున్న ప్రగతి ఫలాలు అందరికీ సమానంగా అందాలని చెప్పారు. చివరగా జేఏసీ కన్వీనర్ సీతయ్య మాట్లాడుతూ తమ పీపుల్స్ జేఏసీ ఆధ్వర్యంలో



11 డిమాండ్లను పాలకుల ముందు ఉంచుతున్నామని అన్నారు. సామాన్య ప్రజలు, రైతులు, యువకులు, విద్యార్థులు, వ్యవస్థలు వీటిలో మార్పు రావడమే లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేయాలన్నారు. సమాజం పేద ,ధనిక తారతమ్యాలు లేకుండా ప్రగతి పదంలో నడవాలని ఆకాంక్షించారు. ఈ ఆశయాల సాధన కొరకు న్యూ తెలంగాణ పీపుల్స్ జేఏసీ స్థాపన చేయడం జరిగిందని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ప్రజలను చైతన్య పరిచేందుకు వినూత్న కార్యక్రమాలతో నూతన తెలంగాణ పీపుల్స్ జేఏసీ ముందుకు వెళుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్పు కళామండలి అధ్యక్షులు ఎన్ఆర్ డాక్టర్ నతనియేలు, టి హనుమాన్లు, టీచర్స్ ఫోరం నాయకులు రాములు, డాక్టర్ అన్నపూర్ణ,హేమలత తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి వాల్మీకి వసంతి కుటుంబానికి
# ఎమ్మెల్యే ఆర్థిక సాయం

**మృతదేహం వెలికితీయడంలో ప్రభుత్వం వైఫల్యం**



**విశ్వంభర, కర్నూల్ :** నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో వాల్మీకి వసంత కుటుంబాన్ని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఓదార్చారు. గత ఏడురోజుల క్రితం అత్యాచారం చేసి అత్యంత కిరాతకంగా చంపి శవంను కాల్వలో పడేసామని కిరాతకులు అధికార్లకు చెప్పిన విషయం విధితమే! కానీ చిన్నారి వసంత మృత దేహాన్ని కనిపెట్టడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, వసంతి కన్న తల్లి తండ్రుల ఆవేదనలు చూస్తుంటే గుండెలు తరక్కు పోతున్నాయని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గత ఏడు రోజులు కింద కస్టడీలో తీసుకొని మైనర్ బాలురలను విచారిస్తున్నమని వారినుంచి సరైన సమాచారం తెలుసుకోలేక కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఏడు రోజుల నుంచి వాల్మీకి వసంత మృత దేహం కనిపెట్టలేని ఈ ప్రభుత్వం చిన్నారులకు, మహిళలకు రక్షణ ఎలా కల్పిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నుంచి బాధిత కుటుంబానికి పది లక్షల ఎక్స్‌గ్రేషియా మరియు ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. అనంతరం వారి కుటుంబానికి ఆయన ఆర్థిక సాయం అందజేశారు.

## ఉన్నోడికి ఒక లెక్క లేనోడికి ఇంకో లెక్క



**విశ్వంభర, ఆమనగల్లు :** మండల కేంద్రంలో ఆమనగల్లు నుంచి తలకొండపల్లి వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా బస్టాండ్ సమీపంలో చెరువు కట్ట వద్ద బ్రిడ్జి నిర్మాణంలో ఉంది. చెరువు కట్టకు వెళ్లే రహదారిలో ఇరువైపులా ఉన్న దుకాణాలను చిన్నచిన్న వ్యాపారస్తుల డబ్బులను, ఇండ్లను సైతం రహదారి విస్తరణలో భాగంగా తొలగించాలని గుత్తేదారు మార్కు వేసి మరి సూచించారు, చిన్న చిన్న డబ్బాలు దుకాణదారులు తమకు తామే మార్కు చేసిన దాకా తొలగించుకున్నారు. మిగతా వాటిని జెసిబితో గుత్తేదారు తొలగించారు. కానీ బ్రిడ్జికి ఇరుపక్కల ఉన్న రెండు పెద్ద దుకాణ సముదాయాలను మాత్రం వదిలిపెట్టారు. ఇదేంటని ప్రశ్నిస్తే వారు కోర్టు నుంచి వెళ్లు స్టే తెచ్చుకున్నారని కోర్టు నియమాలు పాటించాలని గుత్తేదారు సర్దుకుపోయి అక్కడ మాత్రం దుకాణాలకు ఎటువంటి ప్రమాదం లేకుండా డ్రైనేజీ పనులు చేస్తున్నారని బిల్డింగు ముట్టకుండా రోడ్డు పనులు కొనసాగిస్తున్నారని అంటున్నారు. అలాంటప్పుడు మా షాపులు కూడా తొలగించకుండా ఉంటే మేము కూడా కోర్టుకు వెళ్లే వారమని, ఉన్నవారికి ఒక లెక్క లేనివారికి ఇంకో లెక్క అని దుయ్యబడుతున్నారు. రోడ్డు విస్తరణ పనులు అందరికీ ఒకేలా ఉండాలని ప్రజలు కోరుతున్నారు.



## నాసిరకం నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్

**విశ్వంభర, సంగారెడ్డి:** మంచి రుచి ఆరోగ్యం కోసం అల్లం వెల్లుల్లి పేస్టును అన్ని వంటల్లో వాడుతుంటారు. అలాంటి పేస్టును తయారు చేసి కొంతమంది కేటుగాళ్లు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. పలు ముడి పదార్థాలతో అల్లం వెల్లుల్లి పేస్టును కల్తీ చేసి జిల్లా వ్యాప్తంగా సరఫరా చేస్తున్న వ్యక్తిని ఇంద్రకరణ్ పోలీసులు అరెస్టు చేశారు. సంగారెడ్డి రూరల్ సీఐ అశోక్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ..కంది మండలం జుల్కల్ గ్రామానికి చెందిన మహమ్మద్ వసీం అనే వ్యక్తి తన ఇంట్లో తహ ఫుడ్స్ పేరుతో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ ను గత కొద్ది రోజులుగా తయారు చేస్తున్నాడు అని తెలిపారు. పలువురి నుండి సమాచారం అందిన మేరకు తనిఖీ చేసిన్ పోలీసులు ఫుడ్ సేఫ్టీ అధికారులతో పేస్టుని టెస్టింగ్ కోసం ల్యాబ్ కు పంపించారు. అది నాసిరకం పేస్ట్ అని రిపోర్ట్ వచ్చింది. దీంతో వసీం ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి సుమారు 600 కిలోల నాసిరకం అల్లం వెల్లుల్లి పేస్ట్ సీజ్ చేశారు. ప్రజలు ఎక్కడైనా ఏదైనా కల్తీ జరుగుతున్నట్టు తమకు తెలిస్తే వెంటనే సమీప పోలీసులకు సమాచారం అందించాలని ఇంద్రకరణ ఎస్సై విజయ్ కుమార్ సూచించారు.

## పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ నారాయణరెడ్డి



**విశ్వంభర, దోమ :** స్థానిక పోలీస్ స్టేషన్‌ను శనివారం ఎస్పీ నారాయణ రెడ్డి అకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్‌లో పలు రికా ర్డులను పరిశీలించి, నేరాలు, సిబ్బంది వివరా లు, పని తీరును గురించి ఎస్సై ఆనంద్ కు మార్‌ని ఆరా తీసారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాంకేతికతను అడాప్ట్ చేసుకోవాలని, సైబర్ క్రైమ్, ఆన్లైన్ మోసాలు, మత్తు పదార్థా లపై ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో డి.ఎస్.పి కరుణాసాగర్ రెడ్డి, ఎస్ఐ ఆనంద్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఖాకీ వనంలో గంజాయి మొక్కలు..

**తవ్వేకొద్దీ వెలుగులోకి వస్తున్న వాస్తవాలు..!**

**విశ్వంభర, మెదక్ :** జిల్లాలో పోలీస్ శాఖ అపఖ్యాతి మూటగట్టుకుంటోంది. వరుస ఘటనలతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. రక్షించాల్సిన రక్షకభటులే, భక్షక భటులుగా మారుతున్నారు. ఖాక%ష% వనంలో గంజాయి మొక్కల్ల కొంతమంది పోలీసులు అవినీతి సొమ్ముకు అలవాటు పడి, ఏసీబీ అధికారులకు చిక్కుతున్నారు. గతంలో అరెస్టు అయినా.. ఆ ఎస్ఐ తీరు ఎందుకు మారలేదు..? ఇంతకీ జిల్లా పోలీస్ శాఖకు ఏమైంది..? మెదక్ జిల్లాలో వరుస ఘటనలతో పోలీస్ శాఖ పేరు మసక బారుతోంది. ఒక ఘటన మరవకు ముందే, మరో సంఘటన ఆ శాఖ పరువు తీస్తోంది. దీంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి ఆ శాఖ పెద్దలది. జూన్ నెల 28న అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు పోలీసులు. ఆ ట్రాక్టర్‌ను వదిలేందుకు ముప్పై వేల రూపాయలు డిమాండ్ చేశాడు మెదక్ జిల్లా హవేళిఘనపూర్ ఎస్ఐ ఆనంద్ గౌడ్. ఇరవై వేలు ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది. అయితే ట్రాక్టర్ యజమాని గంగాధర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఆ డబ్బును మధ్యవర్తి మస్తాన్‌కు ఇవ్వాలని సూచించాడు ఎస్ఐ ఆనంద్‌గౌడ్. ఈ క్రమంలోనే డబ్బు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు ఏసీబీ అధికారులు. మార్చిలోనూ సేమ్ సీన్. మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారంటూ ఓ ట్రాక్టర్‌ను పట్టుకున్నారు మెదక్ రూరల్ పోలీసులు. దానిని వదిలేసేందుకు లంచం తీసుకుంటూ కానిస్టేబుల్ సురేందర్ ఏసీబీ అధికారులకు దొరికాడు. ఎస్ఐ అమర్ హస్తం ఉందని నిర్ధారించిన అధికారులు ఎస్ఐ అమర్‌తోపాటు కానిస్టేబుల్ బాసిత్‌ను కూడా సస్పెండ్ చేశారు ఉన్నతాధికారులు.



మధ్యవర్తులను ఏర్పాటు చేసుకుని మరీ, వసూళ్లకు పాల్పడుతున్నారు అధికారులు. ఇలా వరుస ఘటనలతో పోలీసు శాఖ పేరు మసకబారుతోంది. ఇక ఇటీవలే ఏసీబీకి చిక్కిన హావేలి ఘనపూర్ ఎస్ఐ ఆనంద్‌గౌడ్ వ్యవహారశైలి ఆది నుండి వివాదస్పదమే. గతంలో నోట్ల రద్దు సమయంలోనూ ఏకంగా ఏ1 ముద్దాయిగా అరెస్టు అయ్యాడు. రెండు వేల పదహారు అక్టోబర్‌లో నోట్ల మార్పిడి ముఠా ఒకటి, మనోహరాబాద్‌లో తిష్టవేసి మోసాలకు పాల్పడింది. కోటి రూపాయల వరకూ చేతులు మారాయి. ఈ వ్యవహారంలో నిందితులకు అనుకూలంగా వ్యవహరించిన ఎస్ఐ ఆనంద్‌గౌడ్ బాధితులపై లాఠీఛార్జి చేశారన్న ఆరోపణలున్నాయి. ఈ కేసులో ఆనంద్‌గౌడ్ ఏ1 ముద్దాయిగా అరెస్ట్ అయి జైలుకు వెళ్లాడు. ఆ తరువాత కామారెడ్డి జిల్లాలో పని చేసి ఎన్నికలకు ముందు తిరిగి మెదక్ జిల్లాకు వచ్చాడు. కానీ అతని వ్యవహార శైలి మారకపోవడంతో ఇప్పుడు ఏకంగా ఏసీబీకే చిక్కాడు.

## విద్యుత్ షాక్‌తో విద్యార్థికి గాయాలు

**విశ్వంభర, మేడిపల్లి :** మేడిపల్లి పీఎస్ పరిధి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్లోని బుద్దానగర్ పబ్లిక్ పార్క్ వద్ద విద్యుత్ షాక్‌తో అనీష్ రాజ్ (13) అనే విద్యార్థికి శనివారం గాయాలయ్యాయి. ఆడుకోడానికి స్థానిక పబ్లిక్ పార్కు వచ్చిన బాలుడు రాజ్ క్రికెట్ ఆడుతుండగా, భద్రత లేని ట్రాన్స్ ఫార్మర్ వద్ద బంతి పడటంతో దాన్ని తీసే క్రమంలో విద్యుత్ షాక్కు గురయ్యాడు. గమనించిన స్థానికులు ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.





## చీటింగ్ కేస్‌లో ఇద్దరు రిమాండ్

**విశ్వంభర, ఘట్కేసర్ :** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ కేశవ్‌నగర్ వెంచర్‌లోని ఒక ఫ్లాట్‌కు సంబంధించి ఫ్లాట్ ఓనర్ నుంచి అగ్రిమెంట్ చేయించుకున్నామని చెప్పి ఘట్కేసర్ మండల్ ఎదులాబాద్‌కు చెందిన మీరాల గణేష్ బుగ్గనగర్, ఘట్కేసర్‌కు చెందిన వల్లపు మహేష్, మక్కల శ్రీకాంత్ మరియు వెంకిర్యాలకు చెందిన యాకరి గణేశ్‌లు కలిసి చౌదరి గూడకు చెందిన గొట్టి పాముల సుదర్శన్ అనే వ్యక్తికి 9లక్షల 80 వేల రూపాయలు అడ్వాన్స్ తీసుకున్నారు. తరువాత రిజిస్ట్రేషన్‌కి కాలయాపన చేస్తున్నారు. తదుపరి గొట్టిపాముల సుదర్శన్ విచారణ చేయగా ఇట్టి నలుగురు వ్యక్తులు ప్లాట్ ఓనర్ నుంచి ఎలాంటి అగ్రిమెంట్ పొందలేదని మోసపూరితంగానే తనకి తప్పుడుగా అగ్రిమెంట్ ఇచ్చారని, డబ్బులు తిరిగి ఇవ్వక పోవటంతో గొట్టిపాములు సుదర్శన్ ఘట్కేసర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేసి వాళ్ల మీద చీటింగ్ కేసు నమోదు చేసి మీరాల గణేష్, వల్లపు మహేశ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.ఠ మరో ఇద్దరు వ్యక్తులు మక్కల శ్రీకాంత్, యాకరి గణేశ్‌లు పరారిలో ఉన్నారు.

## చింతపల్లి ప్రెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో
# ఉచిత వైద్య శిబిరం



**విశ్వంభర, చింతపల్లి :** చింతపల్లి ప్రెస్ అసోసియే షన్ రి.నెం.336/2024 ఆధ్వర్యంలో బీఎన్ రెడ్డి నీలాద్రి హాస్పిటల్స్ మరియు మాల్ పద్మావతి హాస్పిటల్స్ వారి నేతృత్వంలో వైద్య రంగంలో అనుభవం కలిగిన డాక్టర్లచే చింతపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని చింతపల్లి ప్రెస్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో బీపీ షుగర్ టెస్టులు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని వారు తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రెస్ అసోసియేషన్ కమిటీ సభ్యులు కోరారు.




యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండలం, దుప్పల్లి గ్రామంలో బాబు జమాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్ సేవలు మరియు ప్రజా సేవ కార్యాలయాన్ని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొ.కోదండరాం ప్రారంభించారు.
– విశ్వంభర, వలిగొండ

# భాగ్యనగరంలో ఘరానా మోసం

## రూ.24 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసిన జాగ్రుతి కన్సల్టెన్సీ




**విశ్వంభర, హైదరాబాద్ :** ఈ మధ్య కాలంలో నిరుద్యోగుల్ని టార్గెట్ చేసుకొని భారీ మోసాలకు పాల్పడుతున్నారు కొందరు కేటుగాళ్లు. ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేయడం.. ఆపై మనీ చేతికి అందగానే బోర్డు తిప్పేయడం కామన్ అయిపోయింది. సరిగ్గా ఇలాంటి మోసమే హైదరాబాద్‌లో మరొకటి వెలుగు చూసింది. ఉద్యోగాల ఆశ చూపి.. ఓ ఐటీ కన్సల్టెన్సీ రూ. 24కోట్లకు కుచ్చు టోపీ పెట్టడంతో లబోదిబోమంటున్నారు నిరుద్యోగులు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జాగృతి కన్సల్టెన్సీ నిరుద్యోగులను నిండా ముంచేసింది. ఉద్యోగాలు ఇస్తాం.. ఉద్యోగాలు ఇప్పిస్తాం.. అంటూ భారీ ఎత్తున ప్రచారం చేసిన జాగృతి కన్సల్టెన్సీ. నమ్మి వచ్చినవారిపై కుట్ర అమలు చేసింది. ఉద్యోగం ఊరికే రాదు.. 2 లక్షల రూపాయల డిపాజిట్ చేయాలని కండీషన్ పెట్టింది. ఐటీ కంపెనీలో ఉద్యోగమనే ఆశతో 1200 మంది నిరుద్యోగులు.. ఒక్కొక్కరు 2 లక్షల రూపాయలు కట్టారు. అయితే.. రూ. 2 లక్షలు కట్టినోళ్లకు ఫేక్ ఆఫర్ లెటర్స్‌తో ఉద్యోగాలు ఇచ్చింది. అట్టహాసంగా ఆఫీసు ఏర్పాటు చేసి ఉద్యోగాలు ఇచ్చిన కన్సల్టెన్సీ, జీతాలు మాత్రం ఇవ్వడం మానేసింది. అంతే.. మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కంపెనీని నిలదీశారు ఉద్యోగులు. జీతాలు అయినా ఇవ్వండి లేకుంటే తాము కట్టిన 2 లక్షల రూపాయలు అయినా తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కానీ, పరిస్థితులు చేయి దాటడంతో రాత్రికి రాత్రి బోర్డు తిప్పేసింది జాగృతి కన్సల్టెన్సీ. 1200 మంది నుంచి 24 కోట్ల రూపాయలు వసూలు చేసి జాగృతి కన్సల్టెన్సీ డైరెక్టర్ జగదీశ్ మోసం చేశారని బాధితులు జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించడంతో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. మరోవైపు.. ఉద్యోగాల పేరుతో మోసం చేయడమే కాక.. ప్రశ్నించిన వారిని కేసుల్లో ఇరికించడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మాట్లాడుకుందామని ఇంటికి పిలిచిన వాకాటి రవిచంద్రారెడ్డి.. కిడ్నాప్ డ్రామా ఆడారని బాధితులు ఆరోపించారు. తప్పుడు కేసులు పెడుతున్న రవిచంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు బాధితులు.



## 700ఏళ్ల చరిత్ర కలిగిన కోనేటిని

# రాత్రికి రాత్రే పూడ్చేశారు..

**విశ్వంభర, మహబూబ్‌నగర్ :** ఆ కోనేరుకు సుమారు 700ఏళ్ల చరిత్ర ఉంది. స్వయంగా వెలసిన రంగనాయకస్వామి వారి అభిషేక జలాలతో నిత్యం కళకళలాడుతుంది. ఆ కోనేటి జలం భక్తులకు పరమ పవిత్రం. భక్తుల అధ్యాత్మికతతో అనుబంధం ఉన్న కోనేరును అభివృద్ధి పేరిట పూడ్చేశారు. అది కూడా అమవాస్య రోజున. అసలు బాదేపల్లి గుట్టపై పూడ్చివేత కంటే ముందు తవ్వకాలు జరిగాయన్న ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. మహబూబ్ నగర్ జిల్లా పట్టణానికి ఆనుకొని ఉన్న బాదేపల్లి పెద్దగుట్ట రంగనాయకస్వామి ఆలయం భక్తుల పాలిట కొంగుబంగారం. ఎత్తైన గుట్టపై పచ్చని చెట్ల మధ్య సుమారు ఏడు వందల ఏళ్ల క్రితం రంగనాయకస్వామి స్వయంభుగా వెలిశాడని భక్తులు నమ్మకం. శ్రావణమాసం వచ్చిందంటే చాలు గుట్టపై భక్తులతో కిటకిటలాడుతుంది. స్వామివారి ఆలయంలో ఎలాంటి దీపాలు, విద్యుత్ దీపాలు అస్సలే లేవు. పవళించిన రూపంలో ఉండే స్వామివారికి ఎండ, వాన నేరుగా అభిషేకం చేస్తుంటాయి. అయితే రంగనాయకుల స్వామివారి విగ్రహానికి ఎంత చరిత్ర ఉందో ఆలయానికి ఆనుకొని ఉన్న కోనేరుకు అంతే చరిత్ర ఉంది. స్వామివారికి కోనేటిలోని నీటితో అభిషేకం చేస్తారు. అందుకే కోనేరు జలం ఎంతో పవిత్రంగా భావిస్తారు భక్తులు. కుటుంబంలో ఎవరూ అనారోగ్యంతో ఉన్నా పంటపొలాలను చీడపీడలు పీడిస్తున్న ఈ నీటిని ఔషధంలా ఉపయోగిస్తారు. ఇక్కడికి వచ్చే భక్తులు ముందుగా కోనేటిలో అడుగు పెట్టందే గుడిలోకి వెళ్లరు.

### వివాదంగా కోనేరు పూర్చివేత

అంతటి ప్రాశస్త్యం కలిగిన ఈ కోనేరు పూడ్చివేత ఇప్పుడు వివాదంగా మారింది. అభివృద్ధి పనుల పేరిట పరమ పవిత్రమైన కోనేరును పూర్తిగా మూసేశారు. దీనికి తోడు స్వామి వారి ఆలయానికి పక్కనే ఉన్న ముడుపులు కట్టే చెట్టును కూల్చేశారు. మండపాన్ని తొలగించారు. విషయం తెలుసుకున్న భక్తుల్లో ఆందోళన మొదలైంది. అసలు అమావాస్య నాడు కోనేరు పూడ్చడమేంటి అన్న వివాదం తెర మీదకు వచ్చింది. కేవలం గుప్త నిధుల కోసమే కోనేరులో తవ్వకాలు జరిపారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. త్వరలో శ్రావణమాసం రాబోతున్న నేపథ్యంలో భక్తులకు అనుమానం రాకుండా ఉండేందుకే కోనేటిని పూడ్చివేశారని చర్చలు మొదలయ్యాయి. విషయం తెలుసుకున్న హిందూ సంఘాలు ఈ వ్యవహారంపై ఆందోళన బాట పట్టాయి. గుట్టపై ఏం జరుగుతోందో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఏకంగా జడ్చర్ల పట్టణ బంద్ కొనసాగించారు. టౌన్‌లో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఇక మరోవైపు పెద్ద గుట్ట ఘటనపై నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగనాయకులస్వామి వారి కోనేటి పూడ్చివేతపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు ఎంపీ డికె అరుణ. జడ్చర్ల సీఐ ఆది రెడ్డి, ఇతర ఉన్నతాధికారులకు ఫోన్ చేసి ఆరా తీశారు. హిందువుల మనోభావాలు దెబ్బతీయాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదనీ హెచ్చరించారు. ఇక, భక్తుల ఆరోపణలతో గుట్టను ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సందర్శించారు. భక్తుల మనోభావాలకు భాగం కలిగిస్తే ఊరుకునేది లేదని మండిపడ్డారు.

### అభివృద్ధి పనుల్లో భాగంగానే:

రంగనాయక స్వామివారి ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగానే ఈ పనులు జరిగాయని ఆలయ ధర్మకర్త రవితేజ గౌడ్ చెబుతున్నారు. ఆగమ శాస్త్రం ప్రకారమే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరణ ఇచ్చారు. వాస్తు ప్రకారం ఈశాన్యంలో ఉండాల్సిన కోనేరు ఆగ్నేయం మూలలో ఉందని చెప్పుకొచ్చారు. సుమారు రూ. 5కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించామన్నారు. రాతికట్టడంతో ఆలయ నిర్మాణం జరగబోతుందని త్వరలోనే శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కొంతమంది కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు రవితేజ గౌడ్. ఇక కోనేరులో గుప్తనిధుల తవ్వకాల ప్రచారంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కోనేరు పూడ్చివేతకు సంబంధించి ధర్మకర్త రవితేజ గౌడ్ ని విచారించామని జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి వెల్లడించారు. దర్యాప్తులో తేలిని అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. భక్తుల మనోభావాలు దృష్టిలో పెట్టుకొని పూడ్చిన కోనేటిని పుర్వ స్థితికి తెచ్చామన్నారు. గుట్టపై పోలీస్ శాఖ కు సంబంధించిన సీసీ కెమెరాలు ఉన్నాయని వాటిని పరిశీలిస్తామని సీఐ తెలిపారు. భక్తుల మనోభావాలతో కూడిన ఈ అంశం లో ఎవరిని సంప్రదించకుండా 700ఏళ్ల చరిత్ర కలిగిన కోనేరు, మండపాన్ని తొలగించడం వివాదాస్పదం అయ్యింది. అసలు అమవాస్య రోజున పనులపై భక్తులు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఆరు నెలల ప్రజా పాలనలో

# ఆరు గ్యారెంటీలు అమలు కాలేదు

### ఎంపీ రఘునందన్ రావు



**విశ్వంభర, మెదక్ :** బీజేపీ ఎంపీ రఘునందన్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన ట్విట్టర్ లో పోస్ట్ చేశారు అందులో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రజాపాలన ఆరు గ్యారంటీల దరఖాస్తుల అమలు గురించి ప్రశ్నించారు. ఎంపీ రఘునందన్ రావు తన ట్వీట్ లో ఇవి గుర్తున్నాయా ఎవరికైనా?? రాష్ట్ర ప్రజలు లైనులో నిలబడి ఫామ్ నింపి ఆరు నెలలు అయింది. కానీ ఆరు గ్యారంటీలు మాత్రం అమలుకాలే!! పార్టీ ఫిరాయింపుల మీద ఉన్న శ్రద్ధ ఇచ్చిన హామీల మీద లేకపాయే. ఇదేనా తెలంగాణ లో ప్రజా పాలనా అంటే ?? అంటూ ప్రశ్నించారు. ఇదిలా ఉంటే ఇటీవల కాలంలో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా గెలిచిన నాయకులు ఒక్కొక్కరుగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ పార్టీలో చేరగా, 9 మంది ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అలాగే మరికొంతమంది కూడా పార్టీ మారే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది.

# చెల్లి అంటూనే కానిస్టేబుల్ రాసలీలలు.. !



**విశ్వంభర, ఖమ్మం :** ఖమ్మంలో చెల్లి అంటూనే ఓ కానిస్టేబుల్ రాసలీలలకు పాలపడ్డాడు. తెలంగాణ రాష్ట్రంలో పోలీస్ శాఖలో రోజు రోజుకు ఇలాంటి ఉదంతాలు పెరుగుతున్నాయి. కోర్టు విషయంలో వచ్చిన వివాహితను చెల్లి, బుజ్జి అంటూ దగ్గరైన కానిస్టేబుల్ ను.. రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నాడు భర్త. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బాంబ్ స్క్వాడ్ లో పని చేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ రాంబాబు, కోర్టుకు వచ్చిన వివాహితను చెల్లి, బుజ్జి అంటూ లోంగదిసుకొని అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. భార్య వ్యవహారంపై అనుమానం వచ్చిన భర్త నిఘా పెట్టగా తన భార్యతో, కానిస్టేబుల్ రాంబాబు ఏకాంతంగా ఉన్నప్పుడు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నాడు. ఇంతకు ముందు ఇద్దరు ఏకాంతంగా గడిపినప్పుడు తీసుకున్న వీడియోలు భార్య ఫోన్లో దొరికాయి. రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నప్పుడు భర్తపై కానిస్టేబుల్ రాంబాబు దాడి చేసి పారిపోయాడు.. 10 ఏండ్ల ప్రేమ, ఇద్దరు పిల్లలు ఉన్న తన భార్యను కేసు విషయంలో వస్తే ఇలా ట్రాప్ చేయడం ఏంటని భర్త ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు.



## 26న తెలంగాణకు కురియన్ కమిటీ రాక

### టీ-కాంగ్రెస్ నేతల్లో ఉత్కంఠ..!

**విశ్వంభర, నాంపల్లి :** లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి ఆశించిన సీట్లు రాకపోవడంతో నిజనిర్ధారణ కోసం ఏఐసీసీ నియమించిన కురియన్ కమిటీ రెండు రోజుల రివ్యూ టూర్ ముగిసిన విషయం తెలిసిందే. ఏఐసీసీ నేత కురియన్ ఆధ్వర్యంలో రఖిబుల్ హుస్సేన్, ఫర్గత్ సింగ్ తో కూడిన త్రిసభ్య కమిటీ.. గురు, శుక్రవారాల్లో గాంధీభవన్ వేదికగా 16 మంది లోక్ సభ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జీలు, డీసీసీ అధ్యక్షుల నుంచి అభిప్రాయాలను స్వీకరించింది. అయితే, కమిటీ మరోసారి రాష్ట్రానికి రానున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఈ నెల 26 వ తేదీన రాష్ట్రానికి కురియన్ కమిటీ రానున్నట్లు తెలిసింది. రెండు రోజులు జరిపిన విచారణలో హాజరైన నేతలందరూ దాదాపుగా ఒకే అభిప్రాయాన్ని చెప్పినట్లు తెలిసింది. ముఖ్యంగా లోక్సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి బదిలీ జరిగిందని, ఉత్తర తెలంగాణలోని కొన్ని చోట్ల హిందుత్వ ప్రభావం చూపడమే కారణమని స్పష్టం చేశారు. మరికొన్ని చోట్ల కార్యకర్తలు కష్టపడనా కొన్ని చోట్ల నాయకులు తప్పుచేశారనే ఆరోపణలు కమిటీ దృష్టికి వచ్చింది. ఈ అభిప్రాలపై కమిటీ ఓ రిపోర్ట్ రెడీ చేసి హై కమాండ్ దృష్టికి తీసుకెళ్ళనుంది. దీంతో ఈ రిపోర్టు టీ కాంగ్రెస్ నేతల్లో ఉత్కంఠ నెలకొంది.

### నార్సింగిలో

## బుల్లెట్ కలకలం

### పరుగులు తీసిన జనం..!

**విశ్వంభ, నార్సింగి:** ఈ మధ్య కాలంలో గన్ మిస్ ఫైరింగ్ ఘటనలు చాలానే చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, వరంగల్ వంటి ప్రాంతాల్లో ఎక్కువగా చోటు చేసుకోవడం గమనార్హం. గన్ మిస్ ఫైరింగ్ వల్ల పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై, ఓ డీఎస్పీ ఇలా చాలా మంది మరణించిన ఘటనలు చోటు చేసుకున్నాయి. తాజాగా హైదరాబాద్ నార్సింగి బైరాగిగూడలో బుల్లెట్ కలకలం సృష్టించింది. ఈ బుల్లెట్ ప్రమాదంలో ఎవ్వరికీ ఏమి కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బైరాగిగూడలోని ఓ అపార్టుమెంట్‌లోని 5 అంతస్తులోని కిటికి అద్దాలు ధ్వంసం కావడంతో పాటు ఏకంగా బెడ్ రూమ్ లోకి బుల్లెట్ దూసుకొచ్చింది. దీంతో అపార్టుమెంట్ వాసులు పరుగులు తీశారు. ఆర్మీ ఫైరింగ్ రేంజ్ నుంచి బుల్లెట్ దూసుకొచ్చినట్టు సమాచారం. అక్కడి స్థానికులు భయంతో అక్కడి నుంచి పరుగులు తీశారు. ఆర్మీ ఫైరింగ్ రేంజ్ గన్ మిస్ ఫైర్ కావడంతో బుల్లెట్ దూసుకొచ్చినట్టు పోలీసుల విచారణలో తేలింది. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



## పాము కాటుకు గురైన

# ముగ్గురు విద్యార్థులు..!

**విశ్వంభర, జోగులాంబ గద్వాల :** జిల్లా కేంద్రంలోని ఆర్టీవో కార్యాలయం వెనుక ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో శనివారం మధ్యాహ్నం మూత్ర విసర్జనకు వెళ్ళిన నలుగురు విద్యార్థుల్లో ముగ్గురు పాము కాటుకు గురయ్యారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఓ మెకానిక్ షాపులో పనిచేస్తున్న మైనర్ బాలుడు గోనుపాడు గ్రామానికి చెందిన అనిల్ కుమార్, కేటి దొడ్డి మండలం తూర్పు తాండాకు చెందిన సంతోష్ నాయక్, ఐజ మండలం తనగల గ్రామానికి చెందిన అర్జున్ కుమార్, గద్వాలకు చెందిన వీరేంద్ర చార్యులను చైల్డ్ ప్రొటెక్షన్, లేబర్ అధికారులు పట్టుకొని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో వదిలారు. ఈ నలుగురు విద్యార్థులు శనివారం మూత్ర విసర్జనకు వెళ్లారు. అక్కడ పాముకాటు గురి కావడంతో హుటాహుటిన గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థులు క్షేమంగానే ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు. మరో వైపు మెదక్ జిల్లా రామాయంపేటలోని గురుకుల హాస్టల్‌లో విద్యార్థినులను, మెదక్ జిల్లా నర్సాపూర్‌లో అల్లూరి సీతారామరాజు గురుకులంలోనూ ఎలుకలు కరిచిన ఘటన తెలిసిందే.



## గోల్డ్ లవర్స్‌కి బిగ్ షాక్..

### ఒక్కరోజులోనే భారీగా పెరిగిన బంగారం ధర

**విశ్వంభర, హైదరాబాద్:** బంగారం ధర భారీగా పెరిగింది. శుక్రవారం పెరిగిన బంగారం ధరలు శనివారం పెరిగాయి. ఈ ప్రపంచంలోనే అత్యంత విలువైనది బంగారం. బంగారానికి ఉన్న డిమాండ్ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. మన దేశంలో అయితే.. దీనికి ఉన్న డిమాండ్ మరీ ఎక్కువే. ఏ చిన్న పండగ జరిగినా బంగారం, వెండి కొనుగోలు చేయడానికి మహిళలు చాలా ఆసక్తి చూపుతారు. ఇది ఇలా ఉండగా, హైదరాబాద్ నగరంలో బంగారం, వెండి ధరల వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ మార్కెట్ లో ఇవాళ 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 10 పెరిగి రూ. 73, 760 గా నమోదు కాగా.. అదే సమయం లో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 10 పెరిగి రూ. 67, 610 గా పలుకుతుంది. ఇక వెండి ధరలు తగ్గుదల నమోదు అయ్యాయి. దీంతో కేజీ వెండి రూ. 100 తగ్గి రూ. 95, 400 గా నమోదు అయింది. అయితే.. మరో ఏడాదిలోపు.. దేశ వ్యాప్తంగా తులం బంగారం ధర 80 వేలు చేరే ఛాన్స్ ఉన్నట్లు కథనాలు వస్తున్నాయి.

# రెండు అల్పపీడనాలు

## తెలంగాణ, ఏపీలకు 10 రోజులు భారీ వర్షాలు!



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు బిగ్ అలర్ట్. తెలంగాణ అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో వచ్చే పది రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. బంగాళాఖాతంలో జూలై 15వ తేదీ నుంచి 22వ తేదీ వరకు వరుసగా రెండు అల్పపీడనాలు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. వీడి ప్రభావంతో రాబోయే పది రోజులు తెలంగాణ రాష్ట్రంలో అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఆంధ్రప్రదేశ్ అలాగే తెలంగాణతో పాటు ఒడిశా, కర్ణాటక, మహారాష్ట్ర గుజరాత్ రాష్ట్రాల్లో కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడవచ్చని.. వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్, కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట, వరంగల్, మెదక్, లాంటి ఉత్తర తెలంగాణ వాతావరణ శాఖ. దక్షిణ తెలంగాణలో మోస్తారు వర్షాలు పడే అవకాశాలు ఉన్నట్లు హెచ్చరించింది. హైదరాబాద్ లో మాత్రం ప్రతిరోజు వర్షం పడే అవకాశాలు ఉన్నట్లు స్పష్టం చేసింది. ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గుంటూరు, తూర్పుగోదావరి, బాపట్ల, అంబేద్కర్ కోనసీమ లాంటి జిల్లాల్లో వర్షాలు పడతాయని తెలిపింది.

# రైతులకు బిగ్ రిలీఫ్..

## ఐటీ కట్టే వారికి కూడా రైతు బంధు!



**విశ్వంభర, వనపర్తి :** రైతులకు బిగ్ రిలీఫ్.. ఐటీ కట్టే వారికి కూడా రైతు భరోసా ఇచ్చేందుకు సిద్ధమైనట్లు సమాచారం. రైతులు ఐటీ రిటర్న్లు దాఖలు చేస్తే రైతు భరోసా రాదేమోనని భయపడాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతు భరోసా అమలుపై వనపర్తిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'రుణమాఫీని ఆగస్టులో చేస్తాం. దీనివల్ల పెట్టుబడి సాయం కొంచెం ఆలస్యం కావచ్చు. ప్రకృతి వైపరీత్యాలతో పంటనష్టం జరిగితే రూ. 10 వేల వరకు పరిహారం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం' అని పేర్కొన్నారు. ఇది ఇలా ఉండగా, ఉమ్మడి జిల్లాల వారీగా రైతు భరోసాపై ప్రభుత్వం వర్క్ షాప్‌లు నిర్వహింస్తోంది. రైతులతో సమావేశమై వారిచ్చే సలహాలు, సూచనలను ఆచరణలోకి తీసుకోనున్నారు. 10న ఖమ్మం. 11,అదిలాబాద్, 12 మహబూబ్‌నగర్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వర్క్‌షాపులు నిర్వహించింది. 15 వరంగల్, 16 మెదక్, 18 నిజామాబాద్, 19 కరీంనగర్, 22 నల్గొండ, 23 రంగారెడ్డి ఆయా జిల్లాల వారీగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వర్క్‌షాపులు నిర్వహించనున్నది.



## ఘనంగా ఆంజనేయ స్వామి పల్లకీ సేవ

### భక్తులకు అన్నదానం చేసిన రామశేఖర్ రెడ్డి, శివ కుమారి దంపతులు

**విశ్వంభర, షాద్‌నగర్ :** మున్సిపాలిటి పరిధిలోని సోలీపూర్ చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ, జయ జయ రామ నినాదాలతో ఆట పాటలతో, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతి శర్మ, రాఘవేంద్ర చార్య, అర్చకులు కృష్ణ, ప్రమోద్, సునీల్ పంతులు భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు పట్టణంలోని న్యూ రాఘవేంద్ర కాలనీకి చెందిన ఎస్ రామశేఖర్ రెడ్డి, శివకుమారి దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేసిన వారికి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపి పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పులిమామిడి శ్రీశైలం గౌడ్, వసంత రావు, అన్నారం రఘు గౌడ్, గడ్డమీద రమేష్ ముదిరాజ్, రఘునందన్ రెడ్డి, లక్ష్మణ్, బచ్చన్న, కిషన్ నాయక్, రాఘవేందర్, సుప్ప నర్సింలు, శ్రీనివాస్, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, లక్ష్మికాంత్ రెడ్డి, కృష్ణ చారి, శంకర్ గౌడ్, యాదగిరి, పి.ప్రవీణ్ గౌడ్, పద్మా వెంకటేష్, గోరియా నాయక్, కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్, రమేష్, సుధాకర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, రవీందర్, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య, భజన భక్త బృందం, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## చదువుతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

### డాక్టర్ సంతోష్ రెడ్డి

**విశ్వంభర, ఎల్బీనగర్ :** విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డా.సంతోష్ రెడ్డి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని భాష్యం పాఠశాల ఫ్రెషర్స్ డే వేడుకలు చింతలకుంటలోని పల్లవి గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ సంతోష్ రెడ్డి హాజరై ప్రసంగించారు. విద్యార్థులు మంచి ఆహారం, సరైన నిద్ర, వ్యాయామం చేయాలన్నారు. కాలినడక ప్రతిరోజు మన పనులలో భాగం చేసుకోవాలి అన్నారు. అనంతరం జోన్ 3 జెడ్ ఈ ఓ అంకమ్మ రావు మాట్లాడుతూ.. భాష్యం విద్యా సంస విద్యార్థులకు చదువుతోపాటు అన్ని కలలను ప్రోత్సహిస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పల్లవి, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్‌ని కలిసిన హుజురాబాద్ మత్స్యకారులు



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర మత్స్య భవన్‌లో శనివారం హుజురాబాద్ నియోజకవర్గం మత్స్యకారులు రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని పలు మండలాల్లోని చెరువుల సమస్యల గురించి చైర్మన్ సాయికుమార్‌తో విన్నవించుకున్నారు. అతి త్వరలో చెరువుల సమస్యల పరిష్కారరిస్తామని, మత్స్యకారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.
గత ప్రభుత్వంలో మత్స్యకారులకు తీవ్రమైన సమస్యలు నెలకొ న్నాయని, అందుకే ప్రజలు గత ప్రభుత్వాన్ని గద్దె దించి ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకొన్నార న్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రంలో నున్న మత్స్యకారుల సంక్షేమానికి ఎల్లవేళలా తాము కృషి చేస్తామని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తెలిపారు.

# స్పోర్ట్స్ అథారిటీని ఉన్నతంగా తీర్చిదిద్దుతాం

- అందరి సహకారంతో అభివృద్ధి సాధిస్తాం
- క్రీడా కుటుంబ సభ్యులందరం టీం వర్క్ తో పని చేస్తాం
- పదేండ్ల విధ్వంసం నుండి వికాసం వైపు క్రీడారంగాన్ని నడిపిస్తాం
- స్పోర్ట్స్ అథారిటీ నూతన చైర్మన్ కే. శివసేనారెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర క్రీడాకారుల సంక్షేమానికి, క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని స్పోర్ట్స్ అథారిటీ గౌరవాన్ని ఇనుమడింప చేసే విధంగా పక్కా ప్రణాళికతో, కార్యాచరణతో ముందుకెళ్తామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే. శివసేనారెడ్డి అన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ నూతన చైర్మన్ గా ఈరోజు జిఎంసి బాలయోగి స్టేడియంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి అందరి సలహాలు సూచనలతో , రాష్ట్రంలో అన్ని రంగాల్లో సమూల మార్పు తేవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేస్తున్న కృషికి తోడ్పాటుగా క్రీడారంగంలో కూడా సమూల మార్పులు తీసుకురావడానికి తన పదవీకాలంలో నిరంతరం పాటు పడతానని ఆయన అన్నారు. క్రీడల్లో ప్రోత్సాహానికి అధికప్రాధాన్యత దక్కే విధంగా, క్రీడా ప్రతి కార్యక్రమాలు యువతను భాగస్వామ్యంచేస్తూ సమగ్ర క్రీడా వికాసమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. తెలంగాణలో క్రియాశీలకమైన క్రీడా వాతావరణం నెలకొల్పడానికి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థను ఒక అత్యున్నతమైన సంస్థగా తీర్చిదిద్దేందుకు ఒక టీం వర్క్ తో ముందుకు వెళ్తామని ఆయన అన్నారు. రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులు పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి, అనిల్ కుమార్ యాదవ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏ.పీ జితేందర్ రెడ్డి,శాసన సభ్యులు దానం నాగేందర్ టీ.మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, వాకిటి శ్రీహరి ముదిరాజ్ ,ఇండియన్ క్రికెట్ టీం మాజీ కెప్టెన్ అజారుద్దీన్, మాజీ ఎంపీలు మధుయాష్కి గౌడ్, రాజయ్య, కాంగ్రెస్ నాయకులు ఫిరోజ్ ఖాన్ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్లు కోచులు, సిబ్బంది ఒలంపిక్ అసోసియేషన్ కార్యవర్గం వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఎన్.రమేష్ పలువురు జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని నూతన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన శివసేన రెడ్డికి అభినందనలు,శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన గచ్చిబౌలి స్టేడియం లో హరితహారం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు.


# ఆస్తి కోసమే హత్య..

- మూడో భార్యకు ఆస్తి మొత్తం రాసిస్తాడనే నేపథ్యంలోనే..
- బాడీగార్డ్ బాబాకు సుపారి
- పాషవికంగా కమ్మరి కృష్ణ మర్డర్
- మీడియా సమావేశంలో శంషాబాద్ డీసీపీ రాజేష్



**విశ్వంభర, షాద్‌నగర్ :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఏసీపీ కార్యాలయంలో శనివారం హత్యకు సంబంధించిన వివరాలను శంషాబాద్ డీసీపీ రాజేష్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడు కమ్మరి కృష్ణ చాలా కాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ.. పలు ఆస్తులు కలిగి ఉన్నాడని ఇందులో భాగంగా బండ్లగూడలోని కేకే కన్వెన్షన్, కమ్మదానంలోని కేకే ఫామ్ హౌస్ ఉందని, అయితే మృతుడు కృష్ణ మొదటి భార్య ఆమె పిల్లలను పట్టించుకోకుండా రెండో వివాహం చేసుకొని ఆవిడ మరణించిన తదుపరి మూడో వివాహం చేసుకున్నాడని తెలిపారు. మూడో వివాహం చేసుకున్న పావనికి 16 నెలలు కుమార్తె ఉంది.. మూడవ భార్య పేరిట దాదాపు 16 కోట్ల విలువచేసే టెన్ మోర్ బిల్డింగ్, కేకే బిల్డింగ్ లను రిజిస్ట్రేషన్ చేశాడని తెలిపారు. అయితే ఆస్తి విషయంలో మొదటి భార్య పెద్దకొడుకు శివ కృష్ణతో గొడవపడ్డాడని, కృష్ణను ఇలాగే వదిలేస్తే ఆస్తి మొత్తం రాసి ఇస్తాడనే ఉద్దేశ్యంతో ఎలాగైనా కృష్ణను చంపాలని ప్లాన్ వేశాడని తెలిపారు. ఎలాగైనా తను కృష్ణను చంపాలని ప్లాన్ వేసిన కొడుకు శివకుమార్ కృష్ణ వద్ద పని చేసే అంగరక్షకుడు బాబాకు 25 లక్షలు, ఒక ఇల్లు ఇస్తానని ఆశ చూపాడు. ఇందుకు అంగీకరించిన బాబా రెండు లక్షలు తీసుకొని ఈ నెల 10వ తేదిన సాయంత్రం 5 గంటల 30 నిమిషాలకు బాబా, జీలకర్ర గణేష్ ఆలియస్ లడ్డు, ఇంకొక వ్యక్తితో కలిసి కమ్మదనంలోని కేకే ఫార్మ్ కు చేరుకొని జీలకర్ర గణేష్, ఇంకొక వ్యక్తి ఇద్దరు కలిసి కమ్మరి కృష్ణ చేతులు వెనకకు పట్టుకోవడంతో బాబా తనతో పాటు తెచ్చుకున్న కత్తితో అతి క్రూరంగా గొంతు కోసి చంపేశారని ఈ హత్యపై మృతుడు కమ్మరి కృష్ణ మూడోవ భార్య పావని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపి నిందితులను అరెస్టు చేసి రెండు కార్లు, ఒక ద్వి చక్ర వాహనం, మూడు కత్తులు ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని డీసీపీ రాజేష్ తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ఏసిపి రంగస్వామి, సీఐలు విజయ్ కుమార్, రాంరెడ్డి తదితరులున్నారు.

## బిల్డింగ్ పైనుంచి దూకిన యువతి ఆత్మహత్య



**విశ్వంభర, హైదరాబాద్ :** నగరంలో శనివారం తీవ్ర విషాదం జరిగింది. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక జనప్రియ అపార్ట్‌మెంట్ భవనం పైనుంచి శృతి (25) అనే యువతి దూకింది. వెంటనే గమనించిన స్థానికులు ఆమెను మియాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. డిప్రెషన్ కారణంగా యువతి బలవన్మరణానికి పాల్పడి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నారు.

### మరిన్ని ఘటనలు

అటు, నిజామాబాద్ జిల్లాలోని ఓ హోంగార్డు శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎల్లమ్మగుట్టకు చెందిన సంపత్ (43) హోంగార్డుగా పని చేస్తున్నాడు. రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. హోంగార్డు ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. అలాగే, ఇందల్వాయి రైల్వే స్టేషన్ వద్ద రెండు మృతదేహాలు కలకలం రేపాయి. రైల్వే ట్రాక్ పక్కన డ్రైనేజీలో ఈ మృతదేహాలను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

### రోడ్డు ప్రమాదాలు

మరోవైపు, మంచిర్యాల జిల్లా జన్నారం మండలం టీజీ పల్లి వద్ద శనివారం రోడ్డు ప్రమాదం సంభవించింది. చెట్టును కారు ఢీకొన్న ఘటనలో ఓ బాలుడు మృతి చెందగా.. కారు డ్రైవింగ్ చేస్తోన్న యువకుడు సహా మరో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అటు, వరంగల్ మామునూరులో జ్యోతిబాపూలే పాఠశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ హోంగార్డు ప్రాణాలు కోల్పోయాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొని హోంగార్డు సుదాకర్ మృతి చెందారు. పీఎస్‌లో విధులకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## చెట్లు నాటి పర్యావరణాన్ని రక్షిద్ధం

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**విశ్వంభర, కూకట్ పల్లి :** కెపిహెచ్‌బి 5వ ఫేజ్ పార్కులో జిహెచ్‌ఎంసి ఏర్పాటు చేసిన వన మహోత్సవం కార్యక్రమానికి శనివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వన మహోత్సవ్ అనేది ప్రతి సంవత్సరం జూలైలో జరుపుకునే పాన్-ఇండియా చెట్ల పెంపకం పండుగ అని, ప్రతి ఒక్కరు చెట్లను నాటి పర్యావరణాన్ని సంరక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మందాడి శ్రీనివాస్ రావు, జూపల్లి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజేష్, రాఘవ రెడ్డి, వివిరావు, హార్టికల్చర్ అధికారులు తదితరులు పాల్గున్నారు.



## కేయూలో ఊడిపడిన స్లాబ్

- అర్ధరాత్రి వేళ ఘటన
- తప్పిన ప్రమాదం

**విశ్వంభర, కేయూ :** వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయ హాస్టల్‌లో సీలింగ్ ఫ్యాన్ ఊడిపడిన విషయం మరువక ముందే మరో ఘటన చోటుచేసుకున్నది. వర్సిటీలోని పోతన ఉమెన్స్ హాస్టల్‌లోని ఓ గదిలో అర్ధరాత్రి వేల స్లాబ్ కుప్పకూలింది. అయితే ఆ సమయంలో గదిలో ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అయితే ఈ ఘటపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తంచేశారు. హాస్టల్‌లో ఉండాలంటే ప్రాణాలమీదికి వస్తున్నదని, ఎన్నిసార్లు వర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోతున్నదని చెప్పారు. హాస్టల్ వార్డెన్‌ను నిలదీశారు. పైకప్పు ఊడిన ఘటనపై విద్యార్థులు ఆందోళనకు దిగారు. రాణి రుద్రమదేవి హాస్టల్‌ను పరిశీలించడానికి వచ్చిన రిజిస్ట్రార్ మల్లారెడ్డిని నిలదిశారు. హాస్టళ్లను ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయనతో వాగ్వాదానికి దిగారు. రిజిస్ట్రార్ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. కాగా, గత నెల 29న వర్సిటీ క్యాంపస్‌లోని ఉమెన్స్ హాస్టల్‌లో సీలింగ్ ఫ్యాన్ ఊడిపడటంతో పీజీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న లూనావత్ సంధ్య అనే విద్యార్థిని తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఫ్యాన్ మీదపడంతో ఆమె తలకు తీవ్రగాయమైంది. తోటి విద్యార్థులు వెంటనే ఆమెను దవాఖానకు తరలించారు.

# రూ.12.15 కోట్లతో కొడవటంచ ఆలయ
# అభివృద్ధి పనులు

విశ్వంభర, భూపాలపల్లి : భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొడవటంచ గ్రామంలోని సుప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం లో రూ. 12 కోట్ల 15 లక్షలతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టబోతున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శనివారం కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయ ప్రాంగణంలో ఆలయ చైర్మన్, ఆలయ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నేతలతో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, అందులో భాగంగానే సుప్రసిద్ధ కొడవటంచ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయ అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.12కోట్ల 15 లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిర్మాణ పనులను సంవత్సరం తిరిగేలోపు పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

**చేపట్టబోయే పనులు..**

ఆలయంలో విమాన గోపురం, అర్ధ మండపం, మహామండపం పనులను రీ - కన్స్ట్రక్షన్ చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా, అద్దాల మండపం, అల్వార్ నిలయం, పాకశాల, అన్నదాన సత్రం, క్యూలైన్ల ఏర్పాటు, డ్రైనేజీ, భక్తుల కొరకు కాటేజీలు, సాలహారం కాంపౌండ్ వాల్, ఓ హెచ్ ఎస్ ఆర్ వాటర్ ట్యాంక్, ఆఫీస్ బిల్డింగ్, అర్చకులు ఉండేందుకు వసతి గృహాలు, రేగొండ క్రాస్ రోడ్‌లో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న ఆర్చి నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే మీడియాకు వివరించారు. అదేవిధంగా, రూ.59 కోట్లతో బుద్దారం నుండి కొడవటంచ డబుల్ రోడ్డు నిర్మాణం కొరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే మంజూరు రాబోతున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ ప్రధాన అర్చకులు బుచ్చమాచార్యులు పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.





## మెగా ఉచిత కంటి వైద్య శిబిరం
# పోస్టర్ ఆవిష్కరణ

విశ్వంభర, ఆమనగల్లు : వెల్దండ మండల కేంద్రంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్వకుర్తి ప్రాంత ప్రజలు అందరూ.. ఈనెల 19 నుంచి 27 వరకు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ కంటి వైద్య నిపుణులు శంకర నేత్రాలయ వారిచే నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరంలో ఉచిత కంటి పరీక్షలతో పాటు, కంటి శుక్లాలకు సంబంధించిన సర్జరీలు కూడా చేయనున్నట్లు తెలిపారు. ఈ కంటి వైద్య శిభిరం వెల్దండ మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్ నందు (వెల్దండ, కల్వకుర్తి మెయిన్ రోడ్డు) నిర్వహిస్తున్నమని, నియోజక వర్గ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అనిల్ గౌడ్, బీసీ సెల్ నాయకులు సైదులు, ఎస్సీ సెల్ నాయకులు శేఖర్, యువజన కాంగ్రెస్ నాయకులు బాలరాజు, అంజి, యాదవ్, రమేష్ నాయక్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# వానలు లేక ఇబ్బందులు పడుతున్న రైతులు

### ఆదుకోవాలని ప్రభుత్వానికి వినతి



విశ్వంభర, ఆత్మకూరు(ఎం) : యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులతో రైతులకు తీవ్రమైన ఇక్కట్లు నెలకొన్నాయి. వర్షాకాలం ప్రారంభం అయిందని సంతోషించే లోపే రైతులకు వర్షాలు లేక పెట్టిన గింజలు మొలకత్తలేక మొలకెత్తిన మొక్కలు వాడిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించినా.. నేటికి మండలంలో గట్టిగా చినుకు పడిన జాడనే కన్పించటం లేదు. దీంతో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటి పోయి ఎండిపోతున్న పరిస్థితి గ్రామాల్లో కన్పిస్తుంది. ముఖ్యంగా గ్రామాల్లో వ్యవసాయం వర్షాల మీద ఆధారపడి చేస్తున్న నేపథ్యంలో రైతులు వర్షాల పైన పూర్తిగా ఆధార పడాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులు అప్పులు తీసుకువచ్చి వర్షాలు పడుతాయని సాగు చేస్తున్న నేపథ్యంలో వర్షాలు పడకపోవడంతో రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొంది. వర్షాబావ పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

# వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో శ్రీమంతాలు



విశ్వంభర, సూర్యాపేట : వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో 30 మంది నిరుపేద మహిళలకు శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్లో నూతన పట్టు వస్త్రాలు సమర్పించి శ్రీమంతాలు నిర్వహించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మహిళలందరికీ గోరింటాకు మహోత్సవ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ గవర్నర్ రాచర్ల కమలాకర్, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు పసుపర్తి జ్యోతి మాట్లాడుతూ.. గర్భవతి అయిన మహిళలకు శ్రీమంతం వేడుక ఎంతో ఆనందం కలిగించడంతో పాటు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటుందని తెలిపారు. వాసవి వనీత క్లబ్ ఆధ్వర్యంలో గత ఆరు నెలలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన పలువురు దాతలను సన్మానించారు. కోలాటాలు ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి నేషనల్ సెక్రటరీ పబ్బతి వేణు మాధవ్, ట్రెజరర్ కలకోట లక్ష్మయ్య, జాయింట్ సెక్రెటరీ బిక్కు మల్ల కృష్ణ, ఐపిసి గుండా ఉపేందర్, వనిత క్లబ్ ఆర్‌సి గుండా సుధామాధురి, వాసవి క్లబ్ జెసి పసుపర్తి కృష్ణమూర్తి, ఐపిసిలు తల్లాడ సోమన్న, రాచకొండ శ్రీనివాస్, ఆర్సీలు మిరియాల వెంకటేశ్వర్లు , మిట్టపల్లి రమేష్, బెల్దే శ్రీనివాస్, గునుగుంట్ల విద్యాసాగర్, వాసవి వనిత క్లబ్ సెక్రటరీ వెంపటి విజయ, ట్రెజరర్ నల్లపాటి రమాదేవి, ఫాస్ట్ ప్రెసిడెంట్లు, అన్ని క్లబ్బుల ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్లు, దాతలు పాల్గొన్నారు.

## మృతురాలు సత్తమ్మ కుటుంబానికి
# కాంగ్రెస్ ఆర్థిక సాయం



విశ్వంభర, ఆత్మకూరు(ఎం) : యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బూడిద రాజు తల్లి సత్తమ్మ శుక్రవారం సాయంత్రం మరణించారు. విషయం తెలుసుకున్న స్థానిక మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు దిగోజు నర్సింహాచారి మృతురాలు బూడిది సత్తమ్మ భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య ఆదేశానుసారం మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్ వారి కుటుంబానికి 5000-/ రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోతగాని మల్లేశం గౌడ్, పిఎసిఎస్ డైరెక్టర్ నోముల వెంకట్ రెడ్డి, గౌడ సంఘం అధ్యక్షులు పంజాల నర్సయ్య గౌడ్, నాయకులు కట్టేకోల హన్మంతు గౌడ్, తండ శ్రీశైలం గౌడ్, నాగం లక్ష్మారెడ్డి, కొండపల్లి ముత్యాలు, బొబ్బలి అంజిరెడ్డి, బూడిద శేఖర్ గౌడ్, ఉగ్గె నరేష్, తవిటీ రాజు, కొంగరి విద్యాసాగర్, తొండల అనిల్, దీగోజు సురేంద్రచారి, గట్టు రాజు, కోరే హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి రవాణా చేస్తున్న ముఠా అరెస్ట్

**6 కేజీల గంజాయి స్వాధీనం**



విశ్వంభర, భూపాలపల్లి : భూపాలపల్లి జిల్లాలో గంజాయి రవాణా గురించి నమ్మదగిన సమాచారం మేరకు ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాలతో ఘన్పూర్ ఎస్ఐ సాంబమూర్తి తన సిబ్బందితో కలిసి గాంధీనగర్ క్రాస్ రోడ్ వద్దకు వెళ్లి వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో కనబడ్డారు. వారిని కస్టడీలోకి తీసుకొని విచారించగా వారి వద్ద ఉన్న ఒక బ్యాగులో దాదాపు 1/2 కేజీ గంజాయి కనిపించింది. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా, తదుపరి వారు నివాసముంటున్న అద్దె గది గాంధీనగర్ క్రాస్‌కి వెళ్లి తనిఖీలు చేపట్టగా మరో ఐదున్నర కేజీల గంజాయి మరియు మరో నిందితుడుని అదుపులోకి తీసుకోవడం జరిగింది. వీరు బీహార్‌కు చెందిన వారిగా గుర్తించారు. దాదాపుగా ఆరు నెలలుగా ఇక్కడ చెల్పూర్‌లోని రైస్ మిల్లులో పని కోసం వచ్చి జల్సాలకు అలవాటు పడి డబ్బులు సరిపోకపోవడంతో వీరు గతంలో పరిచయం ఉన్న ప్రదీప్ అనే వ్యక్తికి కాంటాక్ట్ అయ్యి అతని వద్ద గంజాయి కొనుగోలు చేస్తూ.. ఇక్కడకు తీసుకువచ్చి ఎక్కువ రేట్లకు అమ్ముతూ.. అలా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారని విచారణలో ఒప్పుకున్నారు. తదుపరి పంచనామా నిర్వహించి సీజ్ చేసిన 6 కేజీల గంజాయిని మరియు ముగ్గురు వ్యక్తుల్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఒకరు పరారీలో ఉన్నట్టుగా పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే.. మాట్లాడుతూ గంజాయి నియంత్రణకు ప్రజలు సహకరించాలని, పూర్తి స్థాయిలో నియంత్రించుటకు జిల్లా పోలీస్ యంత్రాంగం కష్టపడుతుందన్నారు. గంజాయికి సంబందించిన ఏ సమాచారం ఉన్నా డయల్ 100 ద్వారా గాని స్థానిక పోలీసు అధికారికి చేరవేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఆరు కేజీల గంజాయి పట్టుకోవడంలో ఉత్తమ విధులు నిర్వర్తించిన భూపాలపల్లి డిఎస్పి ఏ.సంపత్ రావు, చిట్యాల సిఐ డి.మల్లేష్, ఎస్సై ఘనపూర్ సాంబమూర్తి, సిబ్బంది నేతాజీ, శ్రీనివాసులును ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



## నిరుపేద గీత కార్మికుడికీ అండగా జయశంకర్ ఫౌండేషన్

విశ్వంభర, భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రానికి చెందిన గుర్రపు గట్టయ్య గత సంవత్సరం క్రితం వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కి తాటికల్లు గీస్తుండగా ప్రమాదశాత్తు మోకు జారీ చెట్టు పైనుంచి కింద పడడంతో నడుము విరిగింది. హాస్పిటల్‌కు తీసుకువెళ్లి సర్జరీ చేయించిన కూడా లాభం లేకపోయింది. నడుము విరగడం వల్ల కాళ్లు చచ్చుబడి పోయాయి. దీంతో మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతీ వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి రూ.5000 ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమములో ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాంబరాతి పోషన్న, చిట్యాల మండల్ ఇన్చార్జ్ లౌడియ రాజు నాయక్, జిల్లా కన్వీనర్ పాల్గొన్నారు.



గత పది సంవత్సరాలుగా శేర్లింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తూ.. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిచిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా విశ్వంభర ( V3 ) ప్రతినిధి మారుతి సాగర్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

**- విశ్వంభర, హైదరాబాద్**

## సాయిగౌడ్‌ని పరామర్శించిన విష్ణు

విశ్వంభర, ఆత్మకూరు (ఎం) : యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బీసు చందర్ గౌడ్ బావ మరిది మద్దెల సాయి గౌడ్ మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నాడు. మద్దెల సాయి గౌడ్‌ని ప్రముఖ పారిశ్రామిక వేత్త, జిల్లా కాంగ్రెస్ నాయకులు తొర్ర విష్ణు పరామర్శించారు. సాయి గౌడ్ ఆరోగ్య పరిస్థితిని ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లని కోరారు. బీసు చందర్ గౌడ్‌కి ధైర్యం చెప్పి సాయి గౌడ్ క్షేమంగా ఇంటికి రావాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి సేవా సమితి అధ్యక్షురాలు బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్, సినీ హీరో బీసు రణధీర్ గౌడ్, మద్దెల సాయి గౌడ్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## గుండెపోటుతో మాజీ ఎంపీపీ తాండ్ర అమరావతి మృతి

విశ్వంభర, ఆత్మకూరు(ఎం) : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం తాజా మాజీ ఎంపీపీ తాండ్ర అమరావతి శనివారం(13.7.24) ఉదయం 6 గంటలకు ప్రాంతంలో గుండెపోటుతో స్వర్గీయులయ్యారు. ఆమె అంత్యక్రియలు స్వగ్రామమైన గుండాల మండలం మరిపడగలో జరగనున్నాయి.



## తాండ్ర అమరావతికి నివాళులర్పించిన ప్రభుత్వ విప్

విశ్వంభర, ఆత్మకూరు(ఎం) : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల తాజా మాజీ ఎంపీపీ తాండ్ర అమరావతి శనివారం ఉదయం గుండె పోటుతో మృతిచెందరు. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గుండాల మండలం మరిపడిగా గ్రామంలో అమరావతి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అమరావతి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. బీర్ల ఐలయ్యతోపాటు యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అండెం సంజీవ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఈరసారపు యదగిరిగౌడ్, మధుసూదన్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



## బెగులూరులో పోలీసుల కార్డెన్ సర్చ్


విశ్వంభర, భూపాలపల్లి : భూపాలపల్లి జిల్లా మహాదేవాపూర్ మండలంలోని బేగులూరులో పోలీసులు కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా ఉండాలని, కొత్త వ్యక్తులు ఎవరైనా గ్రామాల్లో సంచరిస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. నంబర్ ప్లేట్లు లేని 19 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ ఎస్సై పవన్ కుమార్, పలిమెల ఎస్సై తమాషా రెడ్డి, కాలేశ్వరం ఇన్చార్జి ఎస్ఐ చక్రపాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## యువకుడు ఆత్మహత్య



విశ్వంభర, భూపాలపల్లి : అనారోగ్యం సమస్యతో ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన భూపాలపల్లి జిల్లా తాడిచెర్ల మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కొయ్యూర్ ఎస్ఐ తెలిసిన పూర్తి వివరాల ప్రకారం తాడిచెర్ల గ్రామానికి చెందిన మేనం నరేశ్ (25) కాపురం గ్రామంలో బొగ్గు తవ్వకాలు చేపట్టిన ఏఎమ్మార్ కంపెనీ, ఓసిపి బ్లాక్-1లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నరేశ్ ఆరు నెలలుగా పైల్స్ సమస్యతో బాధపడేవాడని కొద్ది రోజుల క్రితం చికిత్స చేయించుకున్న కూడా తగ్గకపోవడంతో దీంతో బాధ భరించలేక జీవితంపై విరక్తి చెందిన అతడు శుక్రవారం సాయంత్రం ఇంటిముందు ఉన్న రేకుల షెడ్డులో తాడుతో ఉరివే సుకొని ఆత్మహత్య చేసుకున్నట్లుగా తెలిపారు. మృతుడి సోదరుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొయ్యురు ఎస్ఐ వెల్లడించారు.

# కిసాన్ సాయం పెరగనుందా..?



**విశ్వంభర, హైదరాబాద్ :** దేశంలో మోడీ సర్కార్ ఎన్నో రకాల పథకాలను ప్రవేశపెడుతోంది. అన్ని వర్గాల ప్రజలకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతోంది. అయితే రైతుల కోసం ప్రత్యేక నిర్ణయాలు తీసుకుంటుంది మోడీ సర్కార్. కేంద్రం ప్రవేశపెడుతున్న పథకాల్లో పీఎం కిసాన్ స్కీమ్ ఒకటి. ఏడాదికి రూ.6000 చొప్పున అందిస్తోంది. ఈ మొత్తం ఒకే సారి కాకుండా మూడు విడతల్లో రూ.2000 చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. అయితే తాజాగా మరో వార్త ప్రచారం జరుగుతోంది. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో పీఎం కిసాన్ నిధుల సొమ్మును పెంచే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇస్తున్న రూ.6000 నుంచి రూ.8000 పెంచే అవకాశాలు ఉన్నాయని కేంద్ర వర్గాల ద్వారా సమాచారం. అంటే ఈ స్కీమ్‌లో 30 శాతం పెంచే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఈనెల 22 నుంచి బడ్జెట్ సమావేశాలు ఉన్నాయి. 23వ తేదీన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ వార్షిక బడ్జెట్‌ను సమర్పించనున్నారు. బిజినెస్ టుడే నివేదిక ప్రకారం, కిసాన్ యూనియన్‌కు చెందిన బద్రి నారాయణ్ చౌదరి మాట్లాడుతూ, పిఎం కిసాన్ కింద కేటాయింపులను రూ.6,000 నుండి రూ.8,000కి పెంచాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను అభ్యర్థించాము. సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. దీన్ని బట్టి చూస్తే వచ్చే బడ్జెట్‌లో రైతులకు పీఎం కిసాన్ స్కీమ్‌లో ఏడాదికి 8 వేల రూపాయలు చేయవచ్చని తెలుస్తోంది.

# అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఇండియా కూటమి హవా

- 10 స్థానాల్లో కాంగ్రెస్ కూటమి గెలుపు
- కేవలం 2 స్థానాల్లో బీజేపీ గెలుపు



**విశ్వంభర, ఢిల్లీ :** అసెంబ్లీ ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు ముగిసింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని మొత్తం 13 అసెంబ్లీ స్థానాలకు ఇటీవల ఉప ఎన్నికలు జరిగాయి. ఇవాళ కౌంటింగ్ నిర్వహించారు. దాదాపు అన్ని రాష్ట్రాల్లో అధికార పార్టీల అభ్యర్థులే విజయం సాధించారు. కానీ ఉత్తరాఖండ్‌లో మాత్రం బీజేపీకి ఎదురుదెబ్బ తగిలింది. అదేవిధంగా బీహార్‌లో ఉప ఎన్నిక జరిగిన ఏకైక అసెంబ్లీ స్థానాన్ని కూడా అధికార ఎన్డీఏ కూటమి నిలబెట్టుకోలేక పోయింది. పశ్చిమబెంగాల్‌లో రాయ్‌గంజ్, రాణాఘాట్ దక్షిణ్, బాగ్దా, మనిక్‌తలా నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరగగా మొత్తం నాలుగు స్థానాలను అధికార టీఎంసీ కైవసం చేసుకుంది. హిమాచల్‌ప్రదేశ్‌లో మూడు స్థానాలకు ఉప ఎన్నికలు జరగగా రెండు చోట్ల అధికార కాంగ్రెస్, ఒక స్థానంలో ప్రతిపక్ష బీజేపీ గెలిచాయి. దేహ్రా, నాలాగఢ్‌లలో కాంగ్రెస్ గెలువగా.. హమీర్‌పూర్ స్థానంలో బీజేపీ నెగ్గింది. ఉత్తరాఖండ్‌లో బద్రీనాథ్, మంగ్లౌర్ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరగగా రెండు స్థానాల్లోనూ అధికార బీజేపీ ఓటమి పాలైంది. ఆ రెండు చోట్లా ప్రతిపక్ష కాంగ్రెస్ విజయం సాధించింది. పంజాబ్‌లో ఉప ఎన్నిక జరిగిన ఏకైక నియోజకవర్గం జలంధర్‌లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ విజయం సాధించింది. తమిళనాడులో ఉప ఎన్నిక జరిగిన ఏకైక స్థానం విక్రవందిలో అధికార డీఎంకే గెలిచింది. మధ్యప్రదేశ్‌లో ఉప ఎన్నిక జరిగిన అమర్‌వార నియోజకవర్గంలో కూడా అధికార బీజేపీ నెగ్గింది. బీహార్‌లోని రూపౌలీ నియోజకవర్గంలో మాత్రం ప్రజలు ఏ పార్టీని నమ్మలేదు. అక్కడ ఇండిపెండెంట్ అభ్యర్థిని గెలిపించారు. మొత్తంగా 13 అసెంబ్లీ స్థానాలకుగాను కాంగ్రెస్ పార్టీ 4, టీఎంసీ 4, బీజేపీ 2, ఆప్ 1, డీఎంకే 1, ఇండిపెండెంట్ ఒక స్థానంలో విజయం సాధించారు.




# విషాదయాత్రగా మారిన తీర్థయాత్ర

## ముగ్గురు హైదరాబాదీలు మరణం

**విశ్వంభర, హైదరాబాద్ :** ఒరిస్సాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు దర్మరణం పాలయ్యారు. పాతబస్తీ నుంచి ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులో తీర్థయాత్రకు వెళ్లి అనంత లోకాలకు పయనమయ్యారు. శనివారం తెల్లవారుజామున ఆగి ఉన్న ట్రక్కును ట్రావెల్ బస్సు వేగంగా ఢీ కొట్టింది. దీంతో డ్రైవర్ ఉదయ్ సింగ్ తోపాటు మరో ఇద్దరు మృతి చెందారు. ఈ విషాద ఘటన బెత్నోనటి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మరో 20మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను బెత్నోనటి మెడికల్ ఆసుపత్రికి తరలించారు. హైదరాబాద్ పాతబస్తీ ఉప్పుగూడ కు చెందిన ఉదయ్ సింగ్ ఠాకూర్ (53) వృత్తిరీత్యా డ్రైవర్, ట్రావెల్ ఏజెంట్. ఉదయ్ సింగ్ తీర్థ యాత్ర ట్రిప్‌లు తీస్తుంటాడు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ పాతబస్తీ ఉప్పుగూడతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన మరో 23 మందితో కలిసి నార్త్ ఇండియా టూర్‌కి ప్లాన్ చేశాడు. ఇందులో భాగంగానే 12 రోజుల నుంచి 15 రోజుల పాటు జరిగే యాత్రలో ఉప్పుగూడ శివాజీ నగర్ కు చెందిన నిత్యశ్రీ ట్రావెల్స్‌కు చెందిన 22 సీటర్ ఎస్ఎంఎల్ బస్సు డ్రైవర్ మల్లేష్ అనే వ్యక్తి తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. జూలై 8 వ తేదీన పాతబస్తీ ఉప్పుగూడ నుంచి ఉదయ్ సింగ్ అతని భార్య విజయ, కూతురు స్రవంతి, కుమారుడు వినీత్ లతోపాటు మరో 19 మందితో కలిసి నార్త్ ట్రిప్ కు బయలుదేరారు. తెలంగాణ రాష్ట్రం మీదుగా ఆంధ్రప్రదేశ్ దిశగా మధ్యలో ఉన్న పుణ్య క్షేత్రాలను చూసుకుంటూ ఈ నెల 12 వ తేదీన పూరి జగన్నాథ్ దేవాలయంకు చేరుకున్నారు. ఒరిస్సాలోని బాలాపూర్ మీదుగా బీహార్ కు వెళ్తున్న క్రమంలో మయూరభంజ్ జిల్లా బెత్నోనటి పోలీస్ స్టేషన్ పరిధిలో బుడి కమర్ చక్ ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న ట్రక్‌ను బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఉదయ్ సింగ్ తోపాటు ఒకే కుటుంబానికి చెందిన అన్న ఉప్పలయ్య (70), చెల్లెలు క్రాంతి భాయ్ (62) అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ మల్లేష్ కు కాలు విరగడంతోపాటు తీవ్రగాయాలు అయ్యాయి. మరో 20 మందికి కూడా తీవ్రగాయాలు అయినట్లు క్షతగాత్రుల బంధువులు తెలిపారు. గాయపడిన వారిని బెత్నోనటి మెడికల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.'

# కాంగ్రెస్ తప్పులు మనం చేయొద్దు

- వాటితో మన అధికారం పోతుంది
- పార్టీ నేతలకు కేంద్రమంత్రి గడ్కరీ సూచనలు



**విశ్వంభర, ఢిల్లీ :** కాంగ్రెస్‌ను అధికారం నుంచి గద్దె దింపడానికి దారితీసిన తప్పిదాలను బీజేపీ పునరావృతం చేయవద్దని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈ మేరకు సొంత పార్టీని హెచ్చరించారు. భిన్నత్వం ఉన్న పార్టీ బీజేపీ అన్న ఎల్‌కే అద్వానీ వ్యాఖ్యలను గుర్తు చేశారు. శుక్రవారం గోవాలో జరిగిన పార్టీ అత్యున్నత స్థాయి సమావేశంలో నితిన్ గడ్కరీ మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పుల వల్లనే ప్రజలు బీజేపీని ఎన్నుకున్నారని తెలిపారు. 'కాంగ్రెస్ చేసిన పనిని మనం కొనసాగిస్తే, (అధికారం నుంచి) వారి నిష్క్రమణ, మన ప్రవేశం వల్ల ప్రయోజనం ఉండదు' అని అన్నారు. కాగా, తన గురువు, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ వ్యాఖ్యలను ఈ సందర్భంగా నితిన్ గడ్కరీ ప్రస్తావించారు. 'మనది భిన్నత్వం ఉన్న పార్టీ అని అద్వానీ చెప్పేవారు. ఇతర పార్టీల కంటే మనం ఎంత భిన్నంగా ఉన్నామో అర్థం చేసుకోవాలి' అని అన్నారు. మరోవైపు రాబోయే రోజుల్లో దేశంలో సామాజిక, ఆర్థిక సంస్కరణలు తీసుకురావడానికి రాజకీయాలు ఒక సాధనమని, పార్టీ కార్యకర్తలు ఇది తెలుసుకోవాలని నితిన్ గడ్కరీ తెలిపారు. సొంత రాష్ట్రమైన మహారాష్ట్ర రాజకీయాలను ఆయన ప్రస్తావించారు. కుల ప్రాతిపదికన రాజకీయాలు చేయకూడదని సూచించారు. 'ఈ ధోరణిని అనుసరించకూడదని నేను నిర్ణయించుకున్నా. కుల ఆధారిత రాజకీయాలు చేయబోనని ప్రజలకు చెప్పా. కులం గురించి మాట్లాడే వారికి బలమైన కిక్ వస్తుంది' అని అన్నారు. అలాగే అవినీతి రహిత దేశాన్ని సృష్టించడానికి సరైన ప్రణాళిక చేయాలని పార్టీకి పిలుపునిచ్చారు.



# ప్రతి శనివారం కాటేస్తున్న పాము

- ఒకే వ్యక్తిని కాటేస్తున్న పాము
- ఒక్కరోజులోనే డిశ్చార్జి
- మిస్టరీ చేధించేందుకు అధికారుల ప్రయత్నాలు

**విశ్వంభర, యూపీ :** శనివారం వస్తుందంటే ఒక వ్యక్తి హడలిపోతున్నాడు. ప్రతి శనివారం ఒక పాము అతడ్ని కాటేస్తోంది. 40 రోజుల్లో ఏడుసార్లు పాము కాటుకు గురయ్యాడు. ఆసుపత్రిలో చికిత్స పొంది ఒక్క రోజులోనే కోలుకుంటున్నాడు. ఈ విషయం తెలిసి డాక్టర్లు కూడా ఆశ్చర్యపోతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఫతేపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సౌర గ్రామానికి చెందిన 24 ఏళ్ల వికాస్ దూబేను ప్రతి శనివారం పాము కాటేస్తున్నది. దీంతో ఆసుపత్రిలో అడ్మిట్ అవుతున్న అతడు ఒక్క రోజులో కోలుకుంటున్నాడు. జూన్ 1న ఇంట్లో నిద్రించిన వికాస్ బెడ్ నుంచి కిందకు దిగిన తర్వాత తొలిసారి పాము కాటేసింది. రాధా నగర్‌లోని బంధువు ఇంట్లో నాలుగోసారి, తాజాగా జూలై 6న మరో బంధువుల ఇంటికి వెళ్లిన అతడు పాము కాటుకు గురయ్యాడు. ఇలా 40 రోజుల్లో ఏడుసార్లు అతడ్ని పాము కాటేసిందని కుటుంబ సభ్యులు తెలిపారు. 9వ సారి పాము కాటు వేస్తే అతడు మరణిస్తాడని జ్యోతిష్కులు చెబుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, ప్రతి శనివారం పాము కాటుకు గురవుతున్న వికాస్ దూబే శుక్రవారం వైద్య ఖర్చుల కోసం కలెక్టరేట్‌కు వెళ్లాడు. పాము కాటు చికిత్సకు ఇప్పటికే చాలా ఖర్చు అయ్యిందని అధికారుల ముందు ఏడ్చాడు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించాలని వేడుకున్నాడు. మరోవైపు చీఫ్ మెడికల్ ఆఫీసర్ రాజీవ్ నయన్ గిరి ఈ విషయంపై స్పందించారు. పాము కాటు విరుగుడు మందుతోపాటు ఉచిత చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని వికాస్ దూబేకు సూచించారు. అలాగే ప్రతి శనివారం అతడ్ని పాము కాటు వేయడం చాలా విచిత్రంగా ఉందని అన్నారు. వికాస్‌ను నిజంగా పాము కాటేస్తుందో లేదో గుర్తించాలని, అతడికి చికిత్స చేస్తున్న వైద్యుడి సామర్థ్యాన్ని కూడా చూడాల్సి ఉందన్నారు. 'ప్రతి శనివారం అతడు పాము కాటుకు గురవుతున్నాడు. అదే ఆసుపత్రిలో చేరుతున్నాడు. ప్రతిసారీ కేవలం ఒక రోజులో కోలుకోవడం కూడా వింతగా అనిపిస్తోంది' అని చీఫ్ మెడికల్ ఆఫీసర్ రాజీవ్ మీడియాతో అన్నారు. ఈ విషయంపై దర్యాప్తు కోసం ముగ్గురు వైద్యులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పరిశీలించిన తర్వాత వాస్తవాన్ని ప్రజలకు చెబుతామని అన్నారు.

# మోడీ, రాహుల్ మనుస్మృతి కాపీలను తగులబెట్టాలి

## ప్రకాశ్ అంబేడ్కర్ వ్యాఖ్యలు



**విశ్వంభర, హైదరాబాద్ :** ఒకవేళ ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ.. భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తే, అప్పుడు వాళ్లు మనుస్మృతి కాపీలను తగులబెట్టాలని వంచిత్ బహుజన్ అగాధీ వ్యవస్థాపకుడు ప్రకాశ్ అంబేద్కర్ తెలిపారు. రాజ్యాంగాన్ని రాసిన బాబా సాహెబ్ అంబేద్కర్ మనువడే ప్రకాశ్ అంబేద్కర్. ఆయన ఓ న్యాయవాది, రాజకీయవేత్త, సామాజిక కార్యకర్త. గతంలో రాజ్యసభ, లోక్‌సభ సభ్యుడిగా చేశారు. ఒవకేళ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు నిజంగా రాజ్యాంగాన్ని ప్రేమిస్తే, అప్పుడు మనుస్మృతి కాపీలను తగులబెట్టాలని మోదీ, రాహుల్‌ను డిమాండ్ చేస్తున్నట్లు ప్రకాశ్ అంబేద్కర్ తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రాజ్యాంగాన్ని వెన్నుపోటు పొడిచాయన్నారు. పేదవారిని, అణగారిన కులాలను ఆ పార్టీలు మోసం చేశాయన్నారు. రాజ్యాంగంలో బాబా సాహెబ్ పొందుపరిచిన ఆశయాలను, విలువలకు ఆ పార్టీలు తూట్లు పొడిచాయని ప్రకాశ్ అంబేద్కర్ ఆరోపించారు. న్యాయ విద్యార్థులకు మనుస్మృతి బోధించాలని ఇటీవల ఢిల్లీ వర్సిటీలో ఓ ప్రతిపాదన వచ్చిన విషయం తెలిసిందే. ఆ ప్రతిపాదనను వర్సిటీ వీసీ కొట్టిపారేశారు.

# ప్రమాదకర వైరస్ సోకి నలుగురు మృతి



**విశ్వంభర, ఢిల్లీ :** గుజరాత్‌లోని సబర్‌కాంతా జిల్లాలో చాందిపుర వైరస్ సోకి నలుగురు పిల్లలు మృతిచెందారు. మరో ఇద్దరు చిన్నారులు ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. హిమత్‌నగర్ జిల్లా కేంద్రంలోని సివిల్ ఆస్పత్రిలో చిన్నారులకు చికిత్స జరుగుతోంది. చాందిపురా వైరస్ కేసుల్లో జ్వరం లక్షణాలు కనిపిస్తాయి. ఆ వైరస్ సోకిన వారికి ఫ్లూ లాంటి లక్షణాలు కూడా ఉంటాయి. తీవ్ర స్థాయి ఇన్‌సెఫలైటిస్ కూడా వస్తుంది. దోమలు, పురుగుల ద్వారా ఆ వైరస్ వ్యాప్తి చెందుతుంది. ఆరుగురు చిన్నారులకు చెందిన రక్తపు నమోనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపారు. ఆ శ్యాంపిళ్ల ఫలితాల కోసం ఎదురుచూస్తున్నట్లు సబర్‌కాంత జిల్లా ఆరోగ్యశాఖ అధికారి రాజ్ సుతారియా తెలిపారు. జూలై పదో తేదీన నలుగురు చిన్నారులు చాందిపుర వైరస్ సోకి మృతిచెందినట్లు తొలుత హిమ్మత్‌నగర్ ఆస్పత్రి పీడియాట్రిక్ డాక్టర్లు అనుమానాలు వ్యక్తం చేశారు. అయితే ఆ పిల్లల లక్షణాలే మరో ఇద్దరిలో గమనించినట్లు చెప్పారు. చాందిపుర వైరస్ వల్ల మృతిచెందిన వారిలో ఒకరు సబర్‌కాంత్ జిల్లా వాసి కాగా, ఇద్దరు ఆరావలి జిల్లా వాసులున్నారు.

నాలుగవ చిన్నారి మాత్రం రాజస్తాన్‌కు చెందిన వ్యక్తి. ప్రస్తుతం చికిత్స పొందుతున్న ఇద్దరు కూడా రాజస్థానీయులే. రక్షణాత్మక చర్యల్లో భాగంగా ప్రభావిత ప్రాంతాల్లో రెక్కల పరుగులను చంపనున్నారు.

# సీన్ నదిలో దూకిన క్రీడాశాఖమంత్రి

**విశ్వంభర, ఢిల్లీ :** ఈ నెల 26వ తేదీ నుంచి పారిస్‌లో ఒలింపిక్స్ క్రీడలు జరగనున్నాయి. అయితే ఆ నగరంలో ఉన్న సీన్ నదిలోనే వాటర్ ఈవెంట్స్ నిర్వహించనున్నారు. సీన్ నదిలోని నీరు స్వచ్ఛంగా ఉందని చెప్పేందుకు ఆ దేశ క్రీడాశాఖ మంత్రి అమెలీ ఓడియా కాస్టెరా నదిలోకి దూకి ఈతకొట్టారు. నదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలో మంత్రి అమెలీ స్విమ్ సూట్ డ్రెస్సులో దూకారు. అలెగ్రాండ్రే ఇన్వలైడ్స్ బ్రిడ్జ్ వద్ద ఆ మంత్రి ఈత కొట్టారు. దీనికి సంబంధించిన వీడియోను రిలీజ్ చేశారు. ఒలింపిక్స్‌కు చెందిన స్విమ్మింగ్ పోటీలను సీన్ నదిలో నిర్వహించనున్నారు.

1900 సంవత్సరంలో జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లోనూ ఈ నదిలోనే వాటర్ ఈవెంట్స్‌ను చేపట్టారు. ఇటీవల సీన్ నదిలో కాలుష్యం పెరిగిపోయింది. దీంతో ఆ నదిని శుద్ధి చేయాలన్న డిమాండ్ పెరిగింది. అయితే ఒలింపిక్స్ క్రీడల సమయానికి నదిని క్లీన్ చేసి స్విమ్మింగ్ క్రీడలను నిర్వహించనున్నట్లు ఆ నగర మేయర్ అన్నే హిడల్గో ఇటీవల తెలిపారు.

# ఇంకా దొరకని 51 మంది ఆచూకీ

## నేపాల్ లో కొట్టుకుపోయిన రెండు బస్సులు

## మొత్తం 54మంది ప్రయాణికులు గల్లంతు

**విశ్వంభర, ఢిల్లీ :** నేపాల్‌లో కొండచరియలు విరిగిపడడంతో.. రెండు బస్సులు త్రిశూలీ నదిలో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఆ బస్సుల్లో ఉన్న సుమారు 51 మంది ఆచూకీ గల్లంతు అయ్యింది. వారి కోసం ఇవాళ కూడా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. హిమాలయ దేశం నేపాల్‌లో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆ రెండు బస్సుల్లో మొత్తం 54 మంది ప్యాసింజెర్లు ఉన్నట్లు తెలుస్తోంది. చిత్వాన్ జిల్లాలోని నారాయణ్‌ఘాట్-ముగ్లింగ్ రోడ్డు మార్గంలో రెండు బస్సులు కొట్టుకుపోయాయి. నేపాలీ ఆర్మీ, నేపాల్ పోలీస్, గత ఈతగాళ్లు.. సెర్చ్ ఆపరేషన్‌లో పాల్గొంటున్నారు. బిర్‌గుంజ్ నుంచి కాఠ్మాండుకు వెళ్తున్న బస్సులో 24 మంది ఉన్నారు. దాంట్లో ఏడుగురు భారతీయులు ఉన్నారు. ఇక కాఠ్మాండు నుంచి గౌర్ వెళ్తున్న బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. ముగ్గురు ప్రయాణికులు ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. సెర్చ్ ఆపరేషన్‌లో సుమారు 500 మంది భద్రతా సిబ్బంది పాల్గొంటున్నారు. శుక్రవారం రాత్రి గాలింపు చర్యల్ని నిలిపివేశారు. నది ఉధృతంగా ప్రవహిస్తున్న కారణంగా సెర్చ్ ఆపరేషన్ ఆలస్యమైంది. ఇవాళ ఉదయం 8 గంటలకు మళ్లీ గాలింపు మొదలుపెట్టారు.



## షర్మిలది సింగిల్ పాయింట్

# ఎజెండానేనా..?

- ఆమె టార్గెట్ వైసీపీనే..?
- హై కమాండ్ చెప్పింది అదేనా..



**విశ్వంభర, అమరావతి :** కాంగ్రెస్ లో సభ్యత్వమే లేని షర్మిలను తీసుకుని వచ్చి పీసీసీ చీఫ్ గా చేశారు అంటే హై కమాండ్ ఆలోచనలు అందులోనే స్పష్టం అవుతున్నాయి. ఏపీలో కాంగ్రెస్ ఓటు బ్యాంక్ ని వెనక్కి తెచ్చుకోవడం వైసీపీలో ఉన్న వారిని ఆకట్టుకుని పార్టీ బలం పెంచుకోవడం అన్నది. అదే సమయంలో వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే కాంగ్రెస్ కి ఇక శాశ్వతంగా ఆశలు ఉండవని కూడా వారికి అర్థమయ్యే షర్మిలను జగన్ మీద ప్రయోగించారు అని అంటారు. వైఎస్ షర్మిల పీసీసీ చీఫ్ గా సాధించింది ఏంటి అంటే అన్నను గద్దె నుంచి దించడం. ఆ విషయంలో ఆమె సక్సెస్ అయ్యారు. ఆ విధంగా తొలి అడుగు పడింది. అయితే ఇంతటితో ఆగిపోలేదు. ఇపుడే అసలైన కథ మొదలైంది.

వైసీపీ నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులను రప్పించడం కోసమే ఆర్భాటంగా వైఎస్సార్ 75వ జయంతి వేడుకలను ఆ పార్టీ జరిపింది. మాటకారి అయిన తెలంగాణా సీఎం తో సహా మంత్రులను రప్పించింది. జయంతి వేడుకలు బాగా జరిగినా కాంగ్రెస్ కి రాజకీయంగా కలసి వచ్చింది ఎంత అన్న చర్చ జరుగుతోంది. వైఎస్సార్ వారసురాలిని తానే తప్ప జగన్ కాదని షర్మిల మరోసారి మాట్లాడుతున్నారు. విజయవాడ నుంచి మీడియా ద్వారా ఆమె ఈ సందేశాన్ని ఇస్తున్నారు జగన్ నే ఆమె గట్టిగా టార్గెట్ చేస్తున్నారు. దాంతో షర్మిలది సింగిల్ పాయింట్ అజెండానా అన్న చర్చ మొదలైంది. జగనన్న పార్టీని సున్నా చేయడమే ఆమెకు కాంగ్రెస్ హై కమాండ్ ఇచ్చిన టార్గెట్ అని అంటున్నారు. అయితే వైసీపీలో ఉన్న వారిలో అసంతృప్తి ఉంటే వారు అయితే బీజేపీ లేకపోతే తెలుగుదేశం అన్నట్లుగా చూస్తున్నారు అంటున్నారు. ఎందుకంటే ఈ రెండు పార్టీలూ అధికారంలో ఉన్నాయి. తమ మీద కేసులు పెట్టకుండా తాము సేఫ్ జోన్ లో ఉండాలీ అంటే ఈ పార్టీలే మేలు అన్నది సగటు పొలిటీషియన్ల ఆలోచనగా ఉంది. ఇక ఏపీలో చూస్తే కాంగ్రెస్ ఏమీ లేదు. జాతీయ స్థాయిలో ప్రతిపక్షంలో ఉంది. కాంగ్రెస్ కి అధికార కళ వచ్చినపుడు అందులోకి వద్దు అన్నా నేతలు వస్తారు. అయితే ఆ టైం ఇపుడే రాలేదు. ఏపీలో టీడీపీ కూటమి అధికారంలో ఉంది. అసెంబ్లీలో గుర్తించకపోయినా ప్రతిపక్షం అంటే వైసీపీనే అని కూటమి బయట గురించి మాట్లాడుతోంది. ప్రతీ మాటకు ముందు గత అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్వాకం అని చెప్పడం ద్వారా వైసీపీనే టార్గెట్ చేస్తున్నారు. ఇక కాంగ్రెస్ వామపక్షాలు ఏపీలో పెద్దగా లేవు. పోరాటాలు ఉద్యమాలు ఆ పార్టీలు ఇంకా సమయం చూసి చేపడతాయి. ప్రస్తుతానికి ఏపీలో కూటమికి హానీమూన్ నడుస్తోంది. ఈ నేపథ్యంలో వైసీపీ కొన్నాళ్ళ పాటు అధికార పక్షానికి టైం ఇవ్వాలని చూస్తోంది. వైసీపీకే పని లేకపోతే కాంగ్రెస్ కి ఏమి ఉంటుంది. కొత్తగా వచ్చిన ప్రభుత్వం మీద విమర్శలు గబుక్కున చేయలేరు కదా. అందుకే వారసత్వ అంశాన్ని లేవనెత్తుతూ జగన్ మీదనే షర్మిల బాణాలు వేస్తున్నారు. వైఎస్సార్ కి జగన్ మొక్కుబడిగా నివాళి అర్పించారు అని అంటున్నారు. అయితే ఇపుడు ఏపీ ప్రజలలో వైఎస్సార్ వారసులు ఎవరు అన్న చర్చ లేదు. అంతే కాదు ఏపీలో ఎవరు విపక్షంలో ప్రధాన పాత్ర అన్న చర్చ కూడా లేదు. ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించిన కూటమి ప్రభుత్వం మీద ఆశలు పెట్టుకుని ఎదురుచూస్తున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ గా షర్మిల మీడియా ముందుకు వచ్చి మాట్లాడాల్సి ఉంది. దాంతో కూటమి ప్రభుత్వాన్ని ఒక వైపు సున్నితంగా సలహా సూచనలతో హెచ్చరిస్తూ జగన్ మీద ఆమె ఘాటు విమర్శలు చేస్తున్నారు. ఆమె వైసీపీ నుంచి నాయకులను క్యాడర్ ని ఎంత వరకూ ఆకర్షిస్తారు అన్నది చూడాల్సి ఉంది. అయితే ఎల్ల కాలం సింగిల్ పాయింట్ అజెండాతో వెళ్తూ ఉన్నా జనాలకు అది బోర్ కొడుతుంది. సో షర్మిల పొలిటికల్ యాక్షన్ ప్లాన్ లో మార్పు చేర్పులు అవసరం అని కూడా అంటున్నారు.

# వైసీపీ టార్గెట్ పవన్..!

- ఫలించిన వ్యూహాలు
- మరింత డ్యామేజ్ తప్పదా.?


**రాజకీయాలు రాజకీయాలుగానే చేయాలి. అంతేకాదు.. కోడి గుడ్డుపై ఈకలు పీకే చందంగా ఎవరూ వ్యవహరించకూడదు. నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించేందుకు వైసీపీ నాయకులు ఎలానూ సిద్ధంగా లేరనేది తెలిసిపోయింది. కనీసం నిర్మాణాత్మక రాజ కీయాలైనా చేస్తే.. పోయిన పరువు దక్కుతుంది. కానీ, వైసీపీలో కొందరు నాయకులు మాత్రం అలా చేయడం లేదు. పిల్ల చేష్టలు.. పిల్ల రాజకీయాలు చేస్తూ.. వారికి వారే.. మరిన్ని మైనస్‌లు వేసుకుంటున్నారు. ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విషయంలో వైసీపీ నాయకులు చేస్తున్న ప్రచారం బూమరాంగ్ అవుతోంది.**



**విశ్వంభర, విశాఖపట్నం :** పవన్ కల్యాణ్‌ను ఇప్పుడు రాజకీయంగా విమర్శించేందుకు వైసీపీ దగ్గర సరుకు లేదు. ఎన్నికలకు ముందు పిల్ల కాకి.. ఏం చేస్తాడు? అసెంబ్లీ గడప కూడా తాకలేడు.. వంటి వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. కానీ, ఎన్నికల్లో పవన్ దుమ్మురేపి.. 21 స్థానాలకు 21 చోట్లా విజయం దక్కించుకున్న పరిస్థితి కనిపించింది. అంతేకాదు.. ఇద్దరు ఎంపీలను కూడా గెలిపించుకున్నారు. దీనికితోడు.. డిప్యూటీ సీఎంగా ఎవరూ ఊహించని విధంగా ఆయన దూసుకుపోతున్నారు. దీంతో రాజకీయంగా ఆయనను ఏమీ అనలేని కొందరు వైసీపీ నాయకులు.. చిన్న చిన్న లోపాలను కూడా బూతద్దంలో వెతుకుతున్నారు. వీటిని సోషల్ మీడియాలో వైరల్ చేసి.. ట్రోల్ చేస్తున్నారు. దీనివల్ల వారికి వచ్చే ఆనందం ఏంటో.. వారికే తెలియాలి. తాజాగా పవన్ కల్యాణ్.. చెత్త నుంచి సంపద సృష్టి ఎలా చేయాలనే విషయంపైఅ ధికారులతో చర్చలు జరిపారు. అనంతరం.. ఆయన మీడియా మీటింగ్ పెట్టారు. ఈ సమయంలో ఆయన చేతిలో ఉన్న మైకును ఎదురుగా ఉన్న టేబుల్‌పై పెట్టబోయారు. కానీ, అది జారిపోయింది. ఆ వెంటనే ఆయన పక్కనే ఉన్న పోడియం వద్దకు వెళ్లి నిలబడి గణాంకాలతో సహా.. మీడియాకు కొన్ని వివరాలు వెల్లడించారు. అయితే.. పవన్ చేతిలో మైకు జారిపోయిన విషయాన్ని చిలవలు పలవలు చేసిన.. వైసీపీ గ్యాంగ్.. పవన్ అసహనం వ్యక్తం చేస్తున్నాడని.. ఆయనకు మేనేజ్ చేయడం చేతకావడం లేదని, అధికారులతో ఎలా వ్యవహరించాలో తెలియడం లేదని.. అందుకే మైకు విసిరి కొట్టాడని వ్యాఖ్యానిస్తూ.. వైరల్ చేసింది. దీనికి జనసేన నాయకులు ఒరిజినల్ వీడియోతో ఘాటుగా సమాదానం చెప్పారు. ఇక, కొన్నాళ్ల కిందట పిఠాపురంలో పవన్ పర్యటించినప్పుడు.. రోడ్డు పక్కగా ఓ చిన్నారి.. చేతిలో పూల దండ పట్టుకుని పవన్ కోసం ఎదురు చూశాడు. ఈ విషయం చూసిన పవన్.. తన కాన్వాయ్‌ను ఆపి.. మరీ చిన్నారి వద్దకు వెళ్లి.. పూల దండ తీసుకున్నారు. ఈ సమయంలో ఆయన చిన్నారి బుగ్గ నిమిరారు. అయితే.. దీనిని వైసీపీ నాయకులు యాంటీగా చూపిస్తూ.. చిన్నారి బుగ్గపై చేయి చేసుకున్నాడంటూ.. పవన్‌పై యాంటీ వైరల్ చేశారు. ఆ తర్వాత.. అటవీ శాఖపై సమీక్ష చేసినప్పుడు కూడా.. పవన్.. ఏదో ఆలోచిస్తూ.. కళ్లు మూసుకుంటే.. ఆయన నిద్ర పోతున్నారని.. పెద్ద ఎత్తున వైరల్ చేశారు. అయితే.. వీటిని అసలు వీడియోలతో జనసేన తిప్పికొడుతోంది. కానీ, ఇలాంటి వ్యవహారాల వల్ల వైసీపీనే పలుచన అవుతోందని అంటున్నారు పరిశీలకులు. చిన్న చిన్న విషయాలను పెద్దవి చేసి.. ప్రచారం చేయడం వల్ల.. పవన్ కు జరిగే నష్టం ఏమీలేదని.. వైసీపీనే ఇంకా డైల్యూట్ అవుతుందని అంటున్నారు.

## వెంకటేశ్వరస్వామి నాకు ప్రాణభిక్ష పెట్టారు

- సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు
- తాను నమ్మేది వెంకటేశ్వరుడినే అంటూ కామెంట్



**విశ్వంభర, అమరావతి :** రాజధాని అమరావతిలోని కొలనుకొండలో హరేకృష్ణ గోకుల క్షేత్రాన్ని ఏపీ సీఎం చంద్రబాబు సందర్శించి పూజలు చేశారు. గర్భాలయంలో నిర్వహించిన అనంతశేష స్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వేంకటేశ్వర ఆలయ నిర్మాణంలో భాగంగా ఇక్కడ అనంతశేష స్థాపన చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు ఆలయ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ పాల్గొన్నారు. అక్షయ పాత్ర అంతర్జాతీయ అధ్యక్షుడు మధుపండిత్, మంత్రులు నారాయణ, సవిత, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. పేదరిక నిర్మూలన నినాదమే తన లక్ష్యమన్నారు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు. ప్రభుత్వంతోపాటు ఇలాంటి స్వచ్ఛంద సంస్థల సహాయంతో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో నడిపిస్తామన్నారు. సమాజానికి ఇంకా ఏదో చేయాలనే ఉద్దేశ్యంతోనే తిరుమల వెంకటేశ్వరస్వామి తనను కాపాడారన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు. తాను నమ్మేదేవుడు, ప్రార్థించే దేవుడు వేంకటేశ్వర స్వామి అని మరోసారి తెలిపారు. 2003లో తనపై 23 క్లైమోర్ మైన్స్ బాంబు బ్లాస్ట్ చేయాలని ప్లాన్ చేశారు. అప్పుడు తన ప్రాణాలను కాపాడింది తిరుమల వేంకటేశ్వరుడని గతాన్ని గుర్తు చేశారు. ఆది ఒక మిస్టరీ అని చెప్పారు.


## వాళ్ల కాళ్లకు దండం పెడుతా

- ఆ సంస్కృతి మారాలి
- సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

**విశ్వంభర, అమరావతి :** ఒకప్పుడు రాజకీయనాయకులు కాళ్లకు దండం పెట్టే సంస్కృతి ఏపీ రాజకీయాల్లో చాలా తక్కువ. కానీ ఇటీవలి కాలంలో మాత్రం అది మరీ ఎక్కువైంది. ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు కాళ్లకు నమస్కారం చేసే వారి సంఖ్య విపరీతంగా ఎక్కువైపోయింది. అయితే ఈ విషయంపై తాజాగా ఏపీ సీఎం కీలక సూచన చేశారు. కాళ్లకు దండం పెట్టే సంస్కృతి వీడాలని, ఆ పద్ధతి సరికాదన్నారు. ఇకపై ఎవరైనా తన కాళ్లకు దండంపెడితే, తాను వారి కాళ్లకు దండం పెడతానన్నారు. నేటి నుంచి తన కాళ్లకు దండం పెట్టే విధానానికి ఫుల్‌స్టాప్ పెడుతున్నట్లు చంద్రబాబు సూచించారు. తల్లిదండ్రులు, భగవంతుడి కాళ్లకు దండం పెట్టాలని.. కానీ రాజకీయ నేతల కాళ్లకు దండం పెట్టాల్సిన అవసరం లేదన్నారు. రాజకీయ నేతల కాళ్లకు దండం పెట్టి ఎవరూ తమ గౌరవాన్ని తగ్గించుకోవద్దన్నారు చంద్రబాబు. రాజకీయ నేతల కాళ్లకు ప్రజలు, పార్టీ శ్రేణులు దండం పెట్టొద్దనే సంస్కృతి తన నుంచే ప్రారంభిస్తున్నానని చంద్రబాబు తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు మంగళగిరిలోని కొలనుకొండలోని హరేకృష్ణ గోకుల క్షేత్రానికి వెళ్లారు. వెంకటేశ్వర ఆలయ నిర్మాణంలో భాగంగా గర్భాలయంలో అనంతశేష స్థాపన కార్వహించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ పేదరికం లేని సమాజమే తన లక్ష్యమని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. తిరుమల వెంకన్న తనకు ప్రాణభిక్ష పెట్టారని చంద్రబాబు అన్నారు.

# త్వరలో నార్కొటిక్స్ టీమ్స్

- గంజాయి నిర్మూలనపై దృష్టి పెట్టాలి
- ఏపీ డీజీపీ తిరుమలరావు



**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టేందుకు యాంటీ నార్కొటిక్స్ టాస్క్‌ఫోర్స్ టీంను త్వరలో ఏర్పాటు చేస్తామని డీజీపీ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. శనివారం ఆయన రాయలసీమ జిల్లాల ఎస్పీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. గిరిజనులను వాడుకుని గంజాయి సాగు చేయిస్తున్న తీరును అరికడతామని వెల్లడించారు. బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా సమాచారం కోసం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలీసులకు త్వరలో పదోన్నతులు ఇస్తామని, త్వరలో కానిస్టేబుళ్ల నియామకాలు చేపడతామని వివరించారు. ఏ పార్టీకి కొమ్ముకాయకుండా పనిచేస్తామని, పౌరులను మెగుగైన సేవలు అందిస్తామని, సమాజానికి జవాబుదారితనంగా పనిచేస్తామన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్ను పూర్తిస్థాయిలో అడ్డుకుంటామని స్పష్టం చేశారు.


## ఐదు రోజులు వర్షాలు

**విశ్వంభర, అమరావతి :** ఏపీలో వచ్చే ఐదు రోజులు విస్తారంగా వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. పలు కోస్తా జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే ఐదు రోజులు రాయలసీమలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. నైరుతి రుతుపవనాలు, ద్రోణుల ప్రభావానికి తోడు, ఈశాన్య అస్సాం నుంచి వాయవ్య బంగాళాఖాతం వరకు, పశ్చిమ అస్సాం నుంచి వాయవ్య బంగాళాఖాతం వరకు వేర్వేరుగా ద్రోణులు కొనసాగుతున్నాయి. వీటి ప్రభావంతోనే వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. తెలంగాణలో జూలై 18వ తేదీ వరకు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 13 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, కామారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేస్తోంది. ఈ జిల్లాలకు అధికారులు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.



## ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

- భార్యను చంపేసిన భర్త
- పోలీసులకు లొంగుబాటు



**విశ్వంభర, కడప :** భార్య వివాహేతర సంబంధం పెట్టుకుంది అని తెలిసిన భర్త కిరాతకానికి ఒడిగట్టాడు. ఆమెను పార్కుకు వెళదామని నమ్మించి అనంత లోకాలకు పంపించాడు పార్కు సమీపంలో ఉన్న కంపచెట్లలోకి తీసుకొని వెళ్లి గొంతు నులిమి చంపి ఇసుకలో పూడ్చి పెట్టాడు. ఆ తరువాత తానే స్వయంగా పోలీసుల వద్దకు వెళ్లి తన భార్యను హత్య చేశానంటూ లొంగిపోయాడు. ఈ ఘటన కడప జిల్లాలో కలకలం రేపింది. కడప జిల్లా ప్రొద్దుటూరులోని అమృత్ నగర్‌కు చెందిన అన్వర్ భాష జమ్మలమడుగులోని మైలవరం మండలం దుడియం గ్రామానికి చెందిన రేష్మ అనే మహిళను 10 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. అయితే వీరిద్దరి సంసారం సజావుగానే సాగుతున్నప్పటికీ అన్వర్ భాష ప్రోక్లైన్ డ్రైవర్గా పనిచేస్తుండడం భార్యకు తీవ్ర నిరాశకు గురి చేసింది. ఇంటికి కొన్ని రోజులు రాకుండా డ్యూటీలోనే ఉండడంతో వివాహేతర సంబంధానికి దారితీసింది. ఇలా భర్త పనికి వెళ్లే సమయంలో, భార్య వేరే వ్యక్తితో వివాహేతర సంబంధానికి రేష్మ అనే మహిళ అలవాటు పడింది. ఈ విషయం తెలిసిన అన్వర్ భాష గతంలో ఒకసారి హెచ్చరించినట్లు సమాచారం. అయితే భర్త మాటలను పెడచెవిన పెట్టిన భార్య రేష్మ వివాహేతర సంబంధాన్ని అలాగే కొనసాగిస్తుండడంతో గత కొంత కాలం క్రితం ఇద్దరు గొడవపడి వేర-ంవేరుగా ఉంటున్నట్లు స్థానికులు అంటున్నారు. గత పది రోజుల క్రితం కూడా వీరిద్దరి మధ్య గొడవ జరిగిందని అప్పుడు రేష్మ భర్తను వదిలేసి తన బంధువుల ఇంటికి వెళ్లి అక్కడే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలోని శుక్రవారం సాయంత్రం భార్య రేష్మ వద్దకు వెళ్లిన భర్త.. పార్కుకు వెళదామని ఆమెను నమ్మించాడు. ప్రొద్దుటూరులోని ఎకో పార్కుకు తీసుకొని వెళ్ళాడు. వెళ్లిన కొద్దిసేపు మాట్లాడిన తర్వాత ఎకో పార్క్ ఎదురుగా ఉన్న కంపచెట్ల లోనికి తీసుకొని వెళ్లి గొంతు నులిమి చంపేశాడు. అక్కడే ఇసుకలో పూడ్చిపెట్టి నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయాన్ని చెప్పాడు. నిందితుడి మాటలు విన్న వెంటనే అప్రమత్తమైన పోలీసులు అన్వర్ భాషను అదుపులోకి తీసుకొని భార్యను పూడ్చిపెట్టిన స్థలానికి చేరుకున్నాఉ. ఆమెను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి పంపించారు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఏదేమైనా వివాహేతర సంబంధం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది.

## కాలువలో పడేశారా.. పాతిపెట్టారా..?

- వీడని బాలిక మిస్టరీ
- ఏడు రోజులుగా వెతుకులాట

**విశ్వంభర, విశాఖపట్నం :** నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో అత్యాచారం, హత్యకు గురైన బాలిక ఘటన మిస్టరీగా మారింది. ఏడు రోజులైనా బాలిక డెడ్‌బాడీ ఆచూకీ దొరకడం లేదు. దాంతో.. బాలిక కోసం సెర్చింగ్ ఆపరేషన్స్ కొనసాగుతున్నాయి. ప్రధానంగా.. పగిడ్యాల మండలం మొత్తం జల్లెడపడున్నారు పోలీసులు. ఈ నెల 7న పార్కులో ఆడుకుంటున్న బాలికను ఎత్తుకెళ్లి అత్యాచారం చేసి చంపేశారు ముగ్గురు మైనర్లు. ఎవరికీ అనుమానం రాకుండా స్పాట్‌లో క్షుద్రపూజలు చేసినట్లు ఆనవాళ్లు క్రియేట్ చేశారు. ఈ ఘోరం జరిగిన రెండ్రోజుల తర్వాత ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. వాళ్లిచ్చిన సమాచారం మేరకు బాలిక డెడ్‌బాడీ కోసం మూడ్రోజులపాటు కాలువలో గాలించారు పోలీసులు. ఇదిలావుంటే.. ఏడు రోజులైనా బాలిక డెడ్‌బాడీ ఆచూకీ లభ్యం కాకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులకు నిందితులు తప్పుడు సమాచారం ఇచ్చారా?.. అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. ఈ క్రమంలోనే.. మరో ట్విస్ట్ నెలకొంది. కేసు దర్యాప్తులో భాగంగా.. మైనర్లతోపాటు వారి తల్లిదండ్రులను విచారించారు పోలీసులు. అయితే.. హత్య తర్వాత బాలికను కాలువలోకి తోసేశామని నిందితులు చెప్తుంటే.. వారి పేరెంట్స్ మాత్రం బాలికను శ్మశాన వాటికలో పాతిపెట్టారని చెప్పడం షాకిచ్చింది. ఇక.. నిందితుల పేరెంట్స్ చెప్పిన కోణంలోనే ముచ్చుమర్రితోపాటు.. కొణిదెల, వనములపాడు గ్రామాల్లోని శ్మశాన వాటికల్లో తనిఖీలు మొదలు పెట్టారు. అవసరమైతే పాతిపెట్టినట్లుగా అనుమానం వచ్చిన ప్రదేశాల్లో తవ్వకాలు చేపట్టాలని భావిస్తున్నారు పోలీసులు. ఇప్పటివరకూ కాలువలో గాలించిన పోలీసులు.. ఇప్పుడు బాలిక డెడ్‌బాడీ కోసం శ్మశానవాటికల్లో తనిఖీలు చేపట్టారు.

# సిరీస్ భారత్ కైవసం

## జింబాబ్వేపై 10 వికెట్ల తేడాతో టీమిండియా ఘన విజయం

**విశ్వంభర, స్పోర్ట్స్ :** పొట్టి ప్రపంచ కప్ విజేత టీమిండియా రెండు వారాల వ్యవధిలోనే మరో సిరీస్ పట్టేసింది. జింబాబ్వే పర్యటనలో మరో మ్యాచ్ ఉండగానే యువ భారత్ టీ20 ట్రోఫీ కైవసం చేసుకుంది. శనివారం జరిగిన నాలుగో టీ20లో ఓపెనర్లు యశస్వీ జైస్వాల్(93 నాటౌట్), శుభ్‌మన్ గిల్(58 నాటౌట్)లు ఆతిథ్య జట్టు బౌలర్లకు చుక్కలు చూపించారు. తొలి ఓవర్ నుంచే బౌండరీలతో విరుచుకుపడ్డ ఈ జంట రికార్డు భాగస్వామ్యంతో టీమిండియాను గెలుపు బాట పట్టించింది. దాంతో, 10 వికెట్లతో గెలిచిన గిల్ సేన 3-1తో సిరీస్ దక్కించుకుంది. తొలి ఓవర్‌లోనే యశస్వీ 15 పరుగులు పిండుకొని తన ఉద్దేశం చాటగా.. గిల్ సైతం దూకుడుగా ఆడాడు. దాంతో, స్కోర్ బోర్డు పరుగులు పెట్టగా.. జింబాబ్వే ఫీల్డర్లు బౌండరీ లైన్‌కు పరుగులు పెట్టారు. 29 బంతుల్లోనే యశస్వీ అర్ధ సెంచరీ సాధించాడు. కెప్టెన్ గిల్ కూడా మెరుపు ఫిఫ్టీతో జింబాబ్వే ఆటగాళ్లను అసహనానికి గురి చేశాడు. ముజరబనీ వేసిన 16వ ఓవర్ రెండో బంతికి యశస్వీ బౌండరీ కొట్టడంతో10 వికెట్ల విజయం నమోదు చేసింది.



### రజా కెప్టెన్ ఇన్నింగ్స్

సొంతగడ్డపై పొట్టి సిరీస్‌లో వెనకబడిన జింబాబ్వే నాలుగో టీ20లో పోరాడగలిగే స్కోర్ చేసింది. గత రెండు మ్యాచుల్లో భారత బౌలర్ల ధాటికి చేతులెత్తేసిన బ్యాటర్లు పట్టుదలగా ఆడారు. ఓపెనర్లు తడివనషె మరుమని(32), వెస్లీ మధెవెరె(25)లు శుభారంభమివ్వగా.. సికిందర్ రజా(0) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి స్కోర్ బోర్డును నడిపించాడు. అయితే భారత బౌలర్లు వరస విరామాల్లో వికెట్లు తీస్తూ ఆతిథ్య జట్టును కట్టడి చేశారు. చివర్లో డియాన్ యెర్స్(13), కల్‌ఐవ్ మడండే(7)లు పోరాడడంతో జింబాబ్వే నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 152 రన్స్ కొట్టింది. భారత బౌలర్లలో ఖలీల్ అహ్మద్ రెండు వికెట్లు పడగొట్టాడు. దాంతో, ఆతిథ్య జట్టు నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 152 రన్స్ కొట్టింది.

# హిస్టరీ రిపీట్ అవుతుందా..!

**విశ్వంభర, స్పోర్ట్స్ :** వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ లీగ్ ఇంగ్లండ్‌లో జరుగుతోంది. మాజీ క్రికెటర్లు ఆడుతున్న ఈ లీగ్‌లో భారత్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ జట్లు పాల్గొన్నాయి. ఈ లీగ్‌లో మొదటి నాలుగు జట్లు అంటే భారత్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, వెస్టిండీస్ సెమీ-ఫైనల్‌లోకి ప్రవేశించాయి. రెండు సెమీ-ఫైనల్ మ్యాచ్‌లు జులై 12న జరిగాయి. ఒకదానిలో పాకిస్థాన్ వెస్టిండీస్ ను ఓడించగా, మరొకటి ఆస్ట్రేలియాను భారత్ ఓడించింది. 2007 టీ20 ప్రపంచకప్ మాదిరిగానే ఇప్పుడు భారత్-పాకిస్థాన్ మధ్య ఫైనల్ మ్యాచ్ నేడు అంటే జులై 13న జరగనుంది. భారత్, పాకిస్థాన్‌లు ఫైనల్‌కు చేరుకోగానే అభిమానులకు 2007 టీ20 ప్రపంచకప్ ఫైనల్ గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడు ఫైనల్ మ్యాచ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు సెమీ-ఫైనల్ కూడా 2007 టీ20 ప్రపంచ కప్ లాగా ఉంది. 2007 లాగే మరోసారి ఆస్ట్రేలియా సెమీ ఫైనల్‌లో టీమ్ ఇండియాతో తలపడింది. ఆ మ్యాచ్‌లాగానే ఈ మ్యాచ్‌లోనూ భారత్ మొదట బ్యాటింగ్ చేసి విజయం సాధించింది. యువరాజ్ సింగ్ కెప్టెన్సీలో భారత జట్టు 86 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. ఈ మ్యాచ్‌లో మరో సారూప్యత కనిపించింది. 2007 సెమీ-ఫైనల్ మాదిరిగానే, యువరాజ్ కూడా లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అయ్యాడు. ఆ సమయంలో అతను 30 బంతుల్లో 70 పరుగులతో తుఫాను ఇన్నింగ్స్ ఆడాడు. ఈ మ్యాచ్‌లో అతను 28 బంతుల్లో 59 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్‌ను ప్రదర్శించాడు. యువరాజ్‌తో పాటు యూసుఫ్ పఠాన్



23 బంతుల్లో 51 పరుగులు, ఇర్ఫాన్ పఠాన్ 19 బంతుల్లో 50 పరుగులు, రాబిన్ ఉతప్ప 35 బంతుల్లో 65 పరుగుల ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను గెలిపించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ విధంగా, భారత్ మొత్తం 254 పరుగులు చేసింది. దీనికి సమాధానంగా ఆస్ట్రేలియా జట్టు 168 పరుగులు మాత్రమే చేయగలిగింది. వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ తొలి సెమీస్‌లో యూనిస్ ఖాన్ సారథ్యంలోని పాకిస్థాన్ జట్టు 20 పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించింది. వెస్టిండీస్ టాస్ గెలిచి పాకిస్థాన్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. అయితే తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 10 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత కమ్రాన్ అక్మల్, యూనిస్ ఖాన్ ఇన్నింగ్స్‌ను చేజిక్కించుకున్నారు. కమ్రాన్ 31 బంతుల్లో 46 పరుగులు, యూనిస్ 45 బంతుల్లో 65 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడారు. ఆ తర్వాత, చివరికి అమీర్ యామిన్ 18 బంతుల్లో వేగంగా 40 పరుగులు చేశాడు. సోహైల్ తన్వీర్ కూడా 17 బంతుల్లో 33 పరుగులు చేశాడు. దీంతో పాకిస్థాన్ 198 పరుగులకే ఆలౌటైంది. దానిని ఛేదించేందుకు వచ్చిన వెస్టిండీస్ జట్టు 178 పరుగులకు ఆలౌటైంది.

# ఒకే బంతిలో సెంచరీ, డబుల్, త్రిపుల్ సెంచరీ

**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఇంగ్లండ్ క్రికెట్ జట్టు ప్రస్తుతం స్వదేశంలో వెస్టిండీస్‌తో మూడు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడుతోంది. సిరీస్‌లోని మొదటి మ్యాచ్ లార్డ్స్‌లో జరిగింది. ఈ మ్యాచ్‌లో ఆతిథ్య ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 114 పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించింది. దీంతో సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది. ఈ విజయంతో దిగ్గజ ఫాస్ట్ బౌలర్ జేమ్స్ అండర్సన్‌కు ఇంగ్లండ్ జట్టు కీలక ఝలక్ ఇచ్చింది. 2003లో అరంగేట్రం చేసిన అండర్సన్ 700 టెస్టు వికెట్లతో నిష్క్రమించాడు. ప్రత్యేక మ్యాచ్‌లో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ప్రత్యేక సెంచరీ, డబుల్ సెంచరీ, ట్రిపుల్ సెంచరీ పూర్తి చేశాడు. ఇంగ్లండ్ టెస్టు కెప్టెన్, ఆల్ రౌండర్ బెన్ స్టోక్స్ ఈ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు పడగొట్టాడు. అతను తన మొదటి ఓవర్‌లోనే బ్యాట్స్‌మెన్ కిర్క్ మెకెంజీని అవుట్ చేశాడు. దీంతో స్పెషల్ సెంచరీ, డబుల్ సెంచరీ, ట్రిపుల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. నిజానికి ఇది బెన్ స్టోక్స్‌కి 200వ టెస్టు వికెట్ కాగా, ఇంగ్లండ్‌లో అతడికిది 100వ టెస్టు వికెట్. అలాగే ఈ వికెట్‌తో బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌లో 300 వికెట్ల రికార్డును పూర్తి చేశాడు. అంటే, బెన్ స్టోక్స్ ఒక్క వికెట్‌తో ఈ మూడు ఘనతలను సాధించాడు. బెన్ స్టోక్స్‌కు కిర్క్ మెకెంజీ వికెట్ చాలా



ప్రత్యేకమైనది. ఈ వికెట్‌తో, అతను వెస్టిండీస్ గ్రేట్ గ్యారీ సోబర్స్, దక్షిణాఫ్రికా దిగ్గజ ఆల్ రౌండర్ జాక్వెస్ కల్లిస్‌ల ప్రత్యేక క్లబ్‌లో చోటు దక్కించుకున్నాడు. అతను ఇప్పుడు టెస్ట్ క్రికెట్‌లో 6,000 పరుగులు, 200 వికెట్లు తీసిన మొదటి ఇంగ్లండ్ ఆటగాడు, ప్రపంచంలో మూడవ ఆటగాడిగా నిలిచాడు. బెన్ స్టోక్స్ ఇప్పటి వరకు ఇంగ్లండ్ తరపున మొత్తం 103 టెస్టులు ఆడి 200కి పైగా వికెట్లు పడగొట్టాడు. ఇది కాకుండా బ్యాటింగ్‌లోనూ మ్యాజిక్ చేసిన స్టోక్స్ 35.30 సగటుతో 6,320 పరుగులు చేశాడు. ఇందులో ఇన్నింగ్స్‌లో 13 సెంచరీలు ఉన్నాయి.

# అండర్సన్‌కు సచిన్ విషెస్

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ దిగ్గజ బౌలర్ జేమ్స్ అండర్సన్ .. అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన లార్డ్స్ టెస్టులో అతను అల్విదా ప్రకటించేశాడు. ఈ నేపథ్యంలో మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ ఆ గ్రేట్ బౌలర్‌కు తనదైన స్టయిల్‌లో ఫేర్‌వెల్ విషెస్ తెలిపాడు. జిమ్మీ బౌలింగ్‌ను ఎంతో ఎంజాయ్ చేసినట్లు సచిన్ తన ట్వీట్‌లో వెల్లడించాడు. 188 టెస్టులు ఆడిన అండర్సన్ మొత్తం తన ఖాతాలో 704 వికెట్లు వేసుకున్నాడు. 22 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో నీ బౌలింగ్‌తో అందర్నీ బౌల్డ్ చేశావని జేమ్స్‌ను సచిన్ మెచ్చుకున్నాడు. ఆ స్పీడ్, యాక్షన్, అక్యురెసీ, స్వింగ్, ఫిట్‌నెస్ అద్భుతమని తన గుడ్‌బై సందేశంలో సచిన్ తెలిపాడు. నీ ఆట తీరుతో ఎంతో మందికి ప్రేరణగా నిలిచావని కీర్తించాడు. ఆరోగ్యం, సంతోషంతో జీవితం సాఫీగా సాగాలని ఆకాంక్షిస్తున్నట్లు సచిన్ కోరుకున్నాడు. భారత్‌తో 39 టెస్టుల్లో అండర్సన్ ఆడాడు. వాటిల్లో అతను 149 వికెట్లు తీసుకున్నాడు. దీంట్లో ఆరు సార్లు అయిదేసి వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లండ్‌తో సచిన్ టెండూల్కర్ 32 టెస్టుల్లో ఆడాడు. వాటిల్లో అతను 2535 రన్స్ చేశాడు. దాంట్లో ఏడు సెంచరీలు, 13 ఫిఫ్టీలు ఉన్నాయి.

# టికెట్ ధర రూ.3 కోట్లు

**విశ్వంభర, స్పోర్ట్స్ :** టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ వింబుల్డన్ ఫైనల్ ఆసక్తి రేపుతోంది. గత సీజన్ ఫైనలిస్టులు కార్లోస్ అల్కరాజ్, నొవాక్ జకోవిచ్‌ల మధ్య నువ్వా నేనా అన్నట్టు టైటిల్ పోరు జరగనుంది. దాంతో, రసవత్తరంగా సాగే ఈ మ్యాచ్ చూసేందుకు అభిమానులు పోటెత్తనున్నారు. అందుకని నిర్వాహకులు సైతం ఫ్యాన్స్ ఇంట్రెస్ట్‌ను సొమ్ము చేసుకునేందుకు టిక్కెట్ రేటును రూ.3కోట్లుగా నిర్ణయించారు. జూలై 14 ఆదివారం రోజు సెంటర్ కోర్టులో జరిగే ఫైనల్ మ్యాచ్ టిక్కెట్లు రికార్డు ధర పలుకుతున్నాయి. వింబుల్డన్ ఫైనల్ పోరు కనీస ప్రారంభ టికెట్ ధర రూ. 8.85 లక్షలుగా ఉంది. ఇక సెంటర్ కోర్టుకు సమీపంగా ఉండే సీట్ల ధర రూ.31 లక్షలు కాగా.. మరికొన్ని సీట్ల ధర రూ. 3 కోట్లు ఉంది. దాంతో, ఈసారి వింబుల్డన్ ఫైనల్ మ్యాచ్ టిక్కెట్లకు క్రీడా చరిత్రలో కనీవినీ ఎరుగని ధర పలికింది.



**యువరాజ్‌కు అడ్డుందా..** డిఫెండింగ్ చాంపియన్ అల్కరాజ్ వరుసగా రెండో ఏడాది ట్రోఫీపై గురి పెట్టాడు. 2023లో నొవాక్ జకోవిచ్‌ను చిత్తు చేసి తొలిసారి విజేతగా అవతరించిన స్పెయిన్ సంచలనం డబుల్ కొట్టాలనే ఉత్సాహంతో ఉన్నాడు. మరోవైపు గత సీజన్ ఓటమికి బదులు తీర్చుకోవాలని జకోవిచ్ భావిస్తున్నాడు. దాంతో, ఇద్దరి మధ్య టైటిల్ పోరు ఫ్యాన్స్‌కు పైసా వసూల్ అనుభూతి ఇవ్వడం ఖాయం.




# బరోడా రుణాల వడ్డీ రేట్లు పెంపు

**విశ్వంభర, బిజినెస్ :** భారతదేశంలోని బ్యాంకులు రుణ మంజూరు విషయంలో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచేందుకు మొగ్గు చూపుతున్నాయి. తాజాగా ప్రభుత్వ యాజమాన్యంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా శుక్రవారం నుంచి మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్- బేస్డ్ లెండింగ్ రేట్‌ను పెంచింది. ఈ మేరకు జులై 9న బ్యాంక్ ఈ ప్రకటన చేసింది. ఎంసీఎల్ఆర్ రేటు పెంపుతో కొత్త రుణ రేట్లు 8.15 శాతం నుంచి 8.90 శాతం వరకు ఉంటాయి. ఈ నేపథ్యంలో రుణ వడ్డీ రేటు విషయంలో బ్యాంక్ ఆఫ్ బరోడా తీసుకున్న తాజా నిర్ణయం మరిన్ని వివరాలను తెలుసుకుందాం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం బ్యాంకులు ప్రతి నెలా తమ ఎంసీఎల్ఆర్‌ను సమీక్షించాల్సి ఉంటుంది. అందువల్ల బ్యాంకు ఆఫ్ బరోడా ఇటీవల ఎంసీఎల్ఆర్‌ను సమీక్షించింది. అందువల్ల వివిధ పదవీకాలానికి వడ్డీ రేట్లను సవరించింది. అందువల్ల ఓవర్ నైట్ రేటు 8.10 శాతం నుంచి 8.15 శాతంగా ఉంటుంది. ఒక నెల రేటు 8.30 శాతం నుంచి 8.35 శాతంగా ఉంటుంది. మూడు నెలల రేటు 8.45 శాతం వద్ద ఎటువంటి మార్పు లేదు. ఆరు నెలల రేటు 8.65 శాతం నుంచి 8.70 శాతానికి పెరుగుతుంది. ఒక సంవత్సరం రేటు 8.85 శాతం నుంచి 8.90 శాతానికి పెరుగుతుంది. ప్రస్తుతం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్లో బ్యాంక్ ఆఫ్ బరోడా షేరు ధర 0.3 శాతం తగ్గి రూ.261.70 వద్ద స్థిరపడింది. బ్యాంక్ గ్లోబల్ బిజినెస్ ఏడాది ప్రాతిపదికన 8.52 శాతం పెరిగి రూ.23.77 లక్షల కోట్లకు చేరుకుంది. గ్లోబల్ డిపాజిట్లలో బలమైన పెరుగుదల ఈ వృద్ధికి ప్రధాన కారణం. ఇది ఏడాది ప్రాతిపదికన 8.83 శాతం పెరిగి రూ.13.05 లక్షల కోట్లకు చేరుకుంది. అదనంగా బ్యాంక్ గ్లోబల్ అడ్వాన్‌లు ఏడాది ప్రాతిపదికన 8.14 శాతం పెరిగి రూ.10.72 లక్షల కోట్లకు చేరుకున్నాయి. దేశీయంగా బ్యాంకు డిపాజిట్లు గత ఏడాదితో పోలిస్తే 5.25 శాతం పెరిగి రూ.11.05 లక్షల కోట్లకు చేరుకున్నాయి. అలాగే 7,500 కోట్ల వరకు అదనపు మూలధనాన్ని సమీకరించేందుకు గతంలో బ్యాంక్ ఆఫ్ బరోడా డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది.

# ఈ రెండింటిలో పెట్టుబడి జీవితానికి భరోసా

**విశ్వంభర, బిజినెస్ :** ధనం మూలం ఇదం జగత్ అంటే సమాజం మొత్తం డబ్బు చుట్టూనే తిరుగుతుందని అర్థం. అవును మన దగ్గర డబ్బు లేని సమయంలోనే మన అనుకునే వారి నిజ స్వరూపం బయటపడుతుందని కొందరు చెబుతూ ఉంటారు. ఈ నేపథ్యంలో డబ్బు సంపాదించే సమయంలోనే భవిష్యత్ అవసరాలకు సొమ్మును కూడబెట్టుకోవాలని నిపుణులు సూచిస్తూ ఉంటారు. భారతదేశంలోని ప్రజలను పొదుపు మార్గం వైపు నడిపించేందుకు ప్రభుత్వం కొన్ని చిన్న తరహా పొదుపు పథకాలను తీసుకొచ్చింది. ముఖ్యంగా రిటైర్‌మెంట్ అయ్యాక సురక్షితమైన ఆర్థిక భవిష్యత్తు కోసం ప్లాన్ చేస్తున్నప్పుడు భారతదేశంలోని పెట్టుబడి ఎంపికల్లో పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్), నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) పథకాలు అత్యంత ప్రజాదరణ పొందాయి. ఈ రెండూ ప్రత్యేకమైన ప్రయోజనాలను అందిస్తాయి. అలాగే విభిన్న పెట్టుబడిదారుల అవసరాలను తీరుస్తాయి. ఈ నేపథ్యంలో ఈ రెండు పథకాల్లో ప్రధాన తేడాలను ఓ సారి తెలుసుకుందాం.

### పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్

పీపీఎఫ్ అనేది భారత ప్రభుత్వం మద్దతు ఇచ్చే దీర్ఘకాలిక పెట్టుబడి ఎంపిక. ఇది ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు, పన్ను నుంచి పూర్తిగా మినహాయింపుతో రాబడిని అందిస్తుంది. సురక్షితమైన, రిస్క్ లేని పెట్టుబడి మార్గాన్ని కోరుకునే వ్యక్తులకు ఇది అను



కూలంగా ఉంటుంది. పీపీఎఫ్ వడ్డీ రేటు ప్రస్తుతం సంవత్సరానికి 7.1 శాతంగా ఉంది. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ప్రతి త్రైమాసికానికి రేటు మారుతూ ఉంటుంది. ఈ పథకంలో పెట్టుబడి పదవీకాలం 15 సంవత్సరాలు దీనిని 5 సంవత్సరాల బ్లాక్‌లలో పొడిగించవచ్చు. అలాగే ఆర్థిక సంవత్సరానికి కనిష్టంగా రూ.500, గరిష్టంగా రూ.1.5లక్షలు పెట్టుబడి పెట్టవచ్చు. రూ.1.5లక్షల వరకు ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ కింద పెట్టుబడులు పన్ను మినహాయింపులకు అర్హత ఉంటుంది. సంపాదించిన వడ్డీ, మెచ్యూరిటీ మొత్తం పన్ను రహితంగా ఉంటుంది. గ్యారంటీ రాబడితో రిస్క్ లేని పెట్టుబడి కోసం చూస్తున్న పెట్టుబడిదారులకు ఈ పథకం అనువుగా ఉంటుంది.

### నేషనల్ పెన్షన్ సిస్టమ్

ఎన్‌పీఎస్ అనేది పదవీ విరమణ ఆదాయాన్ని అందించడానికి భారత ప్రభుత్వం ప్రారంభించిన పెన్షన్ పథకం. ఇది మార్కెట్-లింక్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆప్షన్. ఇది ఈక్విటీ, డెట్ మార్కెట్‌లకు ఎక్స్‌పోజర్‌ను అందిస్తుంది. పెట్టుబడిదారులు తమ రిటైర్మెంట్ కోసం గణనీయమైన కార్పస్‌ను కూడబెట్టుకోవడానికి వీలు కల్పిస్తుంది. ఈ పథకంలోని రిటర్న్ మార్కెట్-లింక్డ్ మరియు మారవచ్చు. విభిన్న ఆస్తి తరగతులకు సంబంధించి రాబడి 8 శాతం నుంచి 10 శాతం మధ్య ఉంటుంది. పెట్టుబడిదారులు తప్పనిసరిగా 60 ఏళ్ల వయస్సు వరకు విరాళం ఇవ్వాలి. 70 ఏళ్ల వరకు పొడిగించే అవకాశం ఉంటుంది. పెట్టుబడులపై గరిష్ట పరిమితి లేదు. అయితే ఆర్థిక సంవత్సరానికి రూ. 2 లక్షల వరకు పన్ను ప్రయోజనాలు లభిస్తాయి. రూ. 1.5 లక్షల వరకు విరాళాలు సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులకు అర్హత ఉంటుంది. సెక్షన్ 80సీసీడీ(1బి) కింద అదనంగా రూ. 50,000 క్లెయిమ్ చేయవచ్చు. అలాగే నిర్దిష్ట పరిస్థితులలో పాక్షిక ఉపసంహరణలు అనుమతి ఉంటుంది. పదవీ విరమణ సమయంలో 60 శాతం కార్పస్‌ను పన్ను రహితంగా ఉపసంహరించుకోవచ్చు. మిగిలిన 40 శాతం తప్పనిసరిగా యాన్యుటీని కొనుగోలు చేయడానికి ఉపయోగించాలి.

# సూపర్ మార్కెట్లలో AI కార్ట్‌లు

- నేరుగా బిల్లులు చెల్లించే సదుపాయం
- కౌంటర్ దగ్గరకు వెళ్లాల్సిన పనిలేదట

**విశ్వంభర, బిజినెస్ :** భారత మార్కెట్లో సూపర్ మార్కెట్ల సంస్కృతి వేగంగా పెరుగుతోంది. మెట్రో నగరాల తర్వాత చిన్న నగరాల్లో కూడా సూపర్ మార్కెట్లు ప్రారంభమయ్యాయి. చాలా మంది వ్యక్తులు సూపర్ మార్కెట్లలో షాపింగ్ చేస్తారు. ఎందుకంటే చాలా వస్తువులు చాలా తక్కువ ధరలకు లభిస్తాయి. కానీ ఒక సూపర్ మార్కెట్‌లో ఒక సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. దీని కారణంగా ప్రజలు తరచుగా అడ్డదారులు తొక్కాల్సి వస్తుంది. నిజానికి సూపర్‌మార్కెట్లలో పీక్ టైమ్‌లో బిల్ కౌంటర్ వద్ద క్యూ కట్టడం వల్ల షాపింగ్‌కు వచ్చేవారు ఎక్కువ సమయం వృధా చేసుకుంటున్నారు. కానీ త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభించనుంది. ఎందుకంటే ఇప్పుడు మీరు సూపర్ మార్కెట్లలో AI కార్ట్‌లను కనుగొంటారు. ఇప్పటి వరకు, వినియోగదారులు సూపర్ మార్కెట్లలో వస్తువులను ఉంచడానికి సాధారణ ట్రాలి వంటి దాన్ని వాడుతుంటారు. ఇందులో సరుకులు ఉంచిన తర్వాత బిల్లు కౌంటర్ వద్దకు వెళ్లి బిల్లు తెచ్చుకోవాలి. అయితే ఇటీవల అమెరికాలోని న్యూయార్క్‌లోని ఓ సూపర్‌మార్కెట్‌లో AI కార్ట్‌ని వాడారు. ఆ తర్వాత కస్టమర్ బిల్లు కౌంటర్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు.

### AI కార్ట్ ఎలా పని చేస్తుంది?

మీరు న్యూయార్క్ సూపర్ మార్కెట్‌లో ఉపయోగిస్తున్న AI కార్ట్‌లో ఏదైనా వస్తువును ఉంచిన వెంటనే, దాని మొత్తం కార్ట్‌లోని డిస్‌ప్లేలో కనిపించడం ప్రారంభమవుతుంది. దీని తర్వాత మీరు కొనుగోలు చేసిన ప్రతి వస్తువు మొత్తం దానికి



జోడిస్తుంది. ఇది 'గేమిఫికేషన్' ఫీచర్‌ను కూడా కలిగి ఉంది. ఇది కొంత మొత్తాన్ని ఖర్చు చేస్తే రివార్డ్‌లను ఇస్తుంది. ఈ స్మార్ట్ కార్ట్ అమెరికాలోని అనేక సూపర్ మార్కెట్లలో విజయవంతంగా పరీక్షించారు. కస్టమర్లు కూడా దీన్ని ఇష్టపడుతున్నారు. త్వరలో ఈ ఏఐ ట్రాలీ బండి భారత్‌లో కూడా దూసుకుపోనుంది.

విశ్వంభర V3 NEWS



# కల్కి ఒక టికెట్ కొంటే మరొకటి ఫ్రీ

పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ నటించిన కల్కి సినిమా దూకుడు ఇప్పట్లో తగ్గేలా లేదు. జూన్ 27న విడుదలైన ఈ సినిమా కేవలం రెండు వారల్లోనే రూ.1000 కోట్ల వసూళ్లు రాబట్టింది. ఇక వరల్డ్ వైడ్ లోనూ ప్రభాస్ సినిమా దుమ్ము రేపుతోంది. ప్రస్తుతం కల్కి థియేటర్లు హౌజ్ ఫుల్ బోర్డులతో కళకళలాడుతున్నాయి. ఇక శుక్రవారం (జులై 12) విడుదలైన భారతీయుడు 2 కూడా నెగెటివ్ టాక్ రావడంతో కల్కి కలెక్షన్లు మరింతగా పెరిగే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఓ ఐ మ్యాక్స్ థియేటర్ యాజమాన్యం సినిమా ఆడియెన్స్ కు ఒక బంపరాఫర్ ఇచ్చింది. ఒకటి టికెట్ కొంటే మరోక టికెట్ ఫ్రీ అంటూ ప్రకటించింది. అయితే ఈ ఆఫర్ అందరికీ కాదు. కేవలం ఫ్యామిలీ అండ్ ఫీమెల్ ఆడియెన్స్ కు మాత్రమే. అది కూడా వరల్డ్ బిగ్గెస్ట్ ఐ మ్యాక్స్ స్క్రీన్ థియేటర్‌లో మాత్రమే. ఇక్కడ ప్రధానంగా గమనించాల్సిన మరో విషయమేమిటంటే. ఈ ఆఫర్ కూడా ఇండియాలో కాదు. అమెరికాలోని లాస్ ఎంజెల్స్ బిగ్గెస్ట్ ఐమ్యాక్స్ స్క్రీన్ టీసీఎల్ చైనీస్ థియేటర్లో మాత్రమే. కల్కి సినిమాకు ఓవర్సీస్ లోనూ సూపర్ రెస్పాన్స్ వస్తోంది. కనివినీ ఎరుగని రీతిలో కలెక్షన్లు సాధిస్తోంది. ఈ నేపథ్యంలో డైరెక్టర్ నాగ్ అశ్విన్ శనివారం (జూలై 13) లాస్ ఎంజెల్స్‌లోని టీసీఎస్ చైనీస్ థియేటర్‌ని సందర్శించనున్నారు. ఈ సందర్భంగానే డైరెక్టర్ తో కలిసి సినిమా చూసేందుకు ఫ్యామిలీ, ఫీమేల్ ఆడియన్స్‌నిక ఐమాక్స్ టీసీఎల్ చైనీస్ థియేటర్ యాజమాన్యం ఈ బంపర్ ఆఫర్ ఇచ్చింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ప్రకటన ఇస్తూ పోస్టర్ రిలీజ్ చేశారు. దీనిని వైజయంతీ మూవీస్ సంస్థ కూడా ట్విట్టర్ లో పోస్ట్ చేసింది. ఈ ఆఫర్ చూసిన సినిమా ప్రేక్షకులు థియేటర్లోనూ ఈ ఆఫర్ ప్రకటిస్తే బాగుంటుందంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

## చనిపోతున్నానంటూ లావణ్య మెసేజ్

నటుడు రాజ్‌తరుణ్ ప్రేమ కేసులో లావణ్య పెట్టిన మెసేజ్ సంచలనంగా మారుతోంది. చచ్చిపోతున్నానంటూ ఓవైపు లాయర్‌కు మెసేజ్ చేసిన ఆమె... అడ్వకేట్, ఏబీపీ దేశం, డయల్ 112కు ఫోన్ చేసి ఇదే విషయం చెప్పారు. తన చావుకు రాజ్‌తరుణ్, మాల్వీ ఫ్యామిలీయే కారణమని చెప్పారు. నటుడు రాజ్‌తరుణ్ లావణ్య కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఇప్పుడు లావణ్య పెట్టిన మెసేజ్ అందర్నీ షాక్‌కి గురి చేస్తోంది. తాను చచ్చిపోతున్నానంటూ లాయర్, పోలీసులకు ఒకేసారి సమాచారం ఇచ్చిన లావణ్య టెన్షన్ పెట్టారు. ముందు లాయర్‌తో కేసు విషయంలో చాటింగ్ చేస్తూ తాను వెళ్లిపోతున్నానంటూ మెసేజ్ చేశారు. రాజ్‌తరుణ్ లేకుండా తాను జీవించలేనని మెసేజ్ చేసిన లావణ్య ఈ లోకం నుంచి వెళ్లిపోతున్నానంటూ చెప్పుకొచ్చారు. ఆ మెసేజ్ చూసిన లాయర్ షాక్ అయి వెంటనేపోలీసులు సమాచారం ఇచ్చారు. ఇంతలో డయల్ 112 నుంచి కూడా నార్సింగ్ పోలీసులకు మరో సమాచారం వచ్చింది. తన మెసేజ్‌లో లావణ్య ఏం చెప్పారంటే..."నేను రాజ్ తరుణ్ భార్య లావణ్యని. నన్ను క్షమించండి. నా కోసం ఉన్నందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. నేనూ ఏంటో తెలిసిన జనం నన్ను తప్పు అన్నారు. తెలియని మనుషులు నాకోసం సహాయం చేశారు. రాజ్ లేని జీవితం నేను ఉండలేను. బ్రతకలేను. ఈ ప్రపంచంలో నేను ఉండలేను. నేను అన్నీ కోల్పోయాను. నేను వ్యవస్థను నమ్మాను కానీ నేను విఫలమయ్యాను. నేను మోసపోయాను. మైండ్ గేమ్‌లు, గాసిప్స్‌తో విసిగిపోయారు. నేను ఇందులో గెలవకపోవచ్చు కానీ నేను ఇప్పటికీ దేవుణ్ణి నమ్ముతాను నాకు ఇలా చేసిన వ్యక్తులను కచ్చితంగా దేవుడు చూస్తాడు. మస్తాన్ కేసు తర్వాత ప్రతిదీ ప్లాన్ ప్రకారంతో నాతో ఆడారు. నేను మాల్వీ మల్హోత్రాని అభ్యర్థించి, వేడుకున్న పట్టించుకోలేదు. మాకూ తిన్నడానికీ తిండి లేదూ అని అడుక్కుంది అంటూ ఎంజాయ్ చేస్తున్నారు. రాజ్ పేరెంట్స్ కూడా ఒక ముఖ్య కారణం. రాజ్ మారిపోయాడు. అతను నా చావు కోరుకున్నాడు. నా చావుకు మాల్వీ మల్హోత్రా ప్రధాన కారణం. నా కుటుంబ సభ్యులకు, దిలీప్ కల్యాణ్‌కి మీడియాకు నా హృదయపూర్వక క్షమాపణలు. నన్ను క్షమించండి. అంటూ రిపోర్టర్లకు లావణ్య మెసేజ్ చేశారు. డయల్ 112కు ఫోన్ చేసిన లావణ్య... తాను చనిపోతున్నట్టు చెప్పారు. రాజ్‌తరుణ్ లేని జీవితాన్ని ఊహించుకోలేనని అన్నారు. తన చావుకు రాజ్‌తరుణ్ ఫ్యామిలీతోపాటు హిరోయిన్ మాల్వీ మల్హోత్రా ఫ్యామిలీ కారణమని పోలీసులకు చెప్పారు. ఈ సమాచారంతో పోలీసులు పరుగులు పెట్టారు.

# సన్యాసిగా మారిన హీరోయిన్

**విశ్వంభర, హైదరాబాద్:** గ్లామర్ ప్రపంచంలో క్రేజ్ సొంతం చేసుకున్న తారలు చాలా మంది ఉన్నారు. ముందుగా మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టి ఆ తర్వాత సినీ పరిశ్రమలోకి ఎంటర్ అవుతుంటారు. కెరీర్ ప్రారంభంలో చిన్న చిన్న పాత్రలు పోషించిన నటీమణులు.. ఒక్క సినిమాతోనే భారీ ఫాలోయింగ్ సంపాదించుకుంటారు. ఇక సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ చేసే హీరోయిన్స్ గురించి చెప్పక్కర్లేదు. కానీ ఒకటి రెండు చిత్రాల్లో మెరిసిన ముద్దుగుమ్మలు ఉన్నట్లుండి సినిమా ప్రపంచం నుంచి కనుమరుగైపోతుంటారు. కెరీర్ మంచి ఫాంలో ఉండగానే పెళ్లి చేసుకుని ఇండస్ట్రీకి గుడ్ బై చెప్పేస్తారు. మరికొందరు ఇప్పుడిప్పుడే సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేస్తున్నారు. కానీ ఓ హీరోయిన్ మాత్రం అనూహ్య నిర్ణయం తీసుకుంది. పెళ్లైన ఏడాదికే విడాకులు తీసుకున్న ఆ బ్యూటీ గ్లామర్ ప్రపంచాన్ని వదిలి సన్యాసిగా మారింది. పైన ఫోటోలో కనిపిస్తున్న హీరోయిన్ గుర్తుపట్టారా..? తనే బాలీవుడ్ బ్యూటీ సోఫియా హయాత్. బాలీవుడ్ ఇండస్ట్రీలో ఎన్నో సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ చేసి ఓ రేంజ్ ఫాలోయింగ్



క్రియేట్ చేసుకుంది సోఫియా హయాత్. బుల్లితెరపై బిగ్ బాస్ రియాల్టీ షో ద్వారా చాలా ఫేమస్ అయిన సోఫియా హయాత్.. ఆ తర్వాత సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ చేసింది. బ్రిటన్ లోని ముస్లిం కుటుంబంలో జన్మించిన సోఫియా.. యుక్తవయసులోనే బలవంతంగా పెళ్లి చేశారు. కానీ నటనపై ఆసక్తి ఉన్న సోఫియా బ్రిటన్ వదిలి ఇండియాకు చేరుకుంది. 2008లో క్యాష్ అండ్ కర్రీ సినిమాతో బాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. ఆ తర్వాత సిక్స్ ఎక్స్, అక్సర్ 2 వంటి చిత్రాల్లో నటించింది. 2013లో ఎఫ్ హెచ్ ఎమ్ సర్వేలో ప్రపంచంలోని అత్యంత గ్లామర్ మహిళల జాబితాలో ఎంపికైన ఏకైక నటిగా పేరు పొందింది. రోమేనియన్ వ్యాపారవేత్తను పెళ్లి చేసుకున్న సోఫియా... సంవత్సరంలోనే అతడితో విడాకులు తీసుకుంది. ఆ తర్వాత కొన్నిరోజులు ఒంటరిగా ఉన్న సోఫియా... గ్లామర్ ప్రపంచాన్ని వదిలి ఆధ్యాత్మిక ప్రపంచంలోకి వెళ్లింది. భౌతిక ఆనందాల కంటే ఆధ్యాత్మికత మార్గమే ఉత్తమని, అందుకే ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నట్లు తెలిపింది.



# 160 ఏళ్ల నాటి చీర ధరించిన అలియా

ప్రపంచ కుబేరుడు, రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ, నీతూ అంబానీల చిన్న కుమారుడు అనంత్ అంబానీ పెళ్లి ఘనంగా జరిగిన సంగతి తెలిసిందే. జూలై 12న అనంత్ అంబానీ, రాధిక మర్చంట్ వివాహ వేడుక అట్టహాసంగా జరిగింది. ముంబైలోని జియో వరల్డ్ సెంటర్‌లో జరిగిన ఈ వివాహ వేడుకలకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న టాప్ సెలబ్రెటీలు, సౌత్, నార్త్ స్టార్స్ హాజరయ్యారు. ఇక ఈ వేడుకలో బాలీవుడ్ బ్యూటీ అలియా భట్ రిఫ్రెష్ లుక్ లో కనిపించి ఆశ్చర్యపరిచింది. రోటీన్ కు భిన్నగా చీరకట్టులో కనిపించింది అలియా. సాంప్రదాయ చీరకట్టులో కనిపించి స్పెషల్ అట్రాక్షన్ అయ్యింది అలియా. అనంత్, రాధిక పెళ్లికి విచ్చేసిన అతిథుల కళ్లన్నీ అలియా చీరపైనే వాలిపోయాయి. పాతకాలపు సాంప్రదాయకమైన విధానంలో అలియా కనిపించింది. అనంత్, రాధిక పెళ్లి కోసం అలియా కట్టుకున్న చీర 160 ఏళ్ల నాటిది. ఈ చీర డిజైన్ కోసం నిజమైన బంగారం, వెండిని ఉపయోగించారని తెలిసింది. ఈ వేడుకలో భర్త రణబీర్ కపూర్ తో



కలిసి ఎథ్నిక్ వేర్ లో అల్టిమేట్ పవర్ కపుల్ గా కనిపించారు అలియా. 160 ఏళ్ల క్రితం నేసిన ఆశావళి చీర గుజరాత్ లో స్వచ్ఛమైన పట్టు 99 శాతం స్వచ్ఛమైన వెండితో కూడిన నిజమైన జరీ బార్డర్ తో రూపొందించింది. ఈ చీరలో అద్భుతమైన రీగల్ లుక్ అందించడానికి సుమారు 6 గ్రాముల బంగారాన్ని ఉపయోగించారు.

# రాత్రంతా ఇక హాయే హాయి.. కౌగిలించుకొని పడుకోవడం వల్ల ఇన్ని లాభాలా..!

మనం రోజూ చేసే చిన్న చిన్న పనులే.. మన ఆరోగ్యానికి సహాయం చేస్తుంటాయి. ముఖ్యంగా మగాళ్లు నిత్యం ఎన్నో పనులతో శారీరకంగా మానసికంగా అలిసిపోతూ ఉంటారు. వీటికి తోడు ఒత్తిడి, అనారోగ్య సమస్యలు కూడా చాలా ఇబ్బందిపెడుతూ ఉంటాయి. అయితే రాత్రిపూట మనం పడుకునే భంగిమల ద్వారా కూడా మనం స్ట్రెస్ నుంచి అలాగే ఇంకొన్ని సమస్యల నుంచి బయట పడవచ్చుట. రాత్రుళ్ళు నిద్రపోయే తప్పుడు ఒకొక్కరు ఒకొక్కలా పడుకుంటూ ఉంటారు.. కొందరు బోర్లా తిరిగి పడుకుంటారు. మరికొందరు ఎల్లికల తిరిగి పడుకుంటారు.. ఇంకొంతమంది ఓ పక్కకు తిరిగి పడుకుంటారు. అయితే కౌగిలించుకొని పడుకోవడం వల్ల బోలెడన్ని లాభాలు ఉన్నాయి అంటున్నారు కొందరు నిపుణులు వైద్యులు. అవేంటో ఇప్పుడు చూద్దాం.



**సుఖప్రదమైన నిద్ర**

మనం మన పార్ట్నర్ ను కౌగిలించుకొని పడుకోవడం వల్ల చాలా లాభాలు ఉంటాయట. భార్యాభర్తలు కౌగిలించుకోని పడుకుంటే శరీరంలో ఆక్సిటోసిన్ అనే హార్మోన్ విడుదలవుతుందట. దాని ద్వారా భార్య భర్తలు ఆరోగ్యంగా ఉంటారని అంటున్నారు నిపుణులు. అంతే కాదు మన పార్ట్నర్ ను కౌగిలించుకొని పడుకోవడం వల్ల రాత్రి మొత్తం హాయిగా నిద్రపోతారట. కౌగిలించుకోవడం వల్ల నిద్ర పట్టకపోవడం లాంటి సమస్య ఉండదు అంటున్నారు. అంతే కాదు హగ్ చేసుకొని పడుకోవడం వల్ల మైండ్ రిలాక్స్ అవుతుందట.

**ఒత్తిడి, ఆందోళన తగ్గుతుంది**

కౌగిలించుకొని పడుకుంటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతుందట. దాని వెళ్లి హాయిగా నిద్రపడుతుంది అంటున్నారు నిపుణులు. అలాగే ఉదయాన్నే చాలా ఫ్రెష్ గా ఫీల్ అవుతారట. హగ్ చేసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగు పడుతుందట. కౌగిలించుకోవడం వల్ల హార్ట్ బీట్ వేగం తో పాటు రక్తపోటు కూడా కంట్రోల్ అవుతుందట. ఎవరైనా ఒత్తిడిలో లేదా ఆందోళనలో ఉన్న వారిని హాగ్ చేసుకుంటే అది వారికి చాలా ఊరటను ఇస్తుంది. వీటితో పటు కౌగిలించుకోవడం అనేది ప్రేమను వ్యక్తపరచడానికి చక్కని మార్గం. దాని వల్ల మనం ఎంత ప్రేమిస్తున్నామో అవతలి వారికి అర్థమవుతుందట.

# కళ్లలో కనిపించే ఈ మార్పులు.. డయాబెటిస్‌కు సంకేతాలు కావొచ్చు..

ప్రస్తుతం ప్రపంచాన్ని భయపెడుతోన్న అంశాల్లో డయాబెటిస్ ఒకటి. రోజురోజుకీ ఈ వ్యాధి బారిన పడుతోన్న వారి సంఖ్య పెరుగుతోంది. మరీ ముఖ్యంగా భారత దేశంలో షుగర్ పేషెంట్స్ ఎక్కువవుతున్నారు. మారుతోన్న జీవన విధానం, తీసుకునే ఆహారంలో మార్పుల కారణంగా డయాబెటిస్ బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఒక్కసారి వచ్చిందంటే అంత సులభంగా ఈ వ్యాధి నుంచి కోలుకోవడం అంత సులువుకాదు. అయితే డయాబెటిస్‌ను త్వరగా గుర్తించి చికిత్స తీసుకోవడం ప్రారంభిస్తే మాత్రం వ్యాధి నుంచి బయటపడొచ్చని నిపుణులు చెబుతున్నారు. డయాబెటిస్ వచ్చిన వెంటనే శరీరం మనకు కొన్ని లక్షణాల ద్వారా ఆ విషయాన్ని ముందు నుంచే చెబుతుంది. ఇలాంటి లక్షణాల్లో కంటిలో జరిగే మార్పులు కూడా కొన్ని ఉన్నాయి. కంటిలో కనిపించే కొన్ని లక్షణాలు డయాబెటిస్ వ్యాధికి ముందస్తు లక్షణాలుగా చెప్పొచ్చు. ఇంతకీ ఆ లక్షణాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..

- డయాబెటిస్ వస్తే కనిపించే ప్రధాన లక్షణాల్లో కంటి చూపు సరిగా కనిపించకపోవడం ఒకటి. మధుమేహం కారణంగా కంటి కండరాలు, నరాలు దెబ్బ తింటాయి. దీంతో ఇది అస్పష్టమైన కంటి చూపునకు దారి తీస్తుంది. కాబట్టి కంటి చూపులో ఏమాత్రం తేడా కొట్టినా వెంటనే వైద్యులను సంప్రదించి సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి.
- ఉన్నట్లుండి కంటి నొప్పి సమస్య ఉన్నా డయాబెటిస్‌గా భావించాలని నిపుణులు చెబుతున్నారు. డయాబెటిక్ రెటినోపతి కారణంగా కంటి నొప్పి వచ్చే అవకాశం ఉంటుంది. ఈ సమస్య కారణంగా రక్త నాళాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది.
- కళ్లలో చీకటి మచ్చలు కనిపించడం, లేదా ప్రకాశవంతంగా కనిపించే కాంతులు కనిపించాని డయాబెటిక్ విట్రస్ హెమరేజ్‌కి సంకేతం కావచ్చు.




Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com